
ఆంధ్రసచిత్ర వారపత్రిక




40 పైసలు

22-5-70


ఉచితం!
Killicks
PRESSURE COOKER

దీనిని
ప్రవేశ
పత్రముగా
ఉపయోగించండి.



1. గసగసా 2. గన్నేరు 3. కలువ 4. చంద్రకాంత 5. రేరాణి 6. గులాబి 7. తామర 8. సంపెంగ 9. మల్లె
10. జాజి 11. గుండు మల్లె 12. మోదుగ

	1వ ఎంట్రీ	2వ ఎంట్రీ	3వ ఎంట్రీ	4వ ఎంట్రీ
A				
B				
C				
D				
E				

పేరు ______________________


చిరునామా ______________________

ఊరు ______________ రాష్ట్రము ______________

మీరు టాల్కు కొన్న దుకాణం పేరు ______________

హిమాలయా బుకే టాల్కం 5 పుష్ప పరిమళాలలో లభిస్తుంది. వసంతము, చందనము, గులాబి, మల్లె, కార్నేషను. మీకు ఏది ఇష్టం? అది మీకు ఎందువల్ల ఇష్టమో, 20 మాటలకు మించకుండా ఒక వాక్యం వ్రాయండి. 'ఎందువల్ల ననగా' అని గాని అదే అర్థము ఇచ్చు ఇతర మాటలు గాని వాడవద్దు. మీ వాక్యము యొక్క మనోజ్ఞత, నవ్యత, సందర్భ శుద్ధి ననుసరించి, దాని విశిష్టత నిర్ణయించబడుతుంది. కావున, బాగా ఆలోచించండి.

నిబంధనలు: 1. మీ ఇష్టం వచ్చినన్ని ఎంట్రీలు పంపండి. కాని, ప్రతి ఎంట్రీతో పాటు, ఒక హిమాలయా బుకే టాల్కం (టిన్) కొనగా వచ్చిన నగదు రశీదు పంపటం మరిచిపోకండి. ఒకే నగదు రశీదు మీద, ఒకటికన్న ఎక్కువ టిన్నులు కొంటే, ఎన్ని టిన్నులు కొన్నారో అన్ని ఎంట్రీలు పంపవచ్చును. ఈ ప్రవేశ పత్రం మీదనే 4 ఎంట్రీలు పంపవచ్చును. 2. ప్రవేశ పత్రములో ఇవ్వబడిన భాగాలో, మీ పేరు, పూర్తి చిరునామా, విడివిడి అక్షరములలో, వ్రాయండి. 3. మీ ఎంట్రీ అప్పి హిమాలయా బుకే టాల్కం 'పిక్-ది-ఫ్లవర్' కాంటెస్ట్, పోస్ట్ బాక్సు నం. 11078, బొంబే-20 కి, 1వ జూలై 1970 కి పూర్వమే చేరునట్లుగా, పోస్టుద్వారా పంపండి. 4. రిజిష్టరు పోస్టు ద్వారా పంపిన ఎంట్రీలు తీసుకొనబడవు. 5. వ్యక్తుల ద్వారా పంపిన ఎంట్రీలు తీసుకొనబడవు. 6. తప్పిపోయిన, ఆలస్యముగా చేరిన, పాడైపోయిన ఎంట్రీలకు మేము బాధ్యులము కాము. 7. అయిదు పువ్వులూ సరిగా గుర్తించబడిన ఎంట్రీలలోని నినాదముల విశిష్టత, మొదటి, రెండవ, మూడవ బహుమతుల నిచ్చుటకు, పరిశీలింపబడును. ఒక ప్రత్యేక న్యాయ నిర్ణేతల కూటమి ఎంట్రీలను పరిశీలిస్తుంది. వారి నిర్ణయము న్యాయమైనది, మరియు బద్ధమైనది. 8. బహుమతులు పొందిన నినాదములతో సహా, దాఖలు చేయబడిన నినాదము లన్నియు హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి హక్కు భుక్తము. వాటిని ప్రకటనలలో ఉపయోగించు కొనుటకు వారికి సర్వ హక్కులు కలవు. 9. అయిదు పువ్వులూ సరిగా గుర్తించబడిన ఎంట్రీలలో, ముందుగా చేరిన 2001 ఎంట్రీలకు, 2001 ఫిలిప్స్ 7 లీటర్ల ప్రెషర్ కుకర్లు బహుమతిగా ఇవ్వబడును. ఒకే కుటుంబము నుండి ఎన్ని ఎంట్రీలు పంపినను, ఒక్కొక్క కుటుంబమునకు ఒక్కొక్క బహుమతియే ఇవ్వబడును. కుటుంబముగా ఎవరెవరో నిర్ణయించు సంపూర్ణాధికారము హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారికి మాత్రమే కలదు. 10. ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. 11. బహుమతులు పంచి ఇవ్వబడవు. 12. పోటీ ముగింపు తేదీ తరువాత, 3 నెలల లోపల, మొదటి, రెండవ, మూడవ బహుమతులు గెల్చుకొన్న వారి పేర్లు ప్రముఖ దిన పత్రికలలో ప్రకటించబడును. 13. విజేతలందరికీ పోస్టు ద్వారా తెలుపబడును. 14. హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్, మరియు వారి ప్రచార సంస్థల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మినహాగా, తదితర భారతదేశ వాసులందరు ఈ పోటీలో పాల్గొనుటకు అర్హులు. 15. కంపెనీవారి ఏకైక నిర్ణయానుసారం, ఎంట్రీలు దాఖలు చేయు గడువు తేదీ పొడిగించవచ్చును.



1వ జూలై 1970 కి ముందటి తేదీలు వేయబడియున్న క్యాష్ మెమోలు పోటీకి అనర్హములు

లింటాస్-HBT. 40 R-143 TG

ఉత్తరాలు

కథలు

వరిచేటి నాగచంద్రావతిగారు వ్రాసిన 'అబల' కథ అద్భుతంగా వున్నది. వాస్తవానికి దగ్గర వున్నది. శారద మాట్లాడిన ప్రతిమాట హృదయాన్ని కదిలించి వేస్తున్నది. శారద జీవిలాంటి వాళ్ళు ప్రపంచ'కంలో వున్నారు కాని వాళ్ళ మధ్యగా నలిగి నతమత మవుతున్నారు. అలాంటి పేదవాళ్ళ పాట్లు కళ్ళకు కట్టినట్లు రాసినారు. దరిద్రం ఎన్ని విధములయిన వసులకు అయినా దారి తీస్తుందని నిజం తెల్పారు.

ఎల్. విశాల, [విజయవాడ]

* * *

ఇప్పటివరకు ఉత్తరాలు వ్రాయడం అలవాటు లేని నాకు 'అబల' కథ చదివిన తరువాత వ్రాయకుండా ఉండలేకుండా పోతున్నాను. ఈ కథ నాకెంతో నచ్చింది. అందులో శారద పాత్ర చాలా పటిష్టమైనది. ఎప్పటికైనా స్త్రీకి జీవితంలో పురుషుని తోడ్పాటు లేనిదే జీవించడము కష్టమని రచయిత్రి చక్కగా వర్ణించారు. కథంతా ట్రాజడీ అయినా ఎంతో బాగుంది.

కుమారి జొత్తాడ సావిత్రి, [విజయనగరం]

* * *

'వైద్యుల వ్యాధి' అన్న శర్వాణిగారి కథలో ఒక లోపం వుంది. ఆ లోపం కన్నడ మూలంలో కూడ వుండాలి మరి. యేమంటే కన్నడ రచనని శర్వాణి గారు అనువదించరు కదా. ఆ లోపం యిది: డా. గుప్తా తను చికిత్స చేసిన ఒక యువకుని గూర్చి చెబుతూ తాను తన పేషెంటు జబ్బు యేమిటో తెలుసుకోలేక యింకొక దానికై మందిచ్చానని, తత్కారణంగా ఆ రోగి మరణించాడని చెప్తాడు. ఎక్స్రేలో. కాని చివరన కథలో తన రోగి కడుపులో చేప ఎముక వుందని అది తొలగిస్తే తన రోగి జీవిస్తాడని తెలిసి వెంటనే పరుగెత్తి తన రోగిని బ్రతికించుకుంటాననటం, అలాగే తిరిగి రోగి జీవించటం జరిగిందని చెప్పారు. ఇదెలా సాధ్యం. చనిపోయిన వ్యక్తి మళ్ళీ మందిచ్చినా మందెలా పని చేస్తుంది. ఒక వేళ ఆ డాక్టరుకి మంత్రాలవీ తెలుసుండాలి. అలా అయితేనే తప్ప ఆ రోగి తిరిగి జీవించడు. ఈ సందేహం రచయిత తీరుస్తారను కొంటాను.

కుమారి వి. లక్ష్మి, [శ్రీకాకుళం]

సీరియల్

'మమత'లోని సంఘటనలు, సంభాషణలు చాలా వాస్తవంగా తెలుగు వాతావరణానికి సన్నిహితంగా వున్నాయి. రచయిత నండూరి విఠల్‌గారికి నా శుభాకాంక్షలు.

జి. దేవిప్రసాద్, [తిమ్మాపురం]

వనితాలోకం

శ్రీమతి కె. రామలక్ష్మిగారు రాసినట్లు చిన్న పిల్లలూ భర్తలూ ఒక తరహావాళ్లేమో ననిపిస్తుంది. ఇంత చక్కని వ్యాసం రాసిన రామలక్ష్మిగారికి మా అభివందనములు తెలుపుకుంటున్నాము. పత్రిక రాగానే ముందర బులుసువారి 'ధర్మపథం' చదువుతాను. ఈసారి వారి ధర్మపథంలో యోగ్యతాపత్రాలు ఎంతో బాగుంది. అపరాజిత— గొలుసునవల — సి. ఆనందరామంగారు రాసిన మొదటిభాగం, తురగా జానకీరాణి రాసిన రెండవభాగం ఎంతో బాగుంది. వాసిరెడ్డి సీతాదేవి రచన గురించి ఎదురు చూస్తున్నాము. 'అబల'—నాగచంద్రావతిగారి— రచన ఎంతో బాగుంది. ఎందరో శారదలు పడుతూన్న బాధలు కళ్లకి కట్టినట్లు రాసేరు. సోదరికి మా ధన్యవాదములు. 'జీమూతవాహనుని కథ' రచయిత శ్రీ 'తిరుమల రామచంద్రగారి అనువాదం చాలా బాగుంది.

ఉపాధ్యాయుల అన్నపూర్ణ [జయపురం]

గమనిక

అనివార్య కారణాలవల్ల ఈ వారం 'క్షేమేంద్రుని బృహత్కథామంజరి' ప్రచురింపలేకపోతున్నాము.

8—5—70 సంచికలో ప్రచురించిన 'గజ్జపూజ' సమీక్షలో చంద్రముఖిగా నటించినవారు కాంచన అని పొరపాటున ప్రచురింపబడినది. ఆ పాత్రని ధరించినవారు కల్పన అని పాఠకులు గమనింప కోరుతున్నాము.

—సం.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 22—5—'70
శ్రీ సాధారణనామ సం॥ వైశాఖ మా. బ॥ పాడ్యమి

సంపుటము : 63 సంచిక : 36

స్థాపితము
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26·00
6 మాసముల చందా	13·00
3 మాసముల చందా	6·50

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
'తలాష్' హిందీచిత్రంలో షర్మిలా ఠాకూర్



ఆశా భంగం
మైసూరు రాజ్యసభ ఎన్నిక
ఆశా జనకం
మైసూరు కౌన్సిల్ ఎన్నికలు పాతకాంగ్రెసుకి మంచి రోజులు
పొదగడానికి చాలాకాలం పడుతుంది
తెలంగాణా సమస్యకి కేంద్ర పరిష్కారం
కాంబోడియాలో విపత్కర పరిస్థితి
మూడవ ప్రపంచ సంగ్రామం
బెంగాల్‌లో నక్సలైట్ అల్లర్లు
సరే, రా నా బలమెంతో చూద్దాం
రాష్ట్రపతిపాలన
OOMMEN

22-5-70

భారతదేశంలో కార్మికోద్యమాల భవిష్యత్తు

ఈ వారం చివర లోకసభ ముగిసేముందు ఆర్థిక బిల్లుని రెండవసారి చదవటం జరిగింది. గ్రాంట్లని మంజూరు చెయ్యటం అయిపోవటంచేత సభ 'ప్రవేశపెట్టబోయే' బిల్లుని కూడా ఆమోదించింది. కావలిసి జరిగిందో లేదో చెప్పలేముకాని ఎన్నో మంత్రుల శాఖల కోరికలని చర్చించటం జరగలేదు. ఆహార, వ్యవసాయశాఖవారి కోరికలని మాత్రం పూర్తిగా పరిశీలించి ఆమోదించటం జరిగింది. పరిశీలనకిముందు ఆ శాఖమంత్రిగారు తమని తామే చక్కగా పొగడుకున్నారు.

కార్మికశాఖవారి కోరికలకి సంబంధించిన చర్చ, మంత్రి శ్రీ సంజీవయ్యగారి సమాధానాలు, తర్వాత ఆయన సహోద్యోగి శ్రీ భగత్ ఆజాద్ చేసిన ప్రకటనలు—ఇవన్నీ భారతదేశంలో కార్మిక సంబంధ బాంధవ్యాలమీద ఎటువంటి ప్రభావం కలిగి ఉంటాయో చూడవలసి ఉంటుంది.

కేంద్రం—రాష్ట్రం

కార్మిక సంఘం నివేదిక [లేబర్ కమిషన్ రిపోర్ట్] లో ఒక సూచన ఉంది. ప్రభుత్వరంగం కర్మాగారాలకి సంబంధించిన కార్మిక విషయాలమీద కేంద్ర ప్రభుత్వానికే అధికారం ఉండాలని ఈ సంఘంవారు సూచించారు. దీనిని గురించి మాట్లాడుతూ శ్రీ సంజీవయ్యగారు—ఒకప్పుడు ఉక్కు మిల్లులకి సంబంధించినంతవరకూ ఇటువంటి యోచన కేంద్రంవారు కొంత కాలం క్రితమే పరిశీలించారు, అన్నారు. జూలయినెలలో జరుగనున్న కార్మిక కమిటీ వారి సమావేశంలో ఈ విషయం చర్చింపబడుతుందనీ, త్వరలో పార్లమెంటులో తగిన శాసనాలని తీసుకు రావటం జరుగుతుందనీ కూడా ఆయన అన్నారు.

శ్రీ సంజీవయ్యగారు తర్వాత ఉభయ నిర్వాహక సంఘాలని గురించి మాట్లాడారు. ఒక కార్మికుడిని ప్రతి కంపెనీలోనూ డయిరెక్టరు చెయ్యాలని పరిపాలనా సంస్కరణ సంఘం [ఎడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ కమిటీ]వారు అన్నారన్నారు. ప్రభుత్వంవారేమో 'వాటాదార్ల' పథకం ఒక దానిని ఉదహరిస్తున్నారన్నారు. ఈ పథకంకింద కార్మికులు కూడా వాటాదార్లు అవుతారుట. ఈ పథకాన్ని ముందు ప్రభుత్వరంగంలో తర్వాత ప్రయివేటు రంగంలో అమలుపరుస్తారుట.

కొన్ని ప్రభుత్వరంగం సంస్థల నిర్వాహకవర్గం [బోర్డ్ ఆఫ్ మానేజ్‌మెంట్]లో కార్మికుల ప్రతినిధిని ఒకరిని నియమించాలనే సూచనని ప్రభుత్వం స్వీకరించినదని శ్రీ సంజీవయ్య అన్నారు. ఈ విషయాన్ని గురించి మరొక సందర్భంలో పారిశ్రామికాభివృద్ధి మంత్రిగారు కూడా మాట్లాడారు. వేతన నిర్ణయసంఘం [పే కమిషన్] లో కార్మికుల ప్రతినిధి కూడా ఉండటానికి ప్రధానమంత్రి అంగీకరించారు. అయితే ఈ ప్రతినిధిని అన్ని కార్మిక సంఘాలవారూ ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని వారు అన్నారు.

నిజమయిన ప్రతినిధి

కార్మికులకి నిజమయిన ప్రతినిధి ఎవరు? దీనిని గురించి జాతీయ కార్మికసంఘంవారు ఒక అధ్యాయమే రాశారు. 'బయటివారి'ని కార్మిక ప్రతినిధిగా ఎన్నుకోవటం నిషేధించరాదని వారు అన్నారు. నిషేధం రాజ్యాంగానికి విరుద్ధం కావచ్చునన్నారు. ప్రతినిధి ఎన్నిక కార్మికులకే వదిలివెయ్యటం మంచిది, అన్నారు. నిషేధంవల్ల యూనియన్‌లు బలహీనం అవటమేకాక బయటివారి ప్రభావాన్ని అరికట్టటం తేలికగా జరిగే పనికాదన్నారు. అసలు నేటిదాకా యూనియన్లలో బయటివారి సంఖ్య 10 శాతం కన్నా ఎక్కువ ఉండదని అంచనా వేయబడింది. ఇది చట్టం అంగీకరించే శాతంకన్నా చాలా తక్కువ. అంటే, యూనియన్లలో మంచి నాయకత్వం పెరిగే ప్రయత్నాలు చేస్తే చాలు, అని కార్మికసంఘంవారు అన్నారు.

కార్మికులలో విద్య, చైతన్యం పెరిగినకొద్దీ ఈ సమస్య దానికి అదే పరిష్కారం అవుతుందని సంఘంవారు అన్నారు. ఇప్పటికే 'గుమాస్తా' యూనియన్లలో, విద్యాభ్యాసం కావలసిన కొన్ని యూనియన్లలో చిన్న ఉద్యోగాలు చేసేవారే యూనియన్ వ్యవహారాలని చక్కగా నిర్వహిస్తున్నారంటే అది నిజమన్నదానికి నిదర్శనం అన్నారు. ముందు ముందు అన్ని పరిశ్రమలలోనూ విద్యాభ్యాసం చేసిన కార్మికులే ఉంటారని కార్మికుల సంఘంవారు అన్నారు.

సంప్రదాయం

రాజకీయపక్షం దేనిలోనూ యూనియన్ అధికారి పదవిని ఆక్రమించరాదనే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని కూడా వారు సూచించారు.

ఈ సమస్యకి సంబంధించిన కొన్ని పరిణామాలకి నేటి రయిల్వేమంత్రి శ్రీ నందాయే బాధ్యులు. ఒకప్పుడు 'ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు' అనే కార్మికసంఘం మాత్రమే ఉండేది. తర్వాత శ్రీ నందాగారు కాంగ్రెసుపార్టీ తరఫున 'ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్' ని స్థాపించారు. దీనికి పోటీగా బాబూ జయప్రకాశనారాయణగారు హింద్ మజ్దూర్ సభని ప్రారంభించారు. నేడు ప్రతి పార్టీకీ ఒక కార్మికశాఖ ఉండితీరవలసిందే.

శోచనీయం

కాంగ్రెసు అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి యూనియన్లలో బయటివారు ఉండరాదు, అనే నిబంధనని విధించే పరిస్థితిలో లేదు. యూనియన్లు వచ్చి ఏభయి సంవత్సరాలు అయినప్పటికీ కార్మికులు ఇంకా బయటివారి సహాయంతో మాత్రమే నెగ్గు

ఉత్తరాలు రాసేవారికి మనవి

ఉత్తరాలు రాసేవారు ఈ కిందివి గమనించగోరుతాము.

— రచనలలో ఇంగ్లీషు లిపి వాడరాదు.

— రాసేవారి పూర్తి పేరు చిరునామా ఉత్తరంలో ఉండాలి. అంతా తెలుగు లిపిలోనే ఉండాలి.

— అన్ని ఉత్తరాలూ వ్యక్తుల పేర కాక సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రికకి రాయాలి.

—సంపాదకుడు

లొగలుగుతున్నారంటే అది చాలా శోచనీయమయిన విషయం.

బయటివారి పెత్తనమే లేకపోతే ప్రభుత్వోద్యోగుల సమ్మెలు ఇన్ని అనవసరం అయ్యేవి. వారి సమస్య లని వారే పరిష్కరించుకొనగలిగేవారు.

లోకసభ, రాజ్యసభలలో ప్రభుత్వం కమ్యూనిస్టులకి బెదరకుండా ఉంటే ప్రభుత్వోద్యోగుల సమస్యలు చాలావరకూ తీరుతాయి. ఉదాహరణకి వేతన నిర్ణయసంఘంలో కార్మిక ప్రతినిధిని గురించి యూనియన్లవారు తమలో తమరు ఒప్పందానికి వస్తే, తాము నియమించగలమని అనటం ఎన్నో పేచీలకి దారి తీస్తుంది.

ఈ ప్రకటన ఇలాగ ఉండగా స్టేట్ కార్మిక మంత్రి శ్రీ భగత్ ఆజాద్ చక్కటి ప్రకటనని ఒక దానిని చేశారు. నిర్వహణ 'బోర్డు' లో సంస్థ ఉద్యోగులు మాత్రమే ఉండాలని అన్నారు.


ఈ రకం పద్ధతులు ఉత్పత్తిని పెంచుతాయా? ఒక చిన్న కథ చెప్తాను—ఇటీవలే శ్రీ జయప్రకాశ నారాయణ ఒక కార్మిక నాయకుడిని కలుసుకున్నప్పుడు ఆ నాయకుడు చేసుకున్న ఒక ఒప్పందం గురించి అడిగారుట. ఆ ఒప్పందం తమకి సంతృప్తికరంగాఉందని ఆయన అన్నారుటగాని కార్మికులు తామసం లేకుండా పని చెయ్యమని తాము చెప్పమని అన్నారుట.

ఈ కథని బయటికి చెప్పిన శ్రీ నారాయణ జపాన్‌లో ఒక సంఘటన గురించి చెప్పారు. పయి నాయకుడే జపాన్‌లో ఒక ఫాక్టరీకి వెళ్ళారుట. అక్కడ పనిచేసే అమ్మాయిలు నీలం రిబ్బన్లు పెట్టుకుని తిరగటంచూసి ఎందుకని ఆయన కనుక్కున్నారుట. తాము కోరిన వాటికి అంగీకరించకపోతే సమ్మె చేస్తామనటానికి రిబ్బన్లుచిహ్నామని వారు చెప్పారుట. మరి ఇంతలో పని వేగం ఎందుకు తగ్గించటంలేదంటే అది జాతీయాభివృద్ధికి విరుద్ధం కాబట్టి అని వారు అన్నారుట. అటువంటిది జపాన్‌లో జరగదన్నారుట.

విదేశ వాణిజ్యశాఖమంత్రి శ్రీ బలీరామ్ భగత్ ఎగుమతులు ఎక్కువ చెయ్యటానికి కృషి చేస్తున్నారు. ఉత్పత్తి పెంగితేగాని ఎగుమతి చెయ్యటానికి సరుకు ఉండదు.

దీనికి విరుగుడుగా పారిశ్రామికాభివృద్ధిమంత్రిగారు 'మానోపలీస్' ని అరికట్టి ఉత్పత్తిని కూడా, అరికడుతున్నారు.

ఆయనకి కార్మిక శాఖమంత్రిగారు తోడ్పడుతున్నారు. ఎలాగయినా వేతనాలు పెంచాలని ఆయన సంకల్పం అని తోస్తుంది. ధరలు పెరిగితే అమ్మకం తగ్గుతుంది—అయితేమాత్రం ఏమి? ప్రజాస్వామ్యంలో కొన్ని అడ్డులు ఉండాలికదా?



పుష్ప పరిమళం

మొక్కలను చూడగానే మనకు ఆనందం కల్గించేవి వాటి వర్ణవిశేషం, పరిమళ సౌరభం. వర్ణం విషయంలో అయితే మొక్కలతో జంతువులు పోటీ చేస్తాయి కాని పరిమళం విషయంలో మొక్కలకు సాటిలేదు. పక్షులు, చేపలు, సీతాకోకచిలుకలు చాల అందంగా ఉంటాయి. వాటి వర్ణసంపద చాలా గొప్పగా ఉంటుంది. జంతువుల్లో కూడా కొన్నిటికి పరిమళం లేకపోలేదు. కాని మొక్కల పుష్ప సౌరభం దేవుడువాటికి [మనకి కూడా!] ప్రసాదించిన వరం.

మొక్కలకు, జంతువులకు గల పరస్పర సహాయ ఒప్పందానికి సంబంధించిన ఈ వర్ణ, పరిమళ విశేషాలు. మొక్కల్లో సంతానోత్పత్తికి అవసరమైన సంపర్కానికి, సామాన్యంగా గాలి తోడ్పడుతుంది. పురుష లక్షణానికి చెందిన పుప్పొడి పదార్థాలు, గాలివల్ల, స్త్రీలక్షణానికి చెందిన అండానికి చేరుతాయి. కొన్ని సందర్భాల్లో, సీతాకోకచిలుకలు, తూనీగలు, తుమ్మెదలు ఈ సహాయం చేస్తాయి.

ఈతిరగడంలోవాటిశరీరానికిఅంటినపుప్పొడి పదార్థాలు వేరు పుష్పాల అండాలకు చేరుతాయి. పుష్పాలలోని మకరందం ఆహారంగా స్వీకరించడానికి అవి పుష్పాలమీద వాలతాయి. పుష్పాలకుండే రంగు, సువాసన, కొండ గుర్తులుగా అవి ఆయా పుష్పాలను చేరుతాయి. అయితే ఈ విధంగా కీటకాల మీద ఆధారపడే పువ్వు లన్నిటికీ ఈ విశేషంలేదు. కాని గాలి మీదనే ఆధారపడే వాటికి మాత్రం ఇలాటి లక్షణాలు కనబడవు, ఈ పరిమళం సామాన్యంగా ఆకర్షణ పత్రాలనించే వస్తుంది. కొన్నిటికి రక్షక పత్రాలనించి, ఇంకాకొన్నిటికి ఆకుల నించి కూడా వస్తుంది.

ఈ పరిమళానికి ఆ మొక్కల్లో ఉండే కొన్ని తైలాలు కారణం. పువ్వుల్లో ఈ తైలాలు చాల తక్కువ పరిమాణంలో ఉంటాయి. సుమారు 15—20 టన్నులపువ్వులయితే కాని కాని ఒక కిలో తైలం రాదు. ఈ తైలం ఆ చెట్టు నిర్మాణంలోనే స్రవిస్తుంది. అదే తైలం గాలిలోకి పరిమళాన్ని వెదజల్లుతుంది. 'హాయాసింత్'అనే నీటి మొక్కలు, గులాబి, మల్లె, జాజి, తుమ్మ చెట్టుకు సంబంధించిన కొన్ని జాతులనించి సెంటు తీస్తారు. లవంగం, నిమ్మగడ్డి వంటి మొక్కల ఆకులనించి కూడా తైలాన్ని వేరు చేస్తారు.

పువ్వుల్లోలాగే పళ్లల్లోకూడా పరిమళం ఉంటుంది. పళ్లమీద ఆధారపడే జంతువులు వీటిని తిని, గింజల్ని [విత్తనాల్ని] దూర ప్రాంతాలలో పడేసి మొక్కలవ్యాప్తికి తోడ్పడతాయి. పళ్లల్లో ఉండే కొన్ని కొన్ని పరిమళ తైలాలు, వాటికి సంబంధించని మొక్కల పువ్వుల్లో ఉండడం గమనించదగింది. మొత్తం మీద ఈ తైలాలలో వేర్వేరు రకాల ఆల్డిహైడ్లు, కీటోన్లు, ఎస్టర్లు, ఆల్కహోలులు ఉంటాయి. ఒక్కొక్క జాతికి సంబంధించి ఈ వివిధ పదార్థాల పరిమాణాలు వేరువేరుగా ఉండి వాటికిసంబంధించినపరిమళాన్నిఇస్తాయి.

మొక్కల పోషణలోనూ, కొత్త కొత్త రకాల ఉత్పత్తిలోనూ, రంగుకు, ఆకారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల పరిమళానికి లోపం వస్తోంది, అని చెప్పాలి. ఉదాహరణకు పసుపు పచ్చ, ముదురు ఎరుపు రంగు గులాబీలు స్వాభావికమైన పరిమళాన్ని పోగొట్టుకున్నాయి! ప్రకృతిలో సహజంగా అయితే చెట్టు ఇలా పరిమళాన్ని కోల్పోదు. పరిమళం మీదే దాని జీవితం ఆధారపడి ఉంటుంది.


భామినీ బాడీగార్డ్!
అందే గోపాల కృష్ణమూర్తి

జల్లా పరిషత్ బస్టాపులో స్నేహితురాలితో నిల్చున్న ఉష నవ్వింది. ఎదురుగా నిల్చొన్న గోపాలం ఇబ్బందిగా ఫీలై కళ్లజోడు సర్దుకున్నాడు. ఏదో గుసగుసలాడి ఉషారుగా మళ్లీ నవ్వింది ఉష. ఈ సారి ప్రక్కమ్మాయి కూడా జాయినయ్యి ఇద్దరూ డ్యూయెట్టుగా నవ్వేరు. గోపాలాన్కి ఉక్రోషం ముంచుకొచ్చింది. సాయం ఎవరూ లేరు గాని లేకపోతే తనూ ఘోరంగా నవ్వేసేవాడే! ఇప్పుడొక్కడూ తనలో తానుగా నవ్వుకొంటే పిచ్చాడనుకొంటుంది ఉష. అంచేత నవ్వకుండా అలానే బిగుసుకుపోయి నిల్చొని, కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొన్నాడు.

పెద్ద సొదచేసికొంటూ వచ్చి ఆగింది నెంబర్ టెన్. ఉషా, స్నేహితురాలూ ఒక్క ఉదుటున బస్సెక్కి సెటిలైపోయారు మాంఛి రష్‌గా ఉన్నదేమో, ఫుట్‌బోర్డ్‌మీదే వ్రేలాడసాగేడు గోపాలం, ఉషకి అరడుగు దూరంలో.

'రైట్ రైట్' అంటూ ఈలవేసేడు బస్సు తాలూకు క్లీనరు. హాఫ్ పై చిలుకు యువక హృదయాలను, వాటిబరువునూ మోసుకుంటూ భారంగా ఆర్.కె. మిషన్ ఎత్తు ఎక్కసాగింది నెంబర్ టెన్.

ముందు సీట్లలో 'పేస్టు'లా కూరుకుపోయిన అమ్మడూల్లా, అంత రష్‌లోనూ వీలైనప్పుడల్లా వాళ్ల కళ్లల్లోకి కళ్లు కలిపేసే ప్రయత్నం చేస్తున్న బాబ్జీలూ విప్పుడు సడెన్‌బ్రేకు పడుతుందా, మొత్తం దేహాన్ని అంగుళం దూరంలో నిల్చొన్న అమ్మాజీలకు అంకిత మిచ్చేద్దా మన్నట్టున్న అబ్బాయిలూ,—

అందరూ ఒక్కసారిగా — అదిరిపడి, క్రిందపడ్డాన్కి చోటులేక ఒకరిమీదొకరు పెటిలైపోయి, తేరుకు చూచేసరికి—

ఎదురుగ వస్తున్న బస్సుతో 'ఢీ' కొనేంత పన్జేసి, తక్కున ఆగిపోయిన 'టెన్‌బస్సూ',

ప్రక్కనేఉన్న ఇసుక డబ్బలోంచి బట్టలు సర్దుకొంటూ, పుస్తకాలు ఏరుకొంటూ అయోమయంగా లేస్తున్న గోపాలం తదితరులూ, బేలమ్పు తప్పి, తమమీద వాలిపోయిన అమ్మాజీలను అలాగే అన్పుకొని, 'ఈ క్షణం శాశ్వతమైపోతే ఎంత బావుణ్ను!' అనే ఫీలింగుతో యదార్థాన్నుంచి ఊహాలోకంలోకి పరుగుతీసిన ముందు వరుస అబ్బాయిలూ!—

చేతిలో పుస్తకాల్ని సర్దుకుంటూ, మోచేతికి తగిలిన చిన్నసైజు దెబ్బలనూ, నుదుటికి గీసుకున్న గీతలనూ తనకు తనే పరామర్శించుకొంటూ, కళ్లజోడు సర్దుకుంటూ వస్తున్న గోపాలాన్ని చూసే సరికి, అంత సీరియస్ సిట్యుయేషన్ లోనూ విపరీతంగా నవ్వొచ్చేసింది ఉషకి.

ఈ లోగా బస్సులో జనాలు 'షాక్' నుండి తేరుకోవడం, 'కాస్త కళ్లు తెరిచి, వళ్లు దగ్గర పెట్టుకు నడపవయ్యా బస్సుని! అసలే ఈ సిటీ బస్సు ప్రమాదాలు ఈ ఎత్తుపల్లాల ఊళ్లో ఎక్కువైపోయినయ్!' అని ఒకరూ, 'ఔనౌనూ, మొన్న నెంబర్ సెవెంటీన్ తల్లక్రిందులై ముగ్గురు పాసింజర్లు అక్కడికక్కడే చచ్చిపోయేరు, అరడజనుమందికి పైగా కాళ్లూ, చేతులూ ఊడిపోయినయ్! రాత! విమానాలూ, రైళ్లూ అనుకుంటే వాటిని మించిపోయినయ్ ఈ బస్సు ప్రమాదాలు! 'అని మరొక నడిమి వయస్కుడూ,' 'అదేనేవిటి, 'ఎల్లమ్మతోట జంక్షన్'లో డౌను దిగుతూ బ్రేకులొదిలేసిన నెంబర్ ట్వెంటీ సంగతేం చేసేరు? డ్రైవరు వప్పెపోయేడు! ముందు వర్సలో ఆడంగులు ఆనవాలు తెలీకుండా పచ్చడై పోయేరు! అన్ని ఏక్సిడెంట్లు జరిగినా ఈ డ్రైవరుగాళ్లకు బుద్ధిరాదు!'— అంటూ మరొక 'ముందువా' మార్కు బట్టతలాయనా — స్టేట్‌మెంట్లీయడం, అందరూ జాగ్రత్తగా సర్దుకున్నాక విష్లేసేవాళ్లు విష్లేస్తుండగా, సీరియస్‌గా తిట్టేవాళ్లు కండక్టరుకీ, డ్రైవరుకీ తిట్లేస్తుండగా—మెల్లగా 'అప్పు' ఎక్కసాగింది నెంబర్ టెన్.

వెనకాల జనాలు బవ్ 'షాక్' నుండి తేరుకొన్న సమయంలో, అబ్బాయిల స్పర్శతాలూకు 'షాక్'నుండి అమ్మాయిలూ, వాళ్లస్పర్శ తాలూకు 'షాక్'నుండి అబ్బాయిలూ కూడా ఓ మోస్తరుగా తేరుకున్నారు. మరీ 'క్లోజప్పు' షాకు తిన్న అమ్మాజీలు 'ఏక్సిడెంట్లు కూడా అప్పుడప్పుడు మధురంగా ఉంటాయ్ సుమ్మీ!' అన్నట్టు భుజంమీదకు తలవంచేసుకొని ప్రక్కనున్న స్నేహితురాళ్ల వైపు చూస్తూ ముసిముసిగా నవ్వేసుకోసాగారు. ఉష మాత్రం మెడను వెనక్కుతిప్పి ఫుట్‌బోర్డ్‌మీద వ్రేళ్లాడుతున్న గోపాలాన్ని చూసి మళ్లీ నవ్వింది; సరిగ్గా అదే సమయానికి గోపాలం కళ్లజోడు ఆ విషయాన్ని కనిపెట్టేసింది. 'బస్సు దిగనీయ్, ఈ పాప పని చెప్తా'ననుకొన్నాడు గోపాలం.

మరో రెండు స్టాపుల తర్వాత కాలేజీ గేటు దగ్గర బస్సాగింది. ఫుట్‌బోర్డు దిగి పక్కనే నిల్చున్న గోపాలం చేతిలో, —ఎటో చూస్తున్నట్టుగా ముఖం పెట్టి, వరధ్యాన్నం నటించి, టిక్కెట్టు ముక్క పెట్టేస్తూ ఠీంగున దిగింది ఉష. ఆ సీను చూసిన ముగ్గురబ్బాయిలూ, ఇద్దరమ్మాయిలూ ఘొల్లున్నవ్వేరు! గుటకలు మ్రింగడం మినహా అప్పటికేం చేయలేక పోయాడు గోపాలం.

* * *

రెండురోజులు ప్రిపేరయ్యి, వో శని వారం మధ్యాహ్నం లైబ్రరీ దగ్గర కాసి, ఒంటరిగా వస్తున్న ఉషకి అడ్డమెళ్లి ఆపేడు గోపాలం. ఏ మాత్రం బెదరలేదు ఉష. 'యస్, వాడ్యూవాంట్?' అన్నది దీమాగా, కాన్వెంట్ ఇంగ్లీషు నంతట్నీ ఉపయోగించి. ఆనక మళ్లీ అందంగా నవ్వింది. అంతే! సబ్జెక్టు మర్చిపోయేడు—'సోల' ఐపోయిన గోపాలం. ('సోలై'పోవడమంటే అమ్మాయి నవ్వే సరికి ఐసైపోయి, కుంచించుకు పోవడం, ఆనక బొటనవేలి గోరు తినేస్తుండడం అట!).

'అరె, మీ బొటనవేలి గోరు తినేస్తున్నారు. అరక్క అజీర్తి చేస్తుంది, అసలు సంగతేవిటో చెప్పండి మిస్టర్ గోపాల్!' అంటూ ఇంకా అందంగా నవ్వింది ఉష.

'ఆఁ! నాపేరు కూడా మీకు తెల్సి పోయిందా! ఆహా!' అని బైటి కందామనుకొని, సంతోషాతిశయం మూలంగా నోరు పెగలక, అవధులు దాటేస్తున్న ఆనందాన్ని పట్టలేక, పక్కనే ఉన్న 'ఎలక్ట్రిక్ పోలు' ఎక్కేయబోయేడు గోపాలం!

"దాన్నిమొట్టికాకరణి, అప్పుడప్పుడు లూజ్ కనెక్షన్స్ మూలంగా షార్టయ్యి షాక్కొట్టేయగలదు. ఇంతకీ సంగతేవిటీ?' అంటూ పగలబడి నవ్వింది ఉష.

'మీరు నన్ను చూసి ఎందుకు నవ్వేరు?'—అని ఇంకేం అడగ్గలడు గోపాలం? అంచేత అడగలేక అలాగే ఉండిపోతే ఉష చొరవగా ముందుకొచ్చి 'చూడండి మిస్టర్ గోపాల్' ప్రస్తుతం మీ పొజిషన్ ఎలావుందో నాకు బోధపట్టం లేదు. బహుశ మిమ్మల్ని చూసి నేనెందుకు నవ్వేనని అడగాలన్నది మీ ఉద్దేశ్య మనుకొంటాను. అదే అయితే చెప్తున్నా వినండి — ఆ రోజు మీరు మొఖానికి కొట్టుకున్న కోటింగ్ డ్రామా ఏక్టర్ మేకప్‌ను గుర్తుకు తెచ్చింది. సరిగ్గా ముసుముకోక అర్జెంటుగా వచ్చేసేరేమో, మెడనిండా, ముఖంనిండా డబ్బా స్నర పౌడరు కన్పిస్తుంటే 'ఎవరీ కెండిడేటు?' అన్నేనడిగితే, నా ఫ్రెండు మీరు ఫలానా గోపాలమనీ, ఫలానా చదువు చదూతున్నారనీ చెప్పింది. మీ కోటింగూ వ్యవహారం చూసి మరి నవ్వు నాపుకోలేక పోయాను! తెల్సా?' అంటూ మళ్లీ నవ్వింది.

ఈసారి గోపాలం ఉష నిల్చొన్నచోట నేలమీద ఏవిటో వెదకసాగేడు.

'సీ మిస్టర్! ఏవిటివెదుకుతున్నారు?' అన్నది నవ్వాపేసి, అయోమయంగా చూస్తూ.

'అ...అబ్బే...మరి,...మరి... అందమైన అమ్మాయిలు నవ్వితే నవరత్నాలు రాల్తాయని అంటారు గదా... అవేమైనా కాస్త ఏర్పాటైనవేమోనని...' నసిగేడు గోపాలం.

'విట్లెయ్యడం ఇంక ఆపండి మిస్టర్!' సీరియస్‌గా ముందుకు నడిచింది ఉష.

'సా...సారీ...'

'వెనకాలొస్తూ సారీగానాలు పాడక్కర్లేదు. ఇంక మీరు వెళ్లొచ్చు!'

'అబ్బబ్బ...ఏం విట్టేసేరు! అహాస్టా! మేడమ్. మీ విట్టు అద్భుతం, అమోఘం! గత అయిదారేళ్లుగా ఇంతటి విట్టు ఎక్కడా పేల్లేదు. నిజం చెప్పొంటే నా 'నవరత్నాల విట్టు' మీ మనసు కెంతో నచ్చేవుంటుంది. నా ఎదురుగ్గా నవ్వితే బావోదని, ఇంటికెళ్లి నవ్వుకుందామని నవ్వునాపేసి పెట్టుకున్నారు కదూ, ఔనుకదూ, చెప్పరూ, ప్లీజ్!...'

'షటప్!' అన్నది ఉష విసురుగా.

'ఎవరే, ఈ బాడీగార్డు?'— అన్నది అప్పుడే అక్కడ ఎదురైన సుందరి.

'ఈయన విట్టేసేట్ట! నవ్వమని బలవంత పెట్టేస్తున్నాడు!'

'పోనీ నేన్నవ్వనాండీ 'విటాచార్య' గారూ? హి...హి...హీ...చాలా?' అంది వెక్కిరిస్తున్న ధోరణిలో సుందరి.

'ఒక్రెండు మూడ్నాలుగ్గు... ఐదారేడెనిమిది...పది...పన్నెండు...అరె, సగం నోరు తెరిస్తేనే పాతికపళ్లు బైట పడ్డాయ్, పూర్తిగా ఐతే హో నలభై పైచిలుకు ఉన్నట్టున్నాసే మీ పళ్లు? మీరే పేస్టు వాడ్తారూ? రేపట్నుంచి అది మార్చేయండి...?' గడగడా అనేసాడు పక్కమ్మాయితో గోపాలం. చిన్నబుచ్చుకుని మూతిని సున్నాలా చుట్టేసుకొంది సుందరి.


'మీ ఉచిత సలహాకు సంతోషించాం. ఇంకే బాడీగార్డుపని మాని, వెళ్లి రావచ్చు...' అంది ఉష.

'వెళ్లి రావచ్చా? ఎంతసేపట్లో? ఎక్కడికి?...'

'మిస్టర్, విట్లెక్కువవుతున్నాయ్, కంట్రోల్ యువర్‌సెల్ఫ్!' హెచ్చరించింది ఉష. ఉడుక్కోలేదు గోపాలం. పైగా, ఇంకా అనుసరిస్తూనే 'నేను మీకు బాడీగార్డునా? సరే, ఈవేళ్టినుండి అదేపనిచేస్తా! మాకు బాడీగార్డునవడం నాకిష్టమే! ఐతే కిట్. ఒకే— సీయూ!' అంటూ ముందుకు వెళ్లిపోయేడు.

ఆనాటి నుంచీ గోపాలం ఉషను కేంద్రంగా, మూడడుగుల వ్యాసార్ధంతో ఒక వృత్తం నిర్మించి, ఉష హాస్టలొదిలిన మరుక్షణం నుండీ, ఆ వృత్తంలోలోపలే మసల సాగేడు. ఉషపాప బీచ్‌కి షికారెళ్లినా, టౌన్‌కి షాపింగుకెళ్లినా, మరెక్కడికెళ్లినా, కూడానే ఉంటూ 'పాప' వంటిమీద ఈగనైనా వాలనీయ [illegible] టువ తెలిసీ తెలియని ఈగ ఏదైనా ఉష మీద వాల్తే, దాన్ని తరిమి పట్టుకొని రెక్కలుపీకి, కాళ్లు విరిచేసి చంపేసేవాడు. ఏ స్నేహితుడికైనా 'గోపాలం ఎక్కడున్నాడూ?' అనే అనుమానమొస్తే, ఎక్కడ ఉష ఉందునో, అక్కడే గోపాలం ఉంటును!' అంటూ ప్రతి రెండోవాడూ అతని అనుమానం వెంటనే తీర్చేస్తాడు. లేకపోతే, 'అరె, ఇప్పుడే ఉష అలా లైబ్రరీవైపు వెళ్లింది, ఆ చుట్టుప్రక్కల మూడొందల అరవై డిగ్రీలలో ఏదో ఓ ఏంగిల్‌లో గోపాలం ఉండగలడు, అని అతని ఎడ్రస్ చెప్పేయగలరు. ఆఖరికి గోపాలం టెలిగ్రాఫ్ ఎడ్రస్ 'కేరాఫ్ ఉషా'గా మారిపోయి కూర్చుంది. ఇలాగ మూడ్నెల్ల కాలంలో ఉష ఏడనే నడుస్తూ మూడు జతల ఎక్స్‌పెన్సివ్ బూట్లు అరగొట్టేసిన గోపాలం అంటే ఆవూరి 'బాటా' షాపు వాళ్లకి ఎంతో అభిమానం, ఆదరణాను! 'మీలాంటి వారి మూలంగానే మిస్టర్ గోపాల్, మా బూట్లకంపెనీ దిన దిన ప్రవర్ధమాన మౌతుంది, మీకివే మా జోహార్లు!' — అంటూ గోపాలానికి అంజలి ఘటించేవాడు జోళ్లకొట్టు సేల్స్‌మేన్. ఇంకో ఆయన 'మీ బూట్ల ఉత్కృష్టమైన అరుగుదల రహస్యమేమిటీ?' అంటూ ఫొటోతీసి, ఇంటర్వ్యూ చేసేడు. 'ఉష!' అన్నాడు గోపాలం సగర్వంగా. 'ఆమె చల్లగా ఉండాలి. ఆమెలాంటి అందమైన అమ్మాయిలంతా చల్లగా ఉండాలి! అప్పుడే మా షాపు వర్ధిల్లుతుంది. దేవుడు ఉషను ప్రోచుగాక!' అంటూ హోల్డ్ సేల్స్‌మేన్ ఆశీర్వదించాడు, గోపాలాన్కి మరికొత్త బూట్లజతను అందిస్తూ.

'అదుగో, ఉష బాడీగార్డు!' అంటూ చెవులు కొరుక్కునేవారు ఉష స్నేహితురాళ్లు. కొన్నాళ్లకి వాళ్లూ వాళ్ల బంధుమిత్రులూ అంతా గోపాలం పేరు 'గోపాలం' అని పూర్తిగా మర్చిపోయి కేవలం 'బాడీగార్డు' అనే వ్యవహరించే వాళ్లు. 'ఉష పాపకి కూడా బాడీగార్డు బాగా అలవాటైపోయాడు. బైటికొస్తే బాడీగార్డు కన్పించకపోతే ఏదో వస్తువును



కొట్టేయనట్టు ఫీలయ్యేది. బాడీగార్డుం టే వేగావి షాపింగుకీ, టిఫిన్ షాపుకీ వెళ్ళ బుద్దేసేదికాదు ఉషకి.

'ఏంవోయ్. మధ్యాహ్నం పిక్చర్ కెళ్తున్నట్టు బాడీగార్డ్కి తెల్సా?' అన్నది సుందరి ఆ ఆదివారం మధ్యాహ్నం 'లంచ్' తీసుకుంటూ.

'ఈవేళ ఎక్స్పెక్ట్చేసి జంక్షను కాస్తేస్తుంటాడు. నీకేం అనుమానం అక్కర్లేదు' అన్నది.

'ఏవిధంగా చూస్తుంటే నువ్వే అతన్ని ఎంకరేజ్ చేస్తున్నట్టున్నావోయ్ ఉషా. అతను నీవెనకాల పడడం నీకానందంగా ఉన్నట్టుంది కానా?'

'ఊర్కోవోయ్, నాకేం ఇంట్రెస్టు? నా వెనకెందుకొస్తావని అడిగేందుకు మనకేం హక్కుంది? ఒకవేళ అలాగే అడిగితే 'ఈ రోడ్డు మీ గ్రేండ్ఫాదరు వెయ్యించేడా?' అంటాడు బాడీగార్డు, 'నాతోబాటు సినిమాకెందుకొచ్చావ్?' అంటే 'ఈ సినిమాహాలు మీ అంకుల్గారేమైనా కట్టించేడా?' అంటాడు. అప్పుడేం చేస్తాం?' అడిగింది ఉష, సర్వర్కి 'ఐస్క్రీమ్' తెమ్మని ఆర్డరిస్తూ.

'అలాక్కాదు. పలుగురిలోనూ వాణ్ణి ఆపుజేసి, 'హాయ్, అలా నా వెనకపడ్డానికి సిగ్గులేదూ?' అని దులిపెయ్.'

'ఒకవేళ 'సిగ్గులేదు,' అని ఒప్పేసుకుంటేనో?'

'నీ ఖర్మ, అనుభవించు!'

'పోన్లేవోయ్, అలా వెనకాలొస్తే పోయిందేముంది, ఏదో విజిల్ వేస్తుంటాడు, వేస్తే నవ్వుతాం. లేప్తే లేదు. చాలా మంది అసహ్యంగ చేసే అల్లరికంటె బాడీగార్డు అందంగా చేసే అల్లరి ఏవిధంగా మెచ్చుకోదగ్గదే! అసలు అందంగా అల్లరిచెయ్యడం గొప్ప 'ఆర్టు' సుమా! ఆ 'ఆర్టు'లో బాడీగార్డు అందెవేసిన చెయ్యి!'

'బస్ బస్ బస్ ... చూస్తుంటే మెల్లగా మనసును బాడీగార్డుకి అంకితం చేసేస్తున్నావల్లే ఉంది...'

'చక్!' అంది ఉష 'లంచ్' ముగించి లేస్తూ.

'కమాన్, త్వరగా తెమిల్తి డ్రెస్ చేస్కో' అంటూ రూమ్కి పరుగెత్తింది

ఖాపిస్...

ఉష.

* * *

చీరలు వెదుకుతూ 'రోజ్ కలర్ శారీ' సెలక్టుతీసి పట్టుకొంది ఉష. ఈ శారీ బాడీగార్డుకి మహా చెడ్డ ఇష్టం. 'అన్నింటికంటె మీకు గులాబిరంగు శారీ చాలా బాగా సూట్ అవుతుంది. ఉషా. రోజ్కలర్ డ్రెస్సూ, జారిపోతున్నట్టుగా మీరు ఏర్పాటు చేసుకొనే గులాబీపువ్వు—వీటితో మిమ్మల్ని చూసినప్పుడు గులాబీ ఏదో, ఉష ఏదో పోల్చి చెప్పుకోవడం గొప్ప కష్టమై పోతుంటుంది! ఈ డ్రెస్లో మిమ్మల్ని చూడ్డం నాకెంతో ఇష్టం!' అన్న బాడీగార్డు మాటలు గుర్తుకొచ్చి అలాగే రెండునిముషాలు నిల్చుండిపోయింది ఉష.

'హాయ్, ఏమిటోయ్ తన్మయత్వం ఫీలవుతున్నావ్. వోహో, బాడీగార్డుగారికి ఇష్టమైన డ్రెస్ తీసి, పగటి కలలుకనేస్తున్నావా? ఐసీ ... నే చెప్పలేదూ? మనసు 'కేరాఫ్ బాడీగార్డు'గా మారిపోతుందనీ!...' అప్పుడే అక్కడికొచ్చిన సుందరి ఉష మనసును చదివేసింది.

'ఊర్కోవోయ్, అటువంటి దేమీలేదు. కావలిస్తే చూడు, ఈ వేళ అతనికి 'లెఫ్ట్ అండ్ రైట్' ఇచ్చేస్తా! సరేనా? అన్నది ఉష, ఉడుక్కుంటున్నట్టుగా మూతిపెట్టి.

'చూద్దాంగా!' అన్నది సుందరి.

'చూద్దాం!' అన్నది ఉష.

'నడు నడు ... తెములు, లెఫ్టండ్ రైట్ ఇచ్చేస్తావో, మనసు తీసికెళ్ళి అర్పించేస్తావో...' అంటూ బైటికి పరుగెత్తింది సుందరి.

రెండు నిముషాల్లో టాయిలెట్ అయి బయల్దేరింది ఉష. పక్కరూంలో బాతాఖానీ ఆపుజేసి ఉషను జాయినయ్యింది సుందరి.

'అరె, బాడీగార్డు లేడే?' అన్నది ఆశ్చర్యంగా ఉష, జంక్షన్లో ఎవరూ లేకపోవడం చూసి.

'ఔను, నిజమే! ఎనిమిదో వండర్!' అన్నది సుందరి. ఐదు నిముషాలు జంక్షన్లో ఆగి, 'నడవ్వోయ్, మెల్లగా నడుద్దాం, అనకవస్తే బస్సెక్కుదాం!' అన్నది ఉష.

'నాకుతెల్సు నాకు తెల్సు, ఎందుకు నడుద్దాం అంటున్నావో?' అంటూ సంబరపడి పోయింది సుందరి.

'ఎందుకూ?' అయోమయంగా ఉష.

'ఎందుకా, బాడీగార్డు లేటు కవరు చేసుకుంటాడని నువ్వు...'

'షటప్!' కోపం అభినయించింది ఉష.

'సర్లేగాని, చూడు, జనం ఎలా నీ వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారో?'

'ఎందుకూ?' మళ్ళీ అడిగింది ఉష.

'వెనకాల బాడీగార్డు లేకపోయే సరికి ప్రపంచంలో 'ఎనిమిదోవింత' ఏమిటో వాళ్ళకి తెల్సిపోయింది!' అన్నది సుందరి.

'ఏమిటి సుందరీ, ప్రతి విషయాన్ని తీసుకొచ్చి ఆఖరికి బాడీగార్డుకి కనెక్ట్ చేస్తావ్! అది తప్పితే మనకి వేరే టాపిక్కులేవా? ఈ లెక్కన నాకంటె ఎక్కువగా నువ్వే అతన్నిగురించి ఆలోచిస్తున్నట్టున్నది. కానా?'

'కాహోను! ఇందాకట్నుంచీ కళ్ళు వెనక్కువెనక్కు చూస్తున్న దెందుకేమో మరి?...' 'జోకింది' సుందరి.

ఏదో అనబోతున్న ఉష, ప్రక్కనుంచి వెళ్తూ 'అరె, గోపాలమేడీ?' అన్న ఇద్దరబ్బాయిల ప్రశ్న విని ఉలిక్కిపడింది.

'హలో ఉషా, పిక్చర్కా?...అరె, వేరీజ్ యువర్ బాడీగార్డ్?' కనుబొమ్మలు పెద్దవి చేస్తూ ఆశ్చర్యంగా నోరావిలేసింది ఎదురుగా వస్తున్న కామాక్షి.

'అమ్మాయిగారూ, రిక్షా తెమ్మంటారామ్మా? అరె, కళ్ళద్దాల బాబుగారేరమ్మా?' అప్పుడప్పుడు కట్టే— ముఖం గుర్తున్న రిక్షావాడు విస్తుపోయాడు.

'అమ్మా ఉషమ్మగారూ, గోపాలంగారేరమ్మా, ఆయనకో టెలిగ్రాం వచ్చింది... ఎక్స్ప్రెస్ టెలిగ్రాం!' టక్కున ఎర్ర రంగు సైకిలాపి, కంగారుపడి, అడిగేస్తూ నిల్చుండి పోయాడు 'టెలిగ్రాం వాడు.'

'ఏమిటమ్మా, పొద్దట్నుంచి యిస్తున్నమ్మన్నారు, మళ్ళీ రూమ్లో యిప్పుడదా కనిపించనేలేదు, కాస్త అడిగెదూ చెప్పండమ్మా గోపాలం బాబుకో...'

రోడ్డుమీద అడ్డంగా ఆపుజేసి అడిగేసి వెళ్ళిపోయింది పాలమనిషి.

ఉషకి చిర్రెత్తిపోయింది. ఏం చెయ్యాలో తోచలేదు. దానికితోడు పుండు మీద కారం జల్లినట్టు సుందరి నవ్వు! ఉక్రోషం పట్టలేక 'సుందరీ, విల్ యూ ప్లీజ్ స్టాప్ లాఫింగ్?' అని అరిచింది.

'మొగుడు మొట్టినందుక్కాదుట, తోడికోడలు నవ్విందని ... ఆ సామెత విన్నావా ఉషా?—' నవ్వాపుకొంటూ అన్నది సుందరి.

'ఐతే నువ్వు నా తోడికోడలివా? నా ఖర్మ!' మాటకు మాట జవాబు చెప్పే ధోరణిలో అన్నది ఉష.

ఫక్కున్న నవ్వి, ఆపి, 'ఐతే నీ మొగుడూ...' అంటూ కళ్ళు చక్రాల్లా తిప్పి, దూరంగా జరిగింది సుందరి.

'షటప్!' బస్సు షెల్టర్‌లో ఆగిపోయింది ఉష.

'అలా ఉడుక్కుపోకోయ్ గోపాలంగారు రాలేదనివేళ! కంగారు పడకు, థియేటర్లో ఏర్పాటైపోతారు బాడీగార్డుగారు, ఐతే, అదిగో బస్సొస్తుంది...'

బస్‌రావడం తరువాయి, ఛెంగున గెంతినట్టు ఎక్కి కూర్చున్నది ఉష. 'టికెట్ ప్లీజ్!' అన్న కండక్టరు ఉష చుట్టూ కలయజూసి, గోముగా నవ్వుతూ 'గోపాలం బాబేరమ్మా?' అన్నాడు. 'రాస్కెల్,!' అంటూ లేచి నిల్చుంది ఉష.

'ఎవరూ, ఆయనా, నేనా?' అన్నాడు కండక్టరు, అమాయకంగా.

'నువ్వే, నువ్వే రాస్కెల్‌వి, నువ్వే ఇడియట్‌వి, నువ్వే ఫూల్‌వి...' కోపంతో ఉష చెక్కిళ్ళు ఎర్రబడ్డయ్. సుందరి కూర్చోబెట్టేసి, ఊరుకోబెట్టింది.

'ఇంకానయం, గోపాలంబాబు నన్నా రనుకొన్నాను, నన్నే ఐతే ఫర్వాలేదు—' దూరంగా వెళ్ళిపోతూ గొణుక్కున్నాడు కండక్టరు.

మూడ్ చెడిపోయింది ఉషకి. దాంతో సుందరికూడా సీరియస్సైపోయింది. ఇద్దరూ నిశ్శబ్దంగానే సినిమాలో కూర్చుని కాస్సేపు నిద్రపోయి, ఎలాగో చిరిగినంతా గడిపేసి, గబగబా లేచి, బైటికొచ్చేసి 'కాస్త కాఫీ తాగుదాం నడవ్వోయ్!' అనుకుంటూ పక్కనే ఉన్న 'ఊటీ హోటల్'లో దూరేరు. ఎయిర్ కండిషన్డ్ రూమ్ తలుపుతెరిచి లోపలికి అడుగు పెట్టిన ఉష ఒక్కసారి ఆగిపోయింది.

ఎదురుగా—

బాడీగార్డు!

మధ్యాహ్నం జరిగిన సంఘటనలూ, వళ్ళుమంటా, సినిమాతాలూకు తలనొప్పి అన్నీ కల్సి ఉషని వెర్రెక్కించినయ్. 'ఐవిల్ సీ ది యెండ్ ఆఫ్ దిస్ ఫెలో టుడే'—పళ్ళు పటపట లాడిస్తూ లోపలికివెళ్ళి గోపాలం ఎదురుగ్గా కూర్చున్నది.

ఆ క్షణాన వెయ్యివ్వర ట్యూబులైట్ల కాంతితో గోపాలంముఖం మెరిసిపోయింది. అప్పటివరకూ ఎదురుగావున్న ఇడ్లీ ప్లేట్‌మీద 'వర్క్ చేయడం' మర్చిపోయి, అమాంతం 'సోలై'పోయాడు! ఆ 'సోల' ఐపోయే ప్రోసెస్‌లో తన చేతిగోళ్ళన్నీ అయిపోవడంతో. ప్రక్కనున్న పల్లెటూరి ఆసామి చేతి గోళ్ళవైపు ఆప్యాయంగా చూడసాగేడు. ఆసామీ అనుమానంగా చేతిని కోటుతాలూకు లోపలిజేబులో పదిలపర్చుకొన్నాడు. దాంతో, గోపాలం ఏంచి డిసప్పాయింట్ ఆయిపోకుండా, ఎదురుగా కూర్చున్న 'ఉషపాప' చేతివైపు గోముగా, లాలనగా చూసేడు. ఉషపాప సన్నగా, చురకల్లాగ, తీర్చిదిద్దినట్టు ఎంతో అందంగా వున్నయ్! పైగా ఎర్రటిరంగు వేయించుకుని చూడ ముచ్చటగా వున్నయ్! ఇంకా అటునుంచి రెండోవేలికి నవరత్నాల 'రింగు' కూడా ఏర్పాటై ఉన్నది.


'అబ్...బ్...బ్బ! ఆ గోళ్ళను తినేస్తే యెంత బావుణ్ణు!' అనే తలపొచ్చిన గోపాలం ఆనందాన్ని ఆపుకోలేక, వేళ్ళు నమిలేస్తూ, చుట్టుప్రక్క లెక్కడైనా 'కరెంటుపోలు' ఉందేమోనని కలయజూసేడు. 'ఎయిర్ కండిషండ్' రూమ్ మూలంగా ఆ యేర్పాటేమీ లేకపోయేసరికి నిరుత్సాహం ఫీ'లవ్వు'తూ ఉష వైపు చూసేడు.

అసలే అందంగా, చిన్నగా ఉన్న మూతిని ఇంకా చిన్నిదున్నాలా చుట్టి, మెల్లోలాకెట్టును పంచదారలా చప్పరించేస్తూవున్న ఉష 'మినియేచర్ వైజయంతిమాల'లా ఎంతో అందంగా కన్పించింది దాక్షణాన!

అంతే! 'అ...అ...అ...ఉ...ఊ... ఉ...షా!' అని, అక్షరాలు మర్చిపోయినట్టు అరిచేసేడు గోపాలం, సంబరపడిపోతూ.

'ఛట్, నడవ్వోయ్ సుందరీ పోదాం!' చివ్వున లేచి వెళ్ళిపోయింది ఉష. 'ఏమైనా సరే, మనసువిప్పి ఉష ముందు పెట్టేయ్యాలివేళ?' — నిర్ణయించుకొన్నాడు గోపాలం, కాఫీ వదిలేసి.

చకచకా, టకటకా నడుచుకొంటూ 'ఎల్లిస్‌గార్డెన్స్' — అనబడే 'ఎల్లమ్మ



తోటి' ఎలెక్షన్ కొచ్చేసింది ఉష, సుందరితో ఏదో రహస్యం మాట్లాడేస్తూ. చెవుల్నిండా జుట్టు కప్పేసుకున్న సుందరికి ఉష డైలాగులు సరిగ్గా వినిపించడం లేనట్టుంది, అనుమానం 'ఆఁ, ఆఁ? ఏవన్నావ్?' అంటూ రెట్టిస్తుంది. నడుస్తూ నడుస్తూ తిన్నగా వెళ్ళి హాస్పిటల్ డౌన్—సెంటర్‌లో ఆగి గట్టిగా ఊపిరి పీల్చుకొంది ఉష.

'ప్లీజ్ లిసన్ టు మీ!' కాలిగా అడిగాడు గోపాలం, ఉష కళ్ళలోకి చూస్తూ. 'మీరొక్కసారి వెళ్ళి నిల్చోరూ? ఐ హేవ్ టు టాక్ విత్ ఉషా!' అంటూ ప్రక్కనే ఉన్న సుందర్ని రిక్వెస్ట్ చేసేడు. 'హోకే' అనకుండానే, చురచురా చూస్తూ వెళ్ళి పేవ్‌మెంట్‌మీద సెటిలైంది సుందరి.

చేతులు రెండూ నడుంమీద బిగించి, 'రోజ్' కలర్ శారీలో, తలలో జారిపోతున్నట్టుగా వాడిపోయే స్థితిలో ఉన్న 'రోజ్'తో, రోజాకంటె ఎక్కువ అందంగా (గోపాలం కళ్ళజోడుకి) కన్పడుతూ, 'హా. ఏమని వచ్చావీవేళ!' అన్నట్టు నిల్చున్న ఉషకు దగ్గరగా వెళ్ళేడు.

అసలే వాళ్ళున్నచోట జంక్షనేమో, చాలా బిజీగా ఉండడంచేత ఎవరూ ఎవర్నీ పట్టించుకొనే అవకాశం లేదు ఒక్క గోపాలం తప్ప.

'మిస్టర్ గోపాల్! ఎందుకు నన్నిలా బాధపెడ్తారు? ఎందుకు నన్నిలా గోల చేస్తారు? నైతికంగా తెలియక లవ్ మీ ఎలాగో? సీరియస్‌గా చెప్తున్నా. లేకపోతే నా జోలికి రావద్దు. అసలు వేషం చేస్తారు? ఎవ్వెందుకిలా—'

'నోనో ఉషా! నీకింకా తెలియదు. ఇంతా నేనే చేసేను. నాదే తప్పు. కారణం నాకూ ప్రేమించే హృదయముంది. అసలు అతి హృదయముంటాడు. కానిప్పుడు ఆ ప్రదేశంతో కోపమొచ్చింది—'ఉష' అనే పేరంత శ్వాస మాంసపుముద్ద ఉంటుంది. ఆ హృదయం మనం భూగోళం ఒక్కటే పడుతున్నట్టు—పాపి—కంగారు భూగోళం అన్నాను—నైన్ను ఒక్కటే తయారుచేసినట్టు 'అవే—అవే' అన్నదు 'ఉష్'

ఝాన్సీ...

ఉష్' అంటుంది. కావాలనే ఒక్కసారి వినండి ఉషా! దాన్నిండా ఉష పూర్తి పేరుకు పోయింది. ఉషే నా ప్రాణం! నా ప్రాణానికంటె అధికం. ముందు ఉష. అనక నా ప్రాణమూను! మిమ్మల్ని చూడనిదే ఒక్క క్షణం ఉండలేను, ఒక్క నిముషం బ్రతకలేను—'

'గో అండ్ హేంగ్ యువర్ సెల్ఫ్! బ్రతకలేకపోతే ఏందులోనైనా పడి చావండి, ఈ క్షణాన్నుండి మీ ముఖం చూపొద్దు—గెటౌట్—గో టు హెల్!—'

'ఉ...షా!' అంటూ అటూ ఇటూ చూసి, కంగారుగా, భయంగా, ఉషను ఒక్క త్రోపు త్రోసేడు వణికిపోతున్న 'బాడీగార్డు' ఉరఫ్ గోపాలం.

'తప్పుకోండి, తప్పుకోండి'—'అరెరె, అయ్యయ్యో!...' 'అమ్మోయ్—బాబోయ్'...'అరెరె...'—జంక్షన్‌లో భయంతో చలించిపోతున్న జన సమూహం.

'రాస్కెల్!' అంటూ పేవ్‌మెంట్ మీద త్రుళ్ళిపడింది ఉష. తమాయించుకొని, లేచి వెనక్కి తిరిగేసరికి—

హాస్పిటల్ 'అప్' నుండి అతివేగంతో దూసుకుంటూ వచ్చేసి, బ్రేకులు పనిచేయని కారణంగా విరవిహారం చేస్తూ, ఇందాక తాను నిల్చున్న చోటి మీదుగా దూసుకుపోయి ఎదురుగా ఉన్న పెద్ద గోడలోకి చొచ్చుకొని ఆగిపోయిన సిటీబస్సు, జన నిర్ఘోషం. అరుపులూ, పెడబొబ్బలూ... ఘోరం జరిగిందని జనం పరుగులు—

'అయ్యయ్యో, రక్తపు మడుగులో కొట్టుకుంటున్నాడు—ఆస్పత్రికి తీసుకు వెళ్ళండయ్యా!...' చుట్టూ చేరిన పెద్ద గుంపు—

'అరెరె, భగవాన్!...'

'చచ్చిపోయాడు కుర్రాడు! లేచిన వేళ మంచిది కాదు!'

'బస్సు ఇంకేం బతుకుతాడు, వళ్ళంతా చచ్చిపోతే!... క్షణంలో భీభత్సంగా, అరుపులూ, కేకలూ, పెడబొబ్బలూ...

క్షణంలో భీభత్సమైపోయిందా సెంటరు.

నుదుటిమీద గీరుకున్న చోట తడుముకొంటూ 'ఏ...వ...యా...డి...మ్మ...ది?...' అంటూ కంపించిపోయింది ఉష.

'ఆ కళ్ళజోడు కుర్రాడెవర్నో పచ్చడి చేసి పోయింది పెద్ద బస్సు! కుర్రాడికి నూకలు మిగల్లేదు!...' ఎవర్నో భయంగా అడిగిన సుందరికి ఎవరో సమాధానం చెప్పేరు.

'కెవ్వు'మని అరిచింది ఉష. విపరీతమైన జనసమూహం మూలంగా అతన్ని చూడ్డానికి కూడా ఏమాత్రం అవకాశం లేకపోయింది ఉషకి.

'నిజమా? సుందరి...నిజమేనా?...' కళ్ళు తిరిగి కుప్పలా కూలబడిపోయింది ఉష.

'అరె...అరె...' అంటూ రిక్షాను పిల్చింది సుందరి.

* * *

'నేనే, నేనే కారణం. నన్ను క్షమించు దేవుడా! నన్ను క్షమించు!...' తలబాదుకొంటూ కొట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది ఉష.

అతని కాలేజీకి సెలవిచ్చేరు— నిన్న ప్రమాదంలో అన్యాయంగా చచ్చిపోయిన గోపాలానికి సానుభూతిగా.

ఉషను ఓదార్చలేక విసిగెత్తిపోయింది సుందరి. గుండెల్లో నెయ్యి అగ్నిపర్వతాలు బద్దలయినట్టు కంపించిపోసాగింది ఉష. 'నేను బ్రతకను... బ్రతకలేను... చచ్చిపోతా... నన్నెవరైనా చంపెయ్యండి...' పిచ్చిగా తలబాదుకున్నది.

...మధ్యాహ్నమైంది. భోజనాలు పూర్తిచేసి, మునిస్తే, అనుకోకుండా సెలవిచ్చినందుకు ఆనందపడుతూ మ్యాట్నీకి బయల్దేరిన హాస్టలమ్మాయిలు ఉలిక్కిపడి, ఎర్రబడిపోయిన కళ్ళతో పిచ్చిదానిలా చూస్తూ కూర్చుండిపోయింది ఉష.

ఒక వారం విపరీతం

ఫాలాక్షుడు

ఆహారపదార్థాలలో కల్తీ

మీరో హాహాహా అని మెచ్చుకు త్రాగే టీ—ఆ టీ పొడుంలో రంపంపొట్టు కలుస్తోందనితెలుసా. మీ రుపయోగించే నేతిలో—వెన్నలో కుళ్లిపోయిన అరటిపళ్ళు కలిపి పిసుకుతున్నారు అని తెలుసా. పాత విదీ—మీరు కొనుక్కు తినే కొన్ని వస్తువుల ద్వారా పక్షవాతం వంటి కొన్ని భయంకరమైన రోగాలొచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా... మైనోయ్.....బాబోయ్....యస్....సి. పి. హార్ట్‌మన్ అనే ఆయన ఆహార పదార్థాలలో జరుగుతున్న కల్తీలను గురించి, వాటివలని ప్రమాదాలను గురించి బెంగళూరులో ఏకరువు పెట్టారట. ఒకసారి ఉపయోగించి పారేసిన కాఫీపొడి ముద్దను ఎండబెట్టి, మళ్ళీ పొడి చేసి, రంగువేసి, గమ్మత్తు చేసి మళ్ళీ తిరిగి మనకే అమ్ముతున్నారట. కుళ్లిన అన్నాన్ని, అరటిపళ్ళను పిసికి వెన్నలో కలుపుతున్నారట. వెన్న బరువుకోసం కొండ చిలువ కొవ్వు కలుపుతున్నట్టు కూడా ఆమధ్యన వార్తలొచ్చాయి. మాదాకవళం వారంతా ఒక సంఘంగా ఏర్పడి తాము సంపాదించిన అన్నాలను ఒకచోట సమీకరించి, దాంట్లో మంచి అన్నం [!] ఏరి, సాంబారు, వాసన రాకుండా ఉండేందుకు పట్టెడు ఇంగువ రంగరించి పోసి పొట్లాలుగా ఆ అన్నాన్ని కట్టి, సాంబారు అన్నం—పెరుగూ అన్నం అని విజయవాడ స్టేషనులో ఒకానొకప్పుడు [ఇప్పుడుకాదా] అమ్ముతున్నట్టు కూడా చాలామంది అనుకున్నారు. నిజమెంతో, మిగిలిన దెంతో ఆ త్రినేత్రుడికి కూడా తెలీదు— గనుక నోయీ: నీవు తినే ఆహార పదార్థాల ధర్మాలను జాగ్రత్తగా పరిశీలించి దిగుము. నీ శరీర ఆరోగ్యాన్ని కాపాడుకునే అవసరం నీదేగదా! వ్యాపారులు వారి ధర్మాన్ని వారు వీడరు—అవును వీడరు.



విఫల ప్రేమ

22సంవత్సరాల అశోక్‌కుమార్ అనే యువకుడొ తను ప్రేమించిన యువతి రాజబాల తనను పెళ్ళాడ నిరాకరించినందుకు జీవితం మీద రోసి, పబ్లికున రెడ్‌ఫోర్ట్ [ఢిల్లీ] వెనుక భాగాని కెళ్ళి కత్తితో పొట్టలో అమాంతం పొడిచేసుకున్నాడట. దారే పోయే ఒకాయనీ సంఘటన చూసి, నలుగుర్ని కేకేస్తే అంతా చేరి అశోక్కుమార్ని ఆసుపత్రిలో చేర్చారట.

ప్రమాదాన్ని తెచ్చిన బెదరింపు

ఢిల్లీలో 19 ఏళ్ళ జగదీశ్ అనే నౌకర్ను సరిగా పుండకపోతే పనిలోంచి లాగేస్తానని అతని యజమాని గంగాదాస్ బెదిరించాడట. మూడేళ్ళుగా పని చేస్తున్న తనను ఆవిధంగా యజమాని అవమానించాడన్న కోపంతో జగదీశ్ యింటాయన మూడేళ్ళ కూతుర్ని కూరలు తరిగే కత్తితో పొడిచి చంపి, పారిపోయాడట.

సజీవ దహనం

తిరుపతిలో 25 ఏళ్ళ ప్రేమావతి అనే ఆమె దొంగతనం చేసి పట్టుబడి పోయిందట. దాంతో పో నలుగురు పౌరులు ఆమె మీద కిరసనాయిలు పోసి నిప్పంటించేశారట. ఆమె భయంకర ఆర్తనాదాలు చేస్తూ చూస్తుండగానే కాలిపోయిందట, చావుబ్రతుకుల మధ్య ఆసుపత్రిలో చేరుస్తే అక్కడ చనిపోయిందట. ఈ పౌరులను పోలీసు పట్టుకుంది.

గొట్టం పాంట్లు-ఆరోగ్యం

ఆడామగా బిగబడి తొడుక్కుంటున్న యీ గొట్టాం ప్యాంటులు [టైట్స్] దేహారోగ్యానికి తగవనీ వీటివల్ల కొండొకచో నివారణ యోగ్యాలు కాని చర్మ వ్యాధులు కూడా వస్తాయనీ అమెరికాకు చెందిన డాక్టర్ లిండా అనే ఆయన ఢిల్లీలో అన్నారట—విన్నారా!

నిరుద్యోగం-భార్యాభర్తల ఆత్మహత్య

మొన్న 27 వ తేదీన ఢిల్లీ కంటోన్‌మెంట్ భాగంలో ఒక నూతిలో రెండు శవాలు దొరికాయట. మూడేళ్ల క్రితం రోష్‌వతిని వివాహం చేసుకున్న అనుహిందర్ అనే 23 ఏళ్ల వ్యక్తి ఆనాటి నుంచీ తనను వెంటాడుతున్న నిరుద్యోగ సమస్య నుంచి విముక్తిలేక—భార్యతో సహా ఆత్మహత్య చేసుకున్నాడట.

* * *

లాటిన్ అమెరికాలో 'పరాగుయె' అనే దేశం ఉంది. ఆ దేశం రాజధాని 'ఒసున్సియాన్'లో అమెరికన్ రాయబారవర్గంలో పనిచేసే ప్రథమ కార్యదర్శి భార్య శ్రీమతి ఎట్సాసీర్‌ని అరబ్బు గెరిల్లాలు కాల్చి చంపివేశారు. ఇతర వివరాలు ఇంకా వెలువడ లేదు. [6—5—70 నాటికి]

సిలబస్‌లో లేనిప్రశ్నలు-విద్యార్థుల ఆగ్రహం!

శ్రీనగర్ విశ్వ విద్యాలయంలో బి. యస్. సి. విద్యార్థులకు ఫిజిక్స్ ప్రశ్నాపత్రాలు కఠినమైనవి యివ్వడమేగాక, సిలబసులో లేనివి యిచ్చారని ఆ విద్యార్థులు కోపగించి, హాలు బయటికివచ్చి, సోదర విద్యార్థులనూ కలుపుకుని విశ్వవిద్యాలయం ఆఫీసు మీద రాళ్ళు, రప్పలూ, సోడాబుడ్లూ విసిరారట. విశ్వ విద్యాలయం ప్రొఫెసర్‌కి యీ సందర్భంలో కొన్ని గాయాలు తగిలాయట. ఇకనుంచీ పరీక్షలు, పెట్టేటపుడు విద్యార్థులలో ఒకరిచేతే ప్రశ్నాపత్రాలు తయారు చేయిస్తేపోలా—మనలోమనకి మనస్పర్థ లేల! అవసేల!!



ఒకవారం విపరీతం

కాపి పట్టుకున్న ఉపాధ్యాయునిపై అత్యాచారం

వారణాసి సంస్కృత విశ్వవిద్యాలయంలో పరీక్ష హాలులో పట్టీకున ఏ చీకూ చింతా లేకుండా చూచికాపీ కొట్టున్న ఓ విద్యార్థిని పట్టుకున్న నేరానికి ఆ ఉపాధ్యాయుణ్ణి విద్యార్థులంతా చేరి లాఠీలతో బాది, పారిపోయారట. ఆయన చావు బ్రతుకుల మధ్య ఆసుపత్రిలో వున్నారట. కాపీ రైటు విద్యార్థుల హక్కై వున్నది.

జీవితంపై రోత

మాసిహ్‌పూర్ [ఢిల్లీ] లో ఒక యింట్లోంచి లేచిన మంటల్లో ఆ యింటి యిల్లాలూ, ఆమె నలుగురు పిల్లలూ కాలి చనిపోయారట. ఆ సమయంలో యింటాయన అమీలాల్ పనికి వెళ్లాడట. అతను తిరిగి వచ్చేసరికి తన యిల్లు భయంకరమైన మంటలలోపడి విలావిలా తన్నుకోడం చూసి లోపలకు పరిగెత్తి తన భార్యను, ఓ యిద్దరు పిల్లలను బయటకి లాగాడట. మరో యిద్దరు కాలి బూడిదైపోయారట అతని భార్య యిచ్చిన మరణ వాఙ్మూలంలో తనకు కొన్నేళ్ళగా అస్వస్థతగా ఉందనీ, తన పిల్లలు ఆటలలో అగ్గిపుల్ల గీసి పడేసేసరికి అది బట్టలమీద పడి అంటుకుందని, ఆ గాభరాలో వాళ్ళు చిందులువేసేసరికి పక్కనున్న కిరసనాయులు డబ్బా తిరగబడి, అగ్నికి సహాయం చేసిందనీ చెప్పిందట. ఇవి అసలు కథ కాదని, ఆమెకు ఇమె అత్తగారికే పడటంలేదని, వంటలు వేరైనాయని వైవాహిక జీవితానికి పనికిరాని తన జీవితంమీద రోసి, ఆమె యీ పని చేసి ఉంటుండచ్చునీ, పోలీసులు తీసిన ఆధారాలలో తెలియవచ్చిందట.

కడుపు నొప్పి—ఆత్మహత్యలూ!

పుదుప్పేట అనే వూరుకు చెందిన మనోన్మణి అనే 20 ఏళ్ళ అమ్మాయి కడుపు నొప్పి భరించలేక నూతిలో దూకి, ఆత్మహత్య చేసుకుందట. 35 ఏళ్ళ కాశి గౌండర్ అనే అతను అరియప్పాటి అనే గ్రామంలో, తన కడుపునొప్పి కన్నా మరణవేదనే తేలిక అని తలచి ఇంట్లోనే ఉరి పోసుకు చనిపోయాడట. ఇతనికి భార్య, నలుగురు పిల్లలూ కూడా ఉన్నారట కరియాకుడల్ అనే గ్రామంలో 29 ఏళ్ళ పొన్నుస్వామి రెడ్డి కడుపునొప్పి భరించలేక విషం త్రాగి చనిపోయాడట. ఇతనికి వివాహమై తొమ్మిది నెల లయ్యిందట.

మాతృ హంతకుడు

22 సంవత్సరాల రామచంద్ర అనే అతను తన తల్లి చిన్నమ్మ పర పురుషునితో సందేహపడేవిధంగా కలసి ఉండడం చూసి ఆగ్రహంతో చేతికి దొరికిన ఆయుధంతో ఆమె తలమీద బాదాడట. ఇది గత ఆగస్టు 31 న జరిగింది. మాతృహత్య నేరానికతనికి యావజ్జీవ శిక్ష విధించింది చట్టం.

* * *

మాకో టెలిఫోను కావాలోయ్: అనే వారి సంఖ్య నాలుగున్నర లక్షలట మన దేశంలో. ఈ విషయాన్ని ఆ శాఖ తెలియజేసింది.



పోలీసు దుస్తుల్లో దొంగ!

చోటేలాల్ అనే ఆయన ఓ రాత్రి తన దారిన తను పోతుంటే ఒక పోలీసాయన ఆయన్నాపి, ఆయ్ ఏమిటా తూలుడు. త్రాగావా! ఆగు" అంటూ అతని జేబులు తడిమి, అందిన 630 రూపాయలూ లాక్కుని, స్టేషనుకు పద అని బయల్దేరతీసి, దారిలో అంతర్థానమైపోయాడట. ఇంతకీ ఆయన పోలీసు సి. ఐ. డి. కాదట—ఇది ఢిల్లీవార్త.

నిరుద్యోగం—నిస్పృహ

హాబ్లీలో ఒక బట్టల మిల్లులో పని చేసిన 45 ఏళ్ళ కార్మికుడు తన నిరుద్యోగ జీవితాన్ని, దాని ఫలితాలను తట్టుకునే శక్తిలేక తన తొమ్మండుగురు పిల్లల్లో ఆఖరి నలుగుర్ని తీసుకువెళ్లి ఓ పెద్ద నీటి తొట్టిలో తోసేసి, తనూ దూకాడట. మొత్తం అయిదుగురూ చనిపోయారు.

విషాహారం

బీజపూరుకు చెందిన దోప్‌నిల్ అనే గ్రామంలో విషాహారం తిన్న ఫలితంగా ఒకే తల్లి పిల్లలు ఆరుగురు చనిపోయారట. ఆపిల్లలతల్లి ఆసుపత్రిలో కోలుకుంటోందట. ఆమె పూర్తిగా కోలుకుంటేగాని ఆ విషాహారం ఎందుకుతిన్నదీ కావాలనా—ప్రమాదవశాత్తా—లేక ఎవరైనా పెట్టారా అన్న విషయాలు తేలుతాయి.


అన్నానికి ఐదులు

బంగాళా దుంపతో పరోటా

మూరు గ్రాములు బంగాళా దుంపలు, రెండుగ్రాములు అల్లం, 2 గ్రాములు పచ్చిమిరప కాయలు, కొత్తిమీరి, కరివేపాకు, ఒక కప్పు మైదాపిండి, తగినంత ఉప్పుకావాలి.

బంగాళాదుంపలు ఉడికించి తొక్కు తీసుకోవాలి. కొత్తిమీర్రి, పచ్చిమిరప కాయలు అల్లంవేసి భాగా ముద్ద చేసుకుని ఉప్పువేసి కలియపెట్టాలి. మైదాపిండి కలిపి పూరీలకి తగ్గట్టు చేసుకోవాలి. కొంచెం దళసరిగా పూరీ ఒత్తి దానిమీద యీ బంగళా దుంప ముద్దపెట్టి పూరీ దాని చుట్టూ కప్పేసి ఆ ఉండనిలొట్టెలా కూర పైకి వచ్చేయకుండా జాగ్రత్తగా వత్తుకోవాలి. వీటిని లోతు తక్కువ మూకుడులో కొంచెం నూనెలోగాని, డాల్డాలోగాని దోరగా వేయించాలి. వేడిగా తినాలి.

బంగాళా దుంపలో పిండిపదార్థం ఎక్కువ—అంచేత దానితో ఏంవండినా అన్నం తగ్గించాలి. పైచెప్పిన పరోటాకు తగ్గట్టి కూరగాని ఏ చెట్నీగాని చేస్తే వేరేమీ వండక్కర లేదు. రుచికి రుచీ, మార్పుకు మార్పూ—ఈ పరోటాలు.—కె. ఆర్.



ఆకాశంనించి ఒకొక్క చినుకూ రాలుతూఉంటే కిటికీ ఊచల మధ్యనించి చూడ్డానికి బాగానే ఉంటుంది. ఆ బాగు ఎంతసేపు!? అయిదు 'నిమిషాలు లేదా, పదినిమిషాలు. ఆ తరవాత!? ఆ తరవాత మరేముంది!' మహా విసుగు.

అదేమాదిరిగా అందమైన కలలు కొంతకాలంపాటు అందంగానే కనిపిస్తాయి. బ్రతుకు మహామధురమైంది అనిపిస్తుంది. రానురాను ఆ అందమైన కలలే పంచతిక్త కషాయం మాదిరి మహా చేదనిపిస్తాయి.

పల్లెటూరి గురించి బ్రహ్మానందం ఎన్నెన్నోకలలు కన్నాడు. దాదాపు పది సంవత్సరాలపాటు మహానగరంలో బతికినందువల్ల నగరంలో బతకడంలో రుచిపోయినట్టనిపించింది. మొట్టమొదట్లో రుచి కనిపించినా, క్రమంగా విసిగెత్తిపోయింది. పట్టణ జీవితం విసుగు కలిగించడం ప్రారంభించి నప్పటినించి పల్లెటూరి బతుకుమీదికి దృష్టిపోయిందతనికి. పల్లెటూళ్లో కావలసినంత గాలి, వెలుగు, చిక్కటిపాలు, జున్నుముక్కలాంటి పెరుగు, చూపానినంత మేర పచ్చదనం, గాలికి అలా అలా ఊగే పంటచేలు ఇవన్నీ కలల్లో కన్పించి బ్రహ్మానందాన్ని ఊరించడం ప్రారంభించాయి.

'మాయదారి పల్లెటూరులే! అక్కడేం దొరుకుతాయని అంత సంబరపడి పోతున్నారు? మనసు పుట్టినప్పుడు చూడ్డానికి మంచి సినిమా అయినా దొరకదు' అని మహాలక్ష్మి అన్నప్పుడు మనిషి మంచి సినిమా చూడ్డానికే కాబోలు పుట్టాడనుకుని బ్రహ్మానందం చిరునవ్వు నవ్వేవాడు.

'వోసి పిచ్చిదానా! మా ఊళ్లో సినిమాయే లేదనుకున్నావా? వో టెంపరరీ షెడ్డుందిగా! అదేచాలు. నెలకో మంచి సినిమాచూస్తే సరిపోదా ఏమిటి!' అనేవాడతను.

మహాలక్ష్మి యించక్కా మూతి తిప్పుకునేది.

'గట్టిగా వర్షంకురిస్తే రేకుల శబ్దం చాలు ఆ సినిమాహాల్లో మరి సినిమా చూడ్డం కూడానా! ఆ సినిమాలైనా నే పుట్టినప్పటివి ఆడుతూ ఉంటారు. బాలరాజనీ కీలుగుర్రమనీ పాతడొక్కులు ఎన్నిసార్లని చూస్తాం!!' అని గునిశేదావిడ.

సరిగ్గా యిదే సమయంలో బ్రహ్మానందం వో నగ్నసత్యం చెప్పేవాడు.

'పాత సినిమాలని ఎప్పుడూ ద్వేషించకూడదోయ్! ఆ మాటకొస్తే పాత సినిమాలంత మంచివి ఇవాళ మనవాళ్లు తీయలేక పోతున్నారు. అప్పటి సినిమాలన్నీ సంసారపక్షంగా కుటుంబం యావత్తూ ఒకే బెంచీమీద కూచుని చూసేటట్టుగా నీతి బోధకంగా తీసేవారు. ఇప్పటిసినిమాలంటావా—వాటి సంగతి నాకంటె నీకే బాగా తెలుసు...'

అక్కడితో ఆ సంభాషణ ఆగిపోయేది.

సంతృప్తి

బ్రహ్మానందం పల్లెటూరి గురించి సంవత్సరాల పర్యంతం అందమైన కలలు కన్నాడు. పల్లెటూళ్లో తనెలా జీవితం ప్రారంభించ దలచుకున్నాడో, అక్కడకూ యిక్కడకూ జీవితం ఏవిధంగా మారిపోతుందో రక రకాలుగా ఊహించుకుంటూ ఉండేవాడు.

నగరంలో ఫేన్‌కింద కూచుని; రేడియో వింటూ పల్లెటూరి అందాన్ని గురించి ఆలోచించు కోవడమైతే అందంగానే ఉంటుంది గాని, తీరా పల్లెటూరికివొచ్చి జీవితం ప్రారంభించేసరికి ఆ అనుభవం వేరే అనుభూతుల్ని ప్రసాదించవచ్చు.

బ్రహ్మానందం అందమైన కలల గురించి సవివరంగా చెప్పడంకన్న ఆ కలల నిజస్వరూపాన్ని అతగాడేవిధంగా దర్శించాడో చెప్పడంలోనే నిజమైన స్వారస్యం ఉంది.

బ్రహ్మానందం పుట్టడం ఒక చిన్న పట్టణంలోని ఆసుపత్రిలోనే పుట్టాడు గాని అతనిది మాత్రం తూర్పుగోదావరిలో ఒక పల్లెటూరు. పాపం! అతనికి ఆ పల్లెటూరిమీద చెప్పలేనంత అభిమానం. అయినా ఎక్కువకాలం అతనక్కడ గడప లేదు' ఏ చిన్నపట్టణంలో అతను పుట్టాడో అక్కడే అతను పదహారేళ్ల చదువు సాగించాడు. ఆతరవాత రెండేళ్లపాటు టైప్‌వూ షార్టుహేండూ నేర్చుకున్నాడు. అంతలో ఆంధ్ర రాజధానీ నగరంలో ఉద్యోగం వచ్చింది. ఆతరవాత ఒక ఉద్యోగి కూతురుతో వివాహమైంది. పదేళ్లపాటు హాయిగా సంసారం సాగింది. ముగ్గురు పిల్లలు పుట్టారు.

బ్రహ్మానందం తండ్రిగారు అకస్మాత్తుగా కాలధర్మం చేయడంతో ఒక్కగా నొక్క కొడుకు ఇంటిదగ్గర వ్యవహారాలు సరి చూడడానికి విధిగా ఉద్యోగాన్ని వొదులుకోవలసిన అవసరం ఏర్పడింది.

ఒకరోజు సరిగా చీకటి పడుతున్నవేళ బ్రహ్మానందం యింట్లో అడుగుపెట్టిన సమయానికి బ్రహ్మానందంగారి పెద్దబ్బాయి, ఆ అబ్బాయి తల్లీ తమ పల్లెటూరి ప్రయాణం గురించి చర్చించు కుంటున్నారు. బ్రహ్మానందం రావడం వాళ్లిద్దరూ అతిస్పష్టంగా చూచినా, అతని రాక వాళ్ల చర్చకు ఏవిధంగానూ అడ్డు రాలేదు.

'నువ్వెన్ని చెప్పినాసరే — ఈ వెధవ హైదరాబాదుకంటె మనూరే మంచిది' అన్నాడు పెద్దబ్బాయి.

'అవునాయనా! ఆ అబ్బ కొడుక్కొడూ ఈ పిడుగు. గంటనించి మొత్తుకుంటున్నాను—మీ నాన్నకి వచ్చచెప్పరా— అని. అంతా విని చివరికి నువ్వు కూడా ఆమాటే అంటున్నావన్నమాట.'

'కాకపోతే — నాన్నగారికొచ్చే జీతానికి మనం పల్లెటూళ్లో ఉంటేనే బావుంటుంది.'

బ్రహ్మానందం అసలు వాళ్ల సంభాషణలో కలగజేసుకోకూడదనుకున్నాడు. కాని తన జీతం ప్రసక్తి వొచ్చేసరికి అతనికి చాలా పౌరుషం వొచ్చింది. ఎనిమిదేళ్ల వాడు కొడుకు. ఎనభైఏళ్ల వాడిమాదిరి మాట్లాడుతున్నాడు. వాడుచెప్పినదాంట్లో అబద్ధం లేదు. అయినా తన జీతం తక్కువనీ, తన కొస్తున్న ఈపాటి జీతం రాళ్లతో తామిక్కడ బతకడం చాలా కష్టమనీ తనముందే చెప్పడం అతనికి బాధనిపించింది. రెండువందరూపాయల జీతం అంటే వీళ్లకు చాలా నీచంగా అనిపిస్తోందన్నమాట! అంతకన్న తక్కువ జీతం తెచ్చుకుంటున్న వాళ్లు ఈ మహానగరంలోనే బిడ్డా పాపాతో చాలా సుఖంగానే బతగ్గలుగుతున్నారు.



తనకన్న తక్కువ జీతం వాళ్ళున్నారని బ్రహ్మానందానికెప్పుడూ అసంతృప్తి లేకపోయినా, తనభార్యకు మాత్రం ఆ అసంతృప్తి ఉందని అతనెరుగును. కాని ఆమె అసంతృప్తిని పోగొట్టడానికి తనేమి చేయగల స్థితిలో లేడు. పెళ్లయిన కొత్తలో భార్యకు అసంతృప్తి కలక్కుండా అతనెన్నోవిధాల జాగ్రత్తపడ్డాడు. భార్య అడక్కుండానే చీరలు తెచ్చేవాడు. స్నోలూ పౌడర్లూ తెచ్చేవాడు. కొత్త మోజులో అతను భార్య సరదాలకు అప్పులు కూడా చేశాడు. కాలక్రమేణా ఆ అప్పులు తీర్చడానికి అతనెంత కష్టపడిందీ యిప్పటికీ అతనికి జ్ఞాపకం ఉంది: అతను మరీ గర్భదరిద్రుడు కాకపోయినా కొంచెం మెతకమనిషి కావడాన డబ్బుకోసం ఇంటికి రాయడానికి వెనకాముందు లాడేవాడు.

మహాలక్ష్మి పుట్టింటినుంచి ఏం తెచ్చుకోకపోయినా ఆడంబరాన్ని తెచ్చుకుంది. ఇంటికెవరొచ్చినా, వాస్తవాలు తనను గురించిన గొప్పలు చెప్పుకోడానికి ఎన్ని గంటలైనా సరిపోవు.

'మా ఆయన అలా ఉన్నారనిగాని, ఎంతమంచివారో మీకు తెలీదు. ఆయనన్ను చూస్తే అయిదొందలు జీతమని ఎవ్వరూ అనుకోరు.' అంటూ ప్రారంభించేది మహాలక్ష్మి. బ్రహ్మానందం జీతం సంగతి అవతలివాళ్ళకీ బాగా తెలిసినా, మహాలక్ష్మి సంతృప్తికోసం తప్పనిసరిగా తలూపవలసి వచ్చేది.

'నాకు రెండొందలు జీతమని నీకేం సిగ్గుపడక్కర్లేదు. ఊరికెళ్లిపోతే లక్షలు సంపాదిస్తాను. వాయుగుమేడలు కట్టిస్తాను. ఒంటొద్దు సంవత్సరాలు పోయాక నందికరాలు కొంటాను. ఇక్కడ అనాకారిగా ఉంటేనా — నిజాం నవాబు అంతటి నేనౌదాక పోదునా!' అని అరిచాడు బ్రహ్మానందం గదిలోంచి.

'అయ్యో పాపం!' అని గొణిగింది మహాలక్ష్మి.

అంతలో తల్లీ కొడుకుల చర్చ ఆగిపోయింది. కొడుకు వీధిలోకి వెళ్లిన తరవాత మహాలక్ష్మి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులోకి వొంపి, భర్తకందించింది. అయిష్టంగా అందుకుని బ్రహ్మానందం దాన్ని గుటుక్కుమనిపించాడు.

'ఇంటి దగ్గర్నుంచేమైనా ఉత్తరం వొచ్చిందా ?' అనడిగాడు బ్రహ్మానందం గ్లాసు కిందపెడుతూ.

మహాలక్ష్మి తల అడ్డంగా తిప్పింది. ఆ వరస చూసి బ్రహ్మానందానికి మళ్ళీ కోపం వొచ్చింది.

'వొచ్చిందనో రాలేదనో నోటితో చెప్పకూడదా! తీసరం కాకపోతే!' అని అందామనుకున్నాడు. నాలిక చివరిదాకా వొచ్చిందిగాని మరునాటి ఉదయంవరకూ ఆ విషయం మీదే పెద్దరాద్ధాంతం జరుగుతుందని భయపడి, బ్రహ్మానందం నోరు మూసుకుని, పళ్ళు కొరుక్కున్నాడు.

'ఇంటిదగ్గర పరిస్థితులు ఎలా ఉన్నాయో! ఇంటికెళ్ళి వచ్చినప్పటి నుంచి మనసంతా అక్కడేఉంది' అని మాత్రం అన్నాడు.

మహాలక్ష్మి ఖాళీగ్లాసు తీసుకువెళ్ళిపోయింది. తల వెనక్కువాల్చి, బ్రహ్మానందం పల్లెటూరి ఆలోచనల్లోకి జారిపోయాడు.

మరునాటి సాయంకాలం మాత్రం బ్రహ్మానందానికి ఊరినించి ఉత్తరం వచ్చింది. నిజానికి బ్రహ్మానందం అటువంటి ఉత్తరాన్నెప్పుడూ ఆశించలేదు, తనకి రావలసిన ఉత్తరం రాకపోగా, ఇటువంటి అనవసరపు ఉత్తరం వొచ్చినందుకు బ్రహ్మానందానికి చాలా కోపం వొచ్చింది.

ఉత్తరం మొదటిసారి చదివి బ్రహ్మానందం పెళ్ళాంమీద కోప్పడ్డాడు. ముగ్గురు కొడుకులుండీ, తనకి సుఖంలేదనీ, యింటి యజమానై ఉండీకూడా పాలేరుగా ఉంటున్నానని చాలాసేపు సణుక్కున్నాడతను. ఈలోగా మహాలక్ష్మి ఇంట్లో బొగ్గులైపోయాయని హెచ్చరిక చేసింది.

'మూసీలో మునగండి! ఎప్పుడూ లేదులేదనే తప్ప మరోగోలలేదు. వొచ్చే జీతం అంతా పదిరోజులకే ఆర్పేస్తారు. నేనెక్కడినించి తేను? తెచ్చింది తింటూనే నాకు జీతం తక్కువని నన్నే వేళాకోళం చేస్తున్నారు. ఇవేళ్టినుంచి నేనేం తీసుకురాను. ఎట్లా బతుకుతారో చూస్తాను...' అంటూ మరోగంట సణిగాడతను. అప్పటికి మహాలక్ష్మి పక్కింటివాళ్ళనడిగి కొన్ని బొగ్గులుతెచ్చి, వంట చేసేసింది.

సంతృప్తి

'ఏదీ — ఆ బొగ్గులసంచీ యిటు పడెయ్?' అని అరిచాడు బ్రహ్మానందం.

'రేపొద్దుట తెచ్చుకోవొచ్చులెండి! ఈ పూటకి సరిపడా పక్కింటి వాళ్ళనడిగి తెచ్చాను' అని చెప్పింది మహాలక్ష్మి.

దాంతో బ్రహ్మానందానికి కోపం తారస్థాయి నందుకుంది. 'బొగ్గులుకూడా బదులుచేసినాపరువుతీసేస్తున్నావు. బజారు కెళ్ళితెచ్చేవాడినిగా! వెళ్ళు—ఆ బొగ్గులిచ్చేసిరా!' అని చిందులు తొక్కాడు.

మహాలక్ష్మికేం సమాధానం చెప్పాలో తెలియలేదు. వెళ్ళి వోమూలను కూచుంది.

బ్రహ్మానందం మళ్ళీ వొసారి ఉత్తరం చదువుకున్నాడు.

పల్లెటూరి స్నేహితు డొకాయన రాసిన ఉత్తరం అది. బ్రహ్మానందం ఉద్యోగం మానేసి పల్లెటూరికి రావడానికి నిర్ణయించుకున్నట్లుగా తెలిసి అతగాడు వో చిన్నసలహా యిచ్చాడు. ఈ రోజుల్లో ఉద్యోగం వదిలివేయడమంత బుద్ధితక్కువతనం మరోటి లేదనీ, పల్లెటూళ్ళు ఇదివరకట్లాగాక రాజకీయాలతో నిండిపోయి చాలా ఘోరంగా ఉన్నాయినీ, బాగా ఆలోచిస్తే ఉద్యోగానికి మించిందేం లేదనీ స్నేహితుడు సలహా యిచ్చాడు.

బ్రహ్మానందం నాలుగోసారి ఉత్తరం చదువుకున్నాడు. అతనికి ఒళ్ళు కుతకుతలాడిపోయింది. ఫర్రున ఉత్తరం చింపేశాడు. లేచి నిలబడి, గదిలో ఆమూల నుంచి ఈమూలకు, ఈమూలనుంచి ఆమూలకు పచార్లు ప్రారంభించాడు.

పరిచయం ఉన్నవాళ్ళు పరిచయస్థులుగా మాత్రమే ఉండక, ఎదుటివాళ్ళ బాగుకోరినట్లు ఉచిత సలహాలిస్తూ ఉంటారు, ఆ సలహాలవల్లనే ఒక్కోసారి ఎదుటివాళ్ళు కష్టపెట్టుకోవలసి వస్తుంది.

పదిరోజులు గడిచిపోయాయి. బ్రహ్మానందం మామూలుగా ఆఫీసుకు వొస్తూ పోతూ ఉన్నాడేగాని అతనికి మనస్థిమితం లేకుండా పోయింది. ఓ పది లంఘణాలుచేసి పత్యం పుచ్చుకున్నంత బలహీనంగా తయారయ్యాడు మనిషి. అతని ధ్యాసంతా పల్లెటూరి వ్యవహారాలమీదనే పడిపోయింది. భార్య సలహామీదట వో పది రోజులు సెలవుపెట్టి అతనొక్కడూ ఊరికి బయలుదేరాడు.

అతి ప్రయాసమీదట రాత్రంతా జాగరణ చేసి మధ్యాహ్నం పన్నెండుగంటలకు బ్రహ్మానందం తన ఊరికి జేరుకున్నాడు. తను యింటికి జేరుకోడం అతనికి బ్రహ్మానందంగానే ఉందిగాని— ఎటొచ్చీ సంతోషించనిదల్లా అతనింటిలో జనమే. తల్లి అతని రాకకు వివిధమైన భావాన్నీ వ్యక్తం చేయలేదు. విధవ మేనత్త మాత్రం వెకిలి నవ్వొకటి నవ్వి, 'చెప్పి పెట్టకుండా వొచ్చావేనాయనా! తల్లిమీద మనసు తిరిగినట్లుంది' అని పరామర్శించింది. ఇంటిదగ్గర పరిస్థితి చూసీ చూడగానే బ్రహ్మానందానికి ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్లుగా ఉంది. అంకంత కొంపలో చూదామంటే ఎక్కడా ఖాళీయే ఉన్నట్లుగా కనిపించడంలేదు. వో గదిలో ధాన్యం బస్తాలున్నాయి. ఆ గదికి పక్కవసారాలో కందులు, ఉలవలు, నువ్వులు, మిరపకాయలు బస్తాల్లో పడి ఉన్నాయి. ఇటుపక్క వసారాలో ఆవకాయ జాడీలు రెండూ, విరిగిపోయిన నాలుగు కుర్చీలు, వో మూలగా మరపట్టించిన బియ్యం మూటలు నాలుగూ ఉన్నాయి. ఒక వసారాలో వంటసామాను, కూరగాయల బీరువా, కుండలూ—మండలూ ఉన్నాయి. ఇంకో వసారా వంట కుపయోగించుకుంటున్నారు. అటకమీద కొబ్బరికాయలు. ఎటొచ్చి ఖాళీగా కన్పిస్తున్నదల్లా ఒకే ఒక గది. దొడ్లో పందిరిమీద అనపపాదు, చిక్కుడుపాదు తీగలేస్తున్నాయి. అటు పక్క గొడ్లమూల పాకలో రెండుగేదెలు, ఒక దున్నపిల్ల పడుకుని నెమరేస్తున్నాయి. పాక కిటువైపు ఈగలు ముసిరిన తాటికాయలు, టెంకలు చిందవందరగా పడి ఉన్నాయి. పక్కనే కోళ్ళ గూడుంది. అటుపక్క పెద్ద కమ్మలరాశి.

బ్రహ్మానందానికి కడుపులోంచి బాధ పుట్టుకొచ్చింది. ఒక గది, కిచెన్‌తో చలా శుభ్రంగా, ప్రతినిత్యమూ ఇంపుగా అమర్చుకుని బతకడానికి అలవాటుపడిపోయిన తనకు బూజులు వేలాడుతూ, అందవిహీనత దిగజారుతూ, ఎక్కడి

వస్తువులక్కడ నిద్రపోతున్నట్టుగా పడి ఉండడం చూసి రోత పుట్టుకొచ్చింది, పల్లెటూరి అందమంతా యింతేనా అనిపించిందతనికి.

అతనికి భోజనం మాత్రం బాగానే కుదిరింది. గుత్తివంకాయ, కమ్మని నెయ్యి, అరటికాయవేపుడు, ఆవకాయ, అనపకాయ పులుసు, గడ్డపెరుగు... మరింకేం కావాలి—సుష్టుగా భోంచేసి పడుకున్నాడు. నిద్రమెలకువ వచ్చేసరికి కన్ను పొడుచుకున్నా కనిపించనంతటి చీకటి గదినిండా నిండి ఉంది. చటుక్కున వాచీ చూసుకుంటే, గడియారంలో గంట నాలుగే కనిపించింది. ఆకాశం నిండా కారుమేఘాలు కమ్ముకున్నాయి. మరో అయిదునిమిషాలకు హోరున కురవడం ప్రారంభించింది. ఆ కురవడం కురవడం రాత్రంతా కురుస్తూనే ఉంది. దానికితోడు విపరీతమైన గాలి. ఆరాత్రి బ్రహ్మానందానికి ఎంతకూ నిద్ర పట్టిందికాదు. గదికి బూజులు మీద పడసాగాయి. ఏవేవిటో పిచ్చిపిచ్చి ఆలోచనలతో అతి కష్టంగా తెల్లవారింది. ఎర్రని ఎండొస్తే బావుణ్ణనుకున్నాడు బ్రహ్మానందం. వర్షం తగ్గితేనా! మరింత హోరున కురుస్తూనే ఉంది.

బంగాళాఖాతంలో పుట్టిన వుడిగుండం అక్కడెక్కడో తీరాన్ని దాటుతూనో, తీరం వెంట పరుగెత్తుతూనో ఉంది కాబోలు వానకురుస్తూనే వుంది, గాలి వీస్తూనే ఉంది.

రెండురోజులు గడిచిపోయాయి.

వర్షం మాత్రం తగ్గుముఖం పట్టలేదు.

ఆ రెండురోజులూ బ్రహ్మానందానికి ముళ్లమీద కూచున్నట్టుగా ఉంది.

కాలక్షేపానికి సాధనాలేమీ లేవు. పోనీ ఏదేనా సినిమా చూదామంటే, టూరింగ్ టాకీ లైసెన్సు అయిపోయి, మూత బడింది. మరో రెండునెలలకుగాని అది ప్రారంభం కాదు. బయటెక్కడకూ కదిలి వెళ్లడానికి వీల్లేదు. అడుగు బయట పెట్టడానికి వీల్లేనంత బురద బురద.

కిటికీ పక్కగా కుర్చీలో కూర్చున్నాడు బ్రహ్మానందం. హోరున కురుస్తున్న వర్షం ఉండుండీ ఆపోడం, మళ్ళీ అయిదు నిమిషాల్లో చినుకూచినుకూ రాలడం—

ఈ దృశ్యాలు కొద్ది కొద్ది మార్పులతో అతనికి విసిగెత్తించడం ప్రారంభించాయి. వేళకింతతినడం — పగలంతా కుర్చీలో కూలబడడం రాత్రికి నిద్రపోడం దినచర్యగా నాలుగురోజులు గడిచిపోయాయి.

ఒకరోజు మాత్రం తమ పొలాలు కౌలుకు తీసుకున్న పోతురాజు వచ్చి, పలకరించి వెళ్లాడు. వాడు చుట్ట తిరగేసి కాల్చడం బ్రహ్మానందానికి సరదా అనిపించింది.

'ఉద్యోగం చేసుకునే మారాజులు మా వూళ్లో ఉండలేరు బాబో! వర్షం వచ్చిందంటే మాపాట్లు ఏం చెప్పాలి! మీకైతే సిమెంటురోడ్లు, సిటీబస్సులూను. మాకేం వుంది! బురదా—మోకాల్లోతు నీళ్లూను' అనివాడు చెబుతూంటే, బ్రహ్మానందానికి కోపం రాలేదు. నిజమేననిపించింది.

తనకు ఉత్తరం రాసిన స్నేహితుడి గురించి బ్రహ్మానందం వాకబు చేశాడు గాని అతగాడు ఊళ్లో లేడని తెలిసింది.

నాలుగోరోజు రాత్రి తల్లి తన అనుమానాన్ని బయట పెట్టింది.

'నువ్వు ఉద్యోగం మానేయడం నా కిష్టమేగాని—పట్టణాల్లో అలవాటైపోయినవాళ్లు మీరిక్కడ ఉండలేరేమో అని నా అనుమానం.'

బ్రహ్మానందం అవుననిగాని కాదనిగాని ఏం చెప్పలేదు.


మరునాటి మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టింది.

బ్రహ్మానందం పడుతూ లేస్తూ ఊళ్లోకి బయలుదేరాడు. ఊరికి చివరగా ఉన్న యింటినుంచి అమూలగా ఉన్న మునసబు గారింటికి నడిచి వెళ్లడానికి అశ్వమేధయాగం చేసినంత శ్రమపడి పోయాడు బ్రహ్మానందం. తొడుక్కున్న పేంటు బురదనీటితో బరువెక్కింది. అక్కడికీ అతను పాపం! పైకి మడవనే మడిచాడు.

బ్రహ్మానందాన్ని చూస్తూనే మునసబు గారు కొండంత సంబరపడిపోయి— 'రావోయ్ అల్లుడూ!' అని ఆహ్వానించారు.

తుంగచాపమీద మునసబుగారి సరసను కూచున్నాక, క్షేమసమాచారా అనంతరం మునసబుగారు పల్లెటూరి బండారాన్ని చెప్పడం ప్రారంభించాడు.

'ఊళ్లో పరిస్థితులేమీ బాగుండ లేదోయ్ అల్లుడూ! కష్టపడి పనిచేసే వాడొక్కడూలేడు. ఏదో మాయచేసి నాలుగు రోజులు గడుపుదామనే ధ్యాస తప్ప ఉన్న భూమిని శ్రమపడి పండించుకుందామన్న మంచి బుద్ధిగల వాళ్లెవరూ కనిపించడం లేదు. రాజకీయాలు మాత్రం పెరిగి పోయాయి. వెంకటస్వామికీ రాఘవరెడ్డికీ



సంతృప్తి

మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. ఊరంతా యిప్పుడు రెండు చీలికలై పోయింది. ఇది వినాశనానికే వొచ్చిందో, మంచికే వొచ్చిందో తెలీడంలేదు. అదలా ఉంచు, అప్పులేని వాడంటూ ఎవ్వడూ నా కంటికి కనిపించడం లేదు. కోఆపరేటివ్ బాంక్‌లో అప్పు. కోమటి కొట్లో అప్పు. ఎక్కడచూస్తే అక్కడ అప్పు. అక్షరాలా దరిద్రం నాట్యం చేస్తోందయ్యా మహానుభావా!...'

మునసబుగారి ఉపన్యాసం వింటూ వుంటే బ్రహ్మానందానికి తల తిరుగుతున్నట్టుగా అనిపించింది. తన ఊరి గురించి తాను ఎన్నెన్నో కలలు కన్నాడు. నగర జీవితంలోని కల్మషాన్నుంచి, చీకాకులనుంచి తప్పించుకోవాలని ప్రయత్నించాడు. అతి ప్రశాంతంగా పల్లెటూళ్లో బతకవచ్చని అతను కలలు కన్నాడు. కన్నులపండువుగా పచ్చటి జీవశక్తి, కడుపునిండుగా కమ్మటి గడ్డపెరుగు, మనసునిండుగా ప్రశాంతత అనుభవించవచ్చని అతను కట్టుకున్న ఆకాశహర్మ్యాల అట్టడుగున డైనమైటు పేలుతుంది.

కులవర్గ విభేదాలు ఇదివరకటికన్న పెచ్చుపెరిగిపోయాయనీ, తక్కువ కులాలవారు ఆడంబరాలకోసం అగ్రవర్ణాలతో పోటీ పడుతున్నారుగాని కష్టపడి సంపాదించుకోడం మానివేశారనీ, కుట్రలకూ, మోసాలకూ పల్లె ప్రజలంతా అలవాటు పడిపోయారనీ విన్నప్పుడు బ్రహ్మానందానికి రాజకీయ నాయకులపైన కోపం వొచ్చింది. ఊకదంపుడు ఉపన్యాసాలతో సామాన్య ప్రజల బలహీనతలను రెచ్చగొట్టే దుర్బుద్ధులను అతను అసహ్యించుకొన్నాడు. రాజకీయాల వెనక కరుడుగట్టిన రాక్షస స్వభావాన్ని, విన్నప్పుడు అతను పల్లెసీమలు ఇదివరకటి మాదిరి రాజకీయ చైతన్యం లేకుండా ఉన్నా బాగుండిపోను అనుకున్నాడు.

ఆ రాత్రి బ్రహ్మానందం ఒక నిర్ణయానికి రాక తప్పలేదు.

మరునాటి ఉదయం అతనొక ఘోరమైన వార్తను విన్నాడు: విప్లవవాదులమని చెప్పుకుంటున్న రాఘవరెడ్డి బృందంవారు తమ విరోధిఅయిన వెంకటస్వామి యింటిని దోచుకొన్నారనీ, యింట్లో విలువైన వస్తువులన్నీ, ఒక్కటికూడా మిగల్చకుండా పట్టుకుపోవడమేకాక ఆడవాళ్లపై చేయి చేసుకున్నారనీ పోతురాజు వివరంగా చెబుతూంటే బ్రహ్మానందానికి చాలా బాధ అనిపించింది. అమాయకత్వానికీ, ధర్మ ప్రవర్తనకూ పేరుబడ్డ పల్లెటూరి ప్రజల రక్తనాళాల్లో విప్లవదృక్పథం ప్రవేశించింది. ఇది ప్రగతికి దోహదకారి కాగల మార్పు కాదు. ఈ మార్పు వినాశనానికే ప్రవేశించింది అనుకున్నాడు బ్రహ్మానందం.

పదిరోజులు శలవుపెట్టి, ఆరవరోజునే తిరిగి వచ్చిన భర్తను చూచి, మహాలక్ష్మికి గొప్ప ఆశ్చర్యం కలిగింది.

'ఏమిటండీ! ఊళ్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?' అని అడిగిన భార్యను నఖశిఖపర్యంతం పరీక్షగా చూశాడు బ్రహ్మానందం. ఆ చూపు చూచి మహాలక్ష్మి భయపడింది.

ఆ రోజునుంచి బ్రహ్మానందం తనతో తాను సణగడం మానేశాడు. భార్యమీద బిడ్డలమీద కోపగించడం లేదు.

ఒకరోజు రాత్రి బ్రహ్మానందం భార్యతో అన్నాడు—

'మనిషికి సంతృప్తి అంటూ లేకపోతే బతకడం చాలా కష్టం. దూరపుకొండలు నునుపని పెద్దవాళ్లు చెప్పింది అబద్ధం కాదు. కలలు అందంగానే ఉంటాయిగాని అవి నిజంకావడం మామూలు మాట కాదు. ఆఫీసులో కూచుని నాలుగక్షరాలు రాసుకుంటే రోజు వెళ్లిపోయేదానికి ఎక్కడికో సముద్రపుటొడ్డుకు వెళ్లడం దేనికి?'

మహాలక్ష్మి ఏమీ మాట్లాడలేదుగాని మనసులో మాత్రం ఎంతో సంతోషించింది.

ధర్మపథం:

వేదాల వేర్వేరు ప్రయోజనాలు



బులుసు వేంకటరమణయ్య

వేదాలు ఋగ్వేదం - యజుర్వేదం - సామవేదం - అథర్వణవేదం అని నాలుగు ఉన్నవని అందరికీ తెలుసును, ఇవి అనాదులని అనుకొంటున్నా కాలనిర్ణయం చేస్తూ నవ్యులు ఋగ్వేదం ప్రాచీనమనీ సామవేదాదులు ఆ తర్వాత వచ్చినవనీ చెప్పడం ఉన్నది. కాని మొదట్లో యివన్నీ కలిసిపోయి ఉండినందువల్ల భగవానుడైన బాదరాయణ మహర్షి - ఈ నాల్గింటినీ విభజించి—ఒక్కొక్క దానికీ ప్రత్యేకతను కూర్చాడు. ఈ విధంగా వేదాలను విభజించి ప్రత్యేకతను చూపడం వల్లనే ఆయనకు వేదవ్యాసుడనే పేరు వచ్చి క్రమక్రమంగా 'వ్యాస మహర్షి' అనేపేరు రూఢమైపోయింది. మొదట యివి అన్నీ కలిసి ఉండినందువల్ల 'ఇది ప్రాచీనం, ఇది నవీనం' అని నిర్ణయించడానికి అవకాశం చాలా తక్కువ.

'వేదో ధర్మమూలం' అనే స్మృతి సూత్రాన్ని బట్టి వేదం ధర్మాన్ని వివరిస్తుందని గ్రహించవచ్చు. అయినా వేదాలు చతుర్వర్గ ప్రతిపాదకాలనీ, ఒక్కొక్క వేదం ఒక్కొక్క పురుషార్థానికి ప్రాధాన్యమిస్తుందనీ కొందరు ప్రాచీనులయిన విద్వాంసుల అభిప్రాయం.

వేదాలలో ఋగ్వేదం ధర్మాన్ని వివరంగా తెలుపుతుంది. జడవస్తువుల యొక్కయు, జీవపదార్థం యొక్కయు, భగవత్కుటుంబ సంఘాల ధర్మాలను గురించి యిది తెలుపుతుంది. ధర్మప్రతిపాదకమైనందువల్ల ఋగ్వేదమని ప్రసిద్ధికెక్కింది. మహాభారతానికి ఇది ఆధారమైనది.

అర్థమనే పురుషార్థాన్ని గురించి వివరించేది యజుర్వేదం. సమస్త గుణాలతోనూ మేధాశక్తిని మేళవింపజేసి కోరికను—అంటే అర్థాలను ప్రయోజనాలను నెరవేర్చుకునే పద్ధతి యీ వేదంవల్ల తెలుస్తుంది. క్రియాశక్తి విజృంభణ, యజ్ఞయాగాదులు, దేవతాగణాలు, అర్థిక సంబంధంగల రాజ్యాంగ విద్య దీనిలో వివరింపబడుతున్నవి.

కామపురుషార్థాన్ని గురించిన వివరాలు సామవేదంవల్ల తెలుస్తున్నవి. గృహస్థులు నడుచుకోవలసిన పద్ధతులూ, లలితకళలూ, సంగీత సాహిత్యాలూ, తద్ద్వారా బ్రహ్మోపాసన మార్గాలూ దీనివల్ల తెలుసుకోవచ్చును. యజుర్వేద, సామవేదాల్లోని విషయాలు భాగవతంలో ప్రతిబింబిస్తూ ఉన్నాయి.

అథర్వణవేదం మోక్షమార్గ ప్రతిపాదకమైనదట! అయితే - ఇందులో ఆయుధాలను గురించీ, శస్త్రచికిత్సను గురించీ, యుద్ధతంత్రాన్ని గురించీ ఉండడంవల్ల - ఇది మోక్షమార్గానికి ఏవిధంగా సహకరిస్తుందనే సందేహానికి అవకాశం లేకపోలేదు. కాని, యిందులో సృష్టినిర్మాణ నియమాల క్రమాలను గురించి వివరంగా ఉన్నది. మనోవృత్తిమయమైన శరీరాన్ని అన్నమయ, ప్రాణమయాది కోశాల ద్వారా ఎలా చూడాలి? అన్నది చక్కగా తెలుపబడింది. ఇవి మోక్షమార్గ సోపానాలు, భారతం దీనికూడా ప్రతిబింబం వంటిదని చెప్పవచ్చును

వేదాలు నాలుగూ సమస్త విషయాలనూ వివరిస్తాయి. అయినా వాటిలో ఎక్కువగా ప్రతిపాదింపబడిన విషయాన్ని బట్టి ఆయా పురుషార్థాలకు ఆయా వేదాల్లో ప్రాధాన్యం వుంటున్నదని వైదిక తత్త్వవేత్తలైన కొందరు విద్వాంసుల అభిప్రాయం.

వారు చెప్పిన విషయాలు మనస్సునకు పట్టించుకోవడం మంచి విధి.



జరిగిన కథ

స్వామికి స్కూల్లో టీచరు ఉద్యోగంతోపాటు రఘుపతిగారింట్లో ఆశ్రయంకూడా దొరకటంతో అదృష్టవంతుడినని అనుకున్నాడు. అయితే రఘుపతి గారమ్మాయి పావనికి ప్రైవేటు చెప్పాల్సి వచ్చేటప్పటికి అతడికి వచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లయింది. పావని గడుగ్గాయి. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే ఆ అమ్మాయి స్వామికి కాస్త ఇబ్బందిగానే తయారయ్యింది. స్వామి తల్లి వచ్చి మామయ్య కూతురు శ్రీదేవిని జ్ఞాపకం చేసి వెళ్ళింది. శ్రీదేవి గురించిన జ్ఞాపకాలు స్వామిని గతచరిత్రలోకి మళ్ళించాయి. రంగా జమ్మని తన యింటికే తీసుకురమ్మని సీతమ్మ రాజయ్యగారిని కోరుతుంది. అప్పుడు రాజయ్యని అలితా ద్వేషిస్తారు. అతను కాస్త డబ్బు సంపాదించగానే మంగపతి మళ్ళీ ఆయన్ని ఆశ్రయించాడు.

7

అతివిశాలమైన ఆవరణలో తరతరాలుగా తమకు నీడనిచ్చిన—మండువా యింటిని వదిలి—మంగపతి కట్టించిన రెండంతస్తుల కరెంటు మేడలోకి కాపురం మార్చారు రాజయ్యగారు సీతమ్మగారికి యిష్టంలేకపోయినా. విసుగుదేశం నుంచి గమిడి గేదెను దిగుమతి చేయించి 'కమ్మగా తినవయ్యా బావా! మనం ఏం చేసుకోవాలి ఈ సంపాదనంతా? నాక ... ఒక్కగా నొక్క కూతురు. నీకూ ఒక్క ... వొక్కకొడుకు. ఆ మూడుముళ్ళూ వడ్డాయనిపిస్తే రెండు ఆస్తులూ వాళ్ళవేగదా? మా శంకరంగాడికి తాతగారిచ్చింది ఎట్టు చెప్పనా?' అనేవాడు మంగపతి.

వ్యాపారం మరికొంత జోరు హెచ్చడంతో 'మనమే కట్టుకుందాం బావా ఒకర్టైసుమిల్లు — ఏమంటావ్?' అని కేవలం సలహా అర్థించిన బావమరిది మాటలను నల్లమందుతిన్న శామందులా జోగుతూ, కడుపుమీద పడి సర్కసు చేస్తున్న కోడలు పిల్లతో మధ్యమధ్య ఆడుకుంటూ, ఆ వులిమ్మా వింటూ 'కట్టించవయ్యా బావా — నాదేముంది? ఏం కట్టించినా నీ కూతురిదీ అల్లుడిదీనూ. నా కాలం అయిపోవడంలా?' అంటూ కన్నుమూసి అటు ప్రక్కకు వత్తిగిల్లేవారు రాజయ్యగారు.

నిజానికి రాజయ్యగారి కాలం అయిపోయింది. ఫ్యాక్టరీ కట్టించటానికి రహదారీవంతైన ప్రాంతంలో స్థలాలు చూసి, జీపుకారు 'తోలుకుంటూ' తిరిగి వస్తున్న రాజాలాంటి రాజయ్యగారు—ఏనుగులాంటి రాజయ్యగారు—గమిడిగేదె పాడి కడుపునిండా త్రాగి, బావమరిది సలహాప్రకారం 'పాడు బిజినెస్సు గొడవలు' తగ్గించుకుని మన్నపడి లావెక్కిన రాజయ్యగారు— ఆకస్మికంగా గుండె ఆగి కన్నుమూశారు శాశ్వతంగా.

రాజయ్యగారు-కన్నుమూయడంతో స్వామి జీవితం తారుమారైపోయింది.

రాజయ్యగారి కుటుంబంతో ఒకటిగా పెనవేసుకు పోయిన మంగపతి కుటుంబం —మళ్ళీ దూరమైపోయింది.

'నీకు కోడలు పుట్టింది సీతమ్మా' అన్న మంగపతే 'బ్రతికుండగా నీగడప తొక్కను సుమా?' అంటూ రెండోసారి బెదిరించి సకుటుంబంగా తరలి వెళ్ళిపోయాడు!!.

* * *

ఆకస్మికంగా — ఎన్నడో తెగిపోయిన బంధాన్ని మరొకసారి కలుపుకుంటానికి —మేనమామ మళ్ళీ తమయింటికి రావడం —ఆశ్చర్యమనిపించింది స్వామికి. చనిపోయిన భర్త శరీరంమీద పడి ఏడుస్తున్న తల్లిని చూసి—తనూ ఏడ్చాడు. ఆ దృశ్యం తన జీవితంలో మరువురానిది. తండ్రి ఆ ఉదయమే తనను దగ్గరకు తీసుకుని తలనిమిరి 'నీకోసం ఫ్యాక్టరీ కట్టిస్తున్నాడురా మామయ్య' అనడం తనకు గుర్తుంది.

'బయలుదేరవయ్యా బావా! మరీ అంతబద్ధకం బలిసిపోతున్నది నీకు. అంతంత భారీశరీరాలు పెంచుకోవడం సుఖంలేదు సుమా' ఇలాగే మేనమామ తండ్రిని వేళాకోళం పట్టించడం తనకు గుర్తుంది.

'ఒక్కక్షణం' అంటూ సీతమ్మగారు లోపలికి పోయివచ్చి భర్తకు దిష్టితీసి 'ఊళ్ళోవాళ్ళ కళ్ళన్నీ మీమీదే' అనడం తనకు గుర్తుంది.

'ఈ వయస్సులో నాకు దిష్టేమిటి తాను మరిచిపోలేదు.
వెర్రిదానా? ఎవరన్నా విన్నా నవ్వి వెళ్ళిన నాలుగుగంటలకు బండిలో
పోతారూ?' అంటూ నవ్వుకుంటూ ప్రాణంలేని తండ్రిని, మేనమామ
జీపెక్కి బయలుదేరిన తండ్రి ముఖం యింటికి జేరవేసిన దృశ్యం కూడా తాను



అంతకుముందు నెప్పుడంటి అనారోగ్యపు జాడలూ కనిపించలేదు రాజయ్యగారిలో. అటువంటి రాయిలాంటి మనిషి గుండె ఆగి మరణించాడంటే ఎవరూ నమ్మలేక పోయారు ఆ వూళ్లో.

అంతకుమించి —

మరో కవార్త ఆ పరగణా మొత్తాన్ని ఆశ్చర్యంలో ముంచివేసింది అడవి మంటలా.

'రాజయ్యగారి సంగతి విన్నావా ?'

'జ్ఞానట ! కాలం తీరకుండాపోయాడు కలికాలం. నాలుగు కాలాలపాటుంటే కోట్లకు పడగలెత్తేవాడు.'

'సరిసరి ! తమకు తెలీదా ఏమిటి ? రాజయ్య సొంతం మునిగిపోయాడు.'

'లక్షలు సంపాదించా రన్నారు?'

'అన్నారు మరి'

'మేడ కట్టాడు గదండీ'

'కట్టాడు మరి'

'మరింకా మునిగిపోవడమేమిటే అంట?'

'అంతకు పదిరెట్లు అప్పులట. అప్పు పెట్టిన ఆసామిలకు రూపాయికి అర్ధం వచ్చే మార్గం కనిపించడంలా'

'మంగపతి ముంచేశాడంటారా ?'

'సరి సరి ! బావగారే తనను ముంచి నట్లు ఆయనగారు గుండెలు బాదు కుంటూ కాకిగోల పెడుతున్నాడు'

'అంతే నంటారా?'

'అసలు రహస్యం ఆ పరమాత్మకు తెలియాలి'

అసలు విషయం ఏమైనా అందరికీ తెలిసిన విషయం ఒకటి. నిజానికి రాజయ్య కుటుంబానికి నిలువ నీడలేకుండా పోయింది!

అక్షరాలా !!

'నా మాట వినుంటే యింత జరిగేది కాదు' అంటూ ఊళ్లో ప్రతి పెద్ద మనిషి దగ్గరా—మహా భారతమంత కథ చెప్పి—మూలుగుతూ రోదించాడు మంగపతి.

'అన్నయ్య' అన్న మాట వినలేదు సీతమ్మగారు.

'అప్పుల సంగతి అలావుంచు సీతమ్మా. వ్యాజ్యం వడుస్తూంది ఆ చవిటి పర్రల గురించి. అక్కడ పెద్ద ఫ్యాక్టరీ కడు తున్నారట ముందు ముందు గవర్నమెంటు వాళ్లు. అది జరిగితే ఎకరం పదివేలవు తుంది. మూడులక్ష లాస్తి. ఆ వ్యాజ్యం నడిపించటానికన్నా నాలుగురాళ్లు దొరు కక పోతే...'

'ఆయన అప్పులన్నీ ముందు రాగిపైస లతో తీర్చవలసిందే. బ్రతికినంతకాలం మహారాజులా తిరిగారు. ఆయనకు ఎంగిలి పేరు తెచ్చిపెట్టలేను. తెచ్చి పెట్టి బ్రతక లేను', అంటూ నిశ్చయంగా చెప్పింది సీతమ్మగారు.

'అలా అనుకుంటే రావలసిన రెండు లక్ష లాస్తి—హారతి కర్పూరమై పోతుంది ప్లీడరు యిప్పటికే గోల పెడుతున్నాడు రాజయ్య శ్రద్ధ తీసుకోలేదని — రేపు ఆ ఎంగిలి కూడుగూడా లేకుండా పోతావు'

'భగవంతు డున్నాడన్నయ్యా!'

'పలకడమ్మా ఆ పెద్దమనిషి ఎలు గెత్తి అరిచినా'

'కానీ, అన్నయ్యా ! నిండా మునిగిన దాన్ని'

సీతమ్మగారు నిర్ణయం మార్చుకో లేదు,

ఇది మీకు తెలుసా ?

* భోజనానికి గను 'ఆహార ధాన్యాలు అన్నిరకాలూ వాడాలి,

* సాధ్యమైనంతవరకు మిల్లు పట్టకుండా, చేతిదంపుని మంచిది.

* వస్పులు చేయకుండా ముడి ధాన్యాలు వాడ్డం మంచిది.

* ధాన్యాలు తినడానికి త్వరగా జీర్ణం అయేలా తయారుచేయాలంటే —మొలకెత్త నివ్వాలి, ఉడికించాలి, వేయించాలి.

* ఆరోగ్యకరంగా ఉండాలంటే —మొలకెత్త నివ్వాలి, మొలకెత్తినవి వేయించి పిండిచేసుకోవాలి, లేకుంటే బాగా పులియనివ్వాలి.

మనుష్య అర్థం కాకపోయినా — ఆ దృశ్యం తలగా ఈనాటికీ గుర్తు స్వామికి.

'నీ పొట్టు పిచ్చి కుక్క లకుగూడా పట్టవు' అన్నాడు మంగపతి తనతల్లిని. మామయ్యను కొట్టాలనిపించింది. 'నువ్వే కుక్కవి'—అనుకున్నాడు తల్లిని బల్లిలా కరుచుకుని.

'సత్తెకాలపు మనిషి పైసలతో భర్త బాకీలు తీర్చింది' అనుకున్నారు పరిపరి విధాలుగా అమ్మలక్కలంతా. 'మంచిపేరు తెచ్చుకుంది'. నిజమే. ఆ మంచి పేరు తోనే చెట్టుక్రింద నిలబడవలసి వచ్చింది సీతమ్మగారు.

తన సలహా వినకపోవడంవల్లనే యింత జరిగిందని కేకలు పెట్టిన మంగపతి— 'రోడ్డుమీదపడి అడుక్కుతినేరోజు వస్తుం దని నే ముందే చెప్పాను. నా మాటకు గడ్డిపోచంత విలువిచ్చావా ? నీ గడప తొక్కవలసిన పనుందంటావా ?' అంటూ తెగతెంపులు చేసుకుని వెళ్లిపోయి ఆ మాట యింతకాలం నిలబెట్టుకున్న అన్నయ్య — తనకు తోడనుకుంటూనే స్వామిని పెంచింది సీతమ్మగారు.

అందుకనే స్వామితో 'ఈ సంబంధం కలిస్తే మీ నాన్నగారి ఆత్మ శాంతిం చదురా నాయనా' అంది నిశ్చయంగా.

సీతమ్మగారి మనస్సులో దృఢంగా నిలిచిన ఆ నిశ్చయానికి చాలా పెంప న్నుంది. మంగపతన్నయ్య మళ్లీ ఏళ్ల తర్వాత తన గడపలో కాలుబెట్టి—'జరిగి పోయింది మరిచిపో చెల్లమ్మా ! నీ యింట్లో పాదం పెట్టటంకోసమే శ్రీ దేవి నా కడుపున పుట్టిందని నీకూ తెలుసు.' అంటూ, శాశ్వతంగా తెగి పోయిందనుకున్న సంబంధాన్ని కలుపు కుంటానికి ప్రయత్నించినప్పుడు 'అబ్బా యితో మాట్లాడి ఏ సంగతీ తెలియ జేస్తా నన్నయ్యా. ఆ ముచ్చట యిది వరకే ఎన్నడో జరగవలసింది. వయ స్సొచ్చాక రెక్కలు విరిచి మెడలువంచి చేయవలసిన కాలం కాదయ్యె.' అంటూ నిర్లిప్తంగా సమాధానం చెప్పినట్లు కని పించిన సీతమ్మగారిలో సంవత్సరాల తర బడి మండుతున్న మనస్సులో సుడులు వెడుతూ, జీర్ణం కాక, పైకిరాక, బుసలుకొట్టిన అవమానాగ్ని ప్రజ్వ


వివా
రెండు విధములుగా ఆరోగ్యమును కలిగించే పానీయము
పగలంతా ఎంతో శక్తి...
రాత్రంతా సుఖమైన విశ్రాంతి
ప్రొద్దున్న వివా త్రాగుతే... రోజంతా ఉత్సాహముగా ఉంటారు! మాల్ట్, గోధుమ మరియు ప్రొటీనులతో వివాలోని శక్తి మీగడగల పాలు పుష్టివంతముగా చేయబడినవి.
రాత్రి వివా త్రాగుతే... రాత్రంగా గాఢముగా నిద్రపడుతుంది! వివా యొక్క పసందైన రుచి మరియు దానిలోని పోషకవంతమైన పదార్థములు స్నాయువులను బలపరుస్తాయి, నరములకు ఉపశమనమును కలిగిస్తాయి, కండరములకు సేదదేరుస్తాయి.
వివా సులభముగా జీర్ణమవుతుంది... రోగులకు మరియు రోగమునుండి కోలుకొంటున్న వారికి ప్రత్యేకముగా తయారుచేయబడినది.
ఆరోగ్యమునకు త్రాగండి వివా!
నీళ్లలో లేక పాలలో దాని రుచి అహా!
VIVA
VIVA
The Double Action Health Drink
FORTIFIES YOU FOR THE DAY
RELAXES YOU FOR THE NIGHT
భారతదేశములో తయారుచేయువారు:
జగత్‌జిత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్,
జగత్‌జిత్ నగర్, హమీర (పంజాబ్)
సోల్ సెల్లింగ్ ఏజెంటు:
హోమ్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ ఏజెన్సీ,
ఏ డివిజన్ ఆఫ్ సారాభాయ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్.

తెల్లారేది నిజానికి.

'నేవెళ్ళి వాడితోనే మాట్లాడివస్తా' అన్నాడు మంగపతి.

'కాదన్నయ్యా! నేనే మాట్లాడి ఏ సంగతీ నీకు కబురుపెడతా. ఈ సంబంధం కాకపోతే మనవ్వ కూడా మరొకటి చూసుకోవాలిగదా? ఈడేరిన పిల్లాయె'

చెల్లెలి మాటల్లోని వ్యంగ్యాన్ని — చూపుల్లోని పౌరుషాన్ని — ఆపలించకుండానే ఆవలిమనిషి పేగు బు తెక్కపెట్టేటంత తెలివున్న బుర్రగనుక — ఆనవాలు కట్టిగూడా — పైకి పొక్కనీకుండా — తమ చిన్నతనాలనాటి ముచ్చట్లు కళ్ళకు కట్టినట్టు కొన్ని వర్ణించి — పోయిన తల్లిని తలచుకుని కళ్ళు తుడుచుకుని — జీవితాలు శాశ్వతం కాదనే రహస్యం ప్రకటించి — 'మాటదక్కించు సీతమ్మా' అంటూ పరిపరి విధాల ప్రాధేయపడి — తిరిగి వెళ్ళిపోయాడు మంగపతి.

సీతమ్మగారి నిర్ణయం మారిందికాదు.

తల్లి పట్టుదల ఎరిగిన స్వామికూడా అందుకనే తనకు ఆ సంబంధం యిష్టం లేదని చెప్పాడు.

చెప్పి — తల్లిని బస్సు ఎక్కించి తిరిగి వస్తున్న స్వామికి — ఎదురువచ్చిన పోస్టు బంట్రోతు ఒక ఉత్తరం యిచ్చి పోయాడు. 'ఆనందం రాసింది గామల్సు' అనుకుంటూ కవరు విప్పిన స్వామి — మొదటి పిలుపూ — చివరి సంతకం చూసి నివ్వెరపోయి — చెదరిన కళ్ళతో ఒకటికి పది సార్లు చదువుకున్నాడు ఆ ఉత్తరం.

'బావా...'

ఆ ఉత్తరంలో మొదట కనిపించిన పిలుపు.

'యిట్లు నీ శ్రీదేవి'

అది చివరి సంతకం!.!

* * *

'ప్రేమలేఖా ఏమిటి? ఏ భామ వ్రాసిందేమిటి మాష్టారూ?' అంది పావని.

త్రుళ్ళి పడ్డాడు స్వామి.

'చెప్పగూడదాండీ?'

'అబ్బె అదేం లేదండీ'

'ఏమీ లేకపోతే అంత కంగారెందుకు మాష్టారూ? నిజం చెప్పండి. మా తాతద్దాల కళ్ళజోడుంది చూశారూ? తలవం కొచ్చినప్పుడల్లా వాడస్తా రాజా ప్రేమలేఖలు-హిందీ — యింగ్లీషూ తెలుగూ — రకరకాల భాషలూ — ముద్దు పేర్లూ — నానా రభసా అనుకోండి — విని విని మాకు బోరెత్తి పోయింది లెండి. ఇంక వినేవాళ్ళు దొరక్క — వల్లెవాటులు సరిగ్గా వేసుకోడం చేతకాని కుర్ర కుంకల్ని డాబామీద కూర్చోపెట్టి — ఆ వూళ్ళోనే వుంటాట్ట ఆ డాక్టరు మరి — రోజూ ఒక ప్రేమలేఖ యిచ్చి పోతాట్ట. అది దిండుక్రింద పెట్టుకు కలవరిస్తేగానీ — ఆవిడగారి కళ్ళు మూతపడవట. అన్నీ చదివి వినిపిస్తుంది సిగ్గు లేకపోతేసరి. పాడు గోలనుకోండి. మా భారతమ్మ చెల్లెలు — నాకంటె నాలుగేళ్ళు చిన్నది — ఆపాడు హరికథ విని విని — బుర్ర తిరిగి — ప్రాణపతీ — అంటూ మొదలుపెట్టి — నీవు లేనిది బ్రతుకు ఎడారిపువ్వు — అంటూ కవిత్వం రాసి — కవరుకట్టి — ఎవరికివ్వాలో అంతు చిక్కక — టీకాల ఇన్స్పెక్టరు ఆదారిని పోతుంటే అతగాడిమీద — చిన్న రాయిమీద దాన్నిచుట్టి — గిరవాటెట్టి — చలిజ్వరమొచ్చి కంబళీకప్పుకు పడుకున్నదట—'

వింటున్నాడుస్వామి అయోమయంగా.

చెబుతున్నది పావని అంతులేని ఉత్సాహంతో—

'తర్వాత ఏమయిందో తెలుసా మాష్టారూ?'

మనస్సాక్షిగా స్వామికి బొత్తిగా తెలీదు.

'ఆ టీకాల ఇన్స్పెక్టరు అది నిజమనుకుని — మర్నాటి సాయంకాలానికి బదులుగా — ప్రాణేశ్వరీ — అంటూ మరో ప్రేమలేఖ వ్రాసి, ఆ యింటి చుట్టూ పారాకాయడం మొదలుపెట్టాడు. చివరకు ట్రాజెడీ అనుకోండి. మా భారతమ్మ అన్న పళ్ళు ఊడేలా వాయించాడు లెండి. ట్రాన్సుఫరు చేయించుకు పోయాడా భగ్నజీవి — హా లైలా — అనుకుంటూ'

పావని చెబుతున్న ముచ్చట్లు ఒక్కసారిగా ఆపి 'ఇవాళ బడికి వెళ్ళరా మాష్టారూ?' అంది.

'కానండి టైమైంది' అంటూ లేచాడు స్వామి.

స్కూలుకు పోవాలన్నా, హెడ్మాష్టరును చూడాలన్నా భయంవేసింది స్వామికి. కాని వెళ్ళక తప్పలేదు.

'బళ్ళో అడుగుపెట్టగానే హెడ్ మాష్టారు పిలుస్తున్నారండీ' అంటూ ఆహ్వానం అందింది. బిక్కు బిక్కుమంటున్న గుండెలను అదిమి పట్టుకుంటూ వెళ్ళాడు.

చిత్రంగా — భయంకరంగా కనిపించింది మాష్టారి ముఖం.

'కూర్చో' అన్నారు క్లుప్తంగా.

భయంగానే కూర్చున్నాడు కుర్చీలో ఒక మూలకు ఒదిగి. నిశ్శబ్దాన్ని కొంసేపు భరించి, చివరకు తలెత్తి చూశాడు. తన ముఖాన్ని పరీక్షిస్తున్నాయి మాష్టారి చూపులు.

'క్షమించండి మాష్టారూ'

'ఎందుకు?'

'మీ దగ్గర అబద్ధం చెప్పాను'

'ఎప్పుడు'

'నిన్న'

'ఏ విషయం?'

'మా అమ్మకు సుస్తీ చేసిన విషయం'

'ఎలావుంది నాయనా — అబద్ధమే గదా? ఊరు వెళ్తానన్నవాడివి — వచ్చావంటే — మనస్సు పరిపరివిధాల పోయింది. పోనీలే అబద్ధమే గదా? బ్రతికించావు పో. కానీ బాబూ! అప్పు అడగటానికి అటువంటి అబద్ధాలా ఆడేది? నాకంటె వెర్రివాడివి కాకపోతే ఏమిటి చెప్పు? మీ అమ్మగారికి ఈ విషయం తెలిస్తే ఎంతబాధ పడుతుందంటావు? తప్పు నాయనా తప్పు —'

గదిలోంచి బయటపడ్డాడు స్వామి. కాని ఆ అపనింద తనని చాలాకాలం బాధపెట్టింది. పరాంకుశం గారిని చూస్తే మరీ భయంవేసింది. ఆ అప్పు తీర్చకుండా తనకు నిద్రపట్టదు. హైదరాబాద్ నుంచి తిరిగివచ్చిన రఘుపతిగారు — తీసుకున్న డబ్బువిషయం మరచిపోయారనిపించింది. చివరకు జీతం రాగానే — అందులోంచే — పరాంకుశం గారికీ — హెడ్మాష్టరికీ యివ్వవలసింది యిచ్చి — మిగిలిన పదిరూపాయల కాగితం తాలూకు చిల్లరతో యింటికి చేరాడు స్వామి.

'ఏమయ్యా నల్లపూసైపోయావ్ నే

చిన్నప్పటినుంచీ వెతుకుతున్నా నీకోసం!' అన్నారు రఘుపతిగారు. తాను యింట్లోనే వున్నాడు మరి. 'నా డబ్బు' అని అడుగుదామనిపించింది. సాహసం నీరసించింది అంతలోనే. ఊరి రాజకీయాల గురించి ఎన్నోసంగతులు చెప్పారు మూడు తరాల వెనకనుంచీ. ఎంతో ఓపికగా విన్నాడు, చెప్పి చెప్పి 'ఇదుగోనయ్యా! నీ డబ్బు' అంటారనే ఆశతో. అనక పోగా ఒక సన్నివేశం వర్ణించి 'ఆ కోనేటి రావు తాగుతుంటాడా కాదా నువ్వు చెప్పు?' అని నిగ్గదీసేరు. మరో సంఘటన సంభాషణలో ఉటంకించి 'ఆ ముసలి చవట పెద్దమ్మంటాడా లేదా?' అని నిలదీసి అడిగేరు.

గొంతు ఫలమారి నోటరాక బాధ పడుతున్న స్వామి గోడు ఆయనకు అర్థం కాదు. ఏనుగుగున్నల మధ్య తెగదాడ లాంటి బడిపంతులు గోడు!.

ఆ విధంగా మూడు సంవత్సరాలపాటు ఏకధాటిన ఉపన్యసించటానికి సరిపడి నంత సంభారముంది రఘుపతిగారి బుర్రలో. మరికొన్ని కథలూ గాథలూ చెప్పగల్గి చివరకు 'అమ్మాయికి కొత్త శ్రద్ధగా చెప్పాలయ్యాటూవ్వనూ' అంటూ హెచ్చరించి 'అన్నట్టు కొత్త పరిస్థితికొచ్చాట్టు మునుపటికి మరిచేపోయా' అనుకుంటూ ఊపిరి ఆడక కొట్టుమిట్టాడుతున్న స్వామికి విముక్తి ప్రసాదించి చకచక అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయారు రఘుపతిగారు.

'రెడ్డీ మాష్టారూ!' అంది పావని, ఎదురుచూస్తున్నట్లు తండ్రి వెళ్ళగానే గదిలోకి దూకినట్లు అంగవేసి చెంగున.

'ఇవాళనుంచీ నాకు పట్టుదల వచ్చేసిందండీ. నాకు జన్మలో యింగ్లీషు రాదంటూ ఆ భూతద్దాల కళ్ళజోడు— ఆ వెధవ యింగ్లీషుముక్కలు అదీను— ఉత్తినవాళ్ళకి తలపేసిందండీ—నేనూ దూదేకి పారేశాననుకోండి. కెంటాంగరస్ అంటే ఏమిటండీ?'

'ఎందుకండీ?'

'నన్ను తిట్టిందిలెండి అది'

'అది అంత పెద్ద తిట్టు కాదండీ'

'దానిముఖం; పెద్దతిట్టు తిట్టే ధైర్యం ఆ నీరసరాణి కెక్కడుందిలెండి. అసలర్థం చెప్పండి'

'గయ్యాళి—అనండి'

'ఆహాఁ తనకంటె గయ్యాళినా? ఇంట్లో యిష్టంలేకపోయినా ఆ డాక్టర్ని —అసలు కులం కూడా ఒకటి కాకుండా —న్నా పెళ్ళాడా. మాష్టారూ చదివితీరాలండీ. కాసు గట్టిగా చెప్పాలి యింగ్లీషు గొడవ. ఈవేళ మొదలెట్టండి.'


స్వామి నవ్వాడు పావని తొందరచూసి.

'మీకు నవ్వుగానే వుంటుంది మాష్టారూ! నాకుమాత్రం కసిగా వుంది. రాత్రి నిద్ర పట్టటంలా మొదలు పెట్టండీ—'

ఆరోజు పాఠం బాగానే నడిచింది. 'ఈ పట్టుదల ఎన్నాళ్ళో' అనుకున్నాడు స్వామి. కాని పదిరోజులుగడిచినా ఆ పావని పట్టుదల తగ్గిందికాదు. ఈపదిరోజుల్లో స్వామి చెప్పులు బోసి పోయాయి. చిన్న నాటి అంటుజోడు అదృశ్యమైపోయింది. మరోక మహాపాపం చేశాడు స్వామి. రఘుపతిగారికోసం చేసిన అప్పులకు వెతుక్కుంటూ మొదటి నెలజీతం నడిచి వచ్చేపోయింది. 'మొదటి జీతమంతా తల్లి దోసిట్లో పొయ్యాల'నుకున్న స్వామి ఆశ నెరవేరింది కాదు. 'వస్తు అయ్యాక శనిఅదివారాల్లో నూజివీడు వస్తానమ్మా' అంటూ బస్సు ఎక్కేముందు తల్లికి చేసిన వాగ్దానం నిలబెట్టుకోలేక పోయాడు. అంతకుమించి నెల గడిచే ఎత్తు కనిపించలేదు. 'ఇంక జన్మలో అప్పు చేయగూడద'నే నిర్ణయానికి వచ్చాడు. ఆ నిర్ణయాన్ని నిలబెట్టుకుంటానికే చిన్ననాటి అంటుజోడు సన్యాసిరెడ్డికొట్టు పీరాసాయికి అమ్ముకోవలసి వచ్చింది. దాచుకుంటానికి విలువ లేని విషయమయింది.

'కంగ్రాచ్యులేషన్స్ వండోరేస్ — కొత్త ఫేషన్ వంటపడుతూంది. ఈ జ్ఞానవరం నీళ్ళు మూణ్ణాళ్ళు తాగేటే చాలు— జ్ఞానోదయం అయిపోతుంది ఎటువంటి మనిషికైనా' అంటూ కొంత వేళాకోళం పట్టిస్తూనే స్వామిని అభినందించింది పావని జోడు తీసినందుకు.

స్వామి అంతకుముందు రెండుకోజుల పాటు గొప్పకారం నమ్ముకుంటూ అమ్మ పోసిన పుల్లచల్లతో కాలక్షేపం చేశాడు. మాడిన పేగుకే తెలుస్తాయి దుముల పనలు. కమ్మగా పప్పు నాడు పెట్టు కోవాలనిపించింది స్వామికి. అంటుజోడు కొన్న పీరాస్వామి ఆప్యాయంగా వెచ్చ ఇచ్చి ఇచ్చి—మిగిలిన డబ్బు—నూటయాభై ఏడుంబావలా చేతులో పెట్టాడు కంసాలి కొనుక్కు చెప్పులు నమిలి నమిలి కొరికిం తర్వాత.



స్వామి సాంబారు యజ్ఞానికి వరా
ళాష్టగా తిరగమోత పరిమళం గుబా
ళించింది. 'భళి భళి' అంటూ చప్పట్లు
కొట్టిన పావని 'మాష్టారూ! సాంబారు
ఎలా పెట్టాలో కాస్త చెబుదురూ. సర
దాకి మా అమ్మని చచ్చేలా పాడలగొట్టా
లనుంది వంట చేసి.' అంటూ కుంపటి
దగ్గరకొచ్చి — పీటమీద మునికాళ్ళతో
గెంతి కూర్చుంది.

గెలుపు తప్పదనుకుంటూ యుద్ధంలోకి ఉరకుతున్న సైనికుడి సమరోత్సాహం లాంటిది వచ్చింది స్వామికి. చదువు విషయంలోగాని, బాడ్మింటన్‌లాంటి 'గేమ్స్‌లో'గాని తన గొప్పతనం అందరూ అంగీకరించక పోయినా, క్లాసు పిల్లలంతా ముష్టివారిలోటక్కు విహారం వెళ్ళిన రోజున తాను కాచిన సాంబారు త్రాగి ఆ లలితకళలో తనకున్న ప్రజ్ఞనూ ప్రాభవాన్ని గుర్తించారు. తమకు రవ్వంత సమర్థత వుందనుకున్న విషయం గురించి సలక్షణంగా వర్ణించి చెప్పాలనే ఉబలాటాన్ని మహాయోగులు మాత్రమే జయించారు. స్వామి మహాయోగి కాడు.

అందుకనే ఉడుకుతున్న సాంబారును మంత్రాక్షరముగా కలుపుతూ, మా ముఖ కంటె మరికొంత చనువుగా పావని కళ్ళల్లోకి చూసి 'మీరు ఉల్లిపాయలు తింటారాండీ?' అన్నాడు స్వామి.

'అయ్యో! ప్రాణమంటే బాబూ ఉల్లిగడ్డలంటే'

మమత

స్వామి ఉత్సాహంగా చెపుతున్నాడు.
పావని ఆసక్తితో వింటున్నది.

'సాంబారున్నది చూశారా పావనిగారూ! దానికి ప్రాణం ఉల్లిగడ్డ. ముందు పప్పు వేయించాలండీ. తర్వాత కాటుకలాగుండాలి. బద్దలు నలక్కపోతే ఏనపాలి మెత్తగా — వింటున్నారా'

'జన్మలో ఏ పంతులుచెప్పిన ఏ పాఠమూ వినసంతగా వింటున్నానండోయ్ — చెప్పండి — ఏనపాలి మెత్తగా — ఊఁ తర్వాత?'

'తర్వాత కూరముక్కల సంగతండీ. ఉల్లిగడ్డలూ, వంకాయ, టమోటాల ముక్కలూ సమపాళ్ళలో వేయించి, పులుసులో వేసి — కొత్తిమేర కరివేపాకు వేసి — అంతబెల్లం కూడా వేయాలి. సన్నటి సెగమీద గిన్నెడు సాంబారు నిమ్మదిగా మరిగి నాలుగోవంతుకు చిక్కపడేలా చేసి — ఇంగువా — ఆవ్నివేసి తిరగమోత దట్టించి...'

విరగబడి నవ్వుతున్నది పావని యింకా ఆగక —

'ఎందుకంటే అలా నవ్వుతారు. చెప్పమన్నారని చెబుతున్నా'

తెల్లబోయాడు స్వామి.

'చెపుతున్నారనుకోండి' అంటూ కడుపు చెక్కలయ్యేలా నవ్వుతున్న పావనిని చూడగానే స్వామికి సమరోత్సాహంలా పొంగిన ఉబలాటం చల్లారి, అంతకు ముందున్న అన్నహితవు తప్పింది.

'ఇంతచావు నేను చావలేను మాష్టారూ! అయినా అసలు గట్టిగా వసందుగా చేయాలంటే మీలాటి భుజబలమున్న మగధీరులే చేయాలండీ వంట. అందుకనే నలపాకం — భీమపాకం అంటూ లొట్టలు వేస్తూ పురాణం చెప్పేవారు మనుగారు. పూర్వజన్మలో మీ చేతి వంటరాలని — ఈపాడు తడిబొగ్గుల వంటబాధ తప్పించుకున్న అదృష్టవంతురాలు ఆ దమయంతో — ఈ ద్రౌపదో కాస్త వివరించి చెబుదురూ వినితరించెదను' అంటూ నాటక ఫక్కీలో లేచి వంగి నమస్కరించింది.

'ఉస్సేయ్! కొరకంచూ! కణతల నొప్పొచ్చి నాలుగు పెండలం ముక్కలు వేయించి తగలబెట్టవే అంటే — అబ్బ — మాడి తగలబడినట్లుందే — వేపుడు మూకుడు పొయ్యిమీద పెట్టి ఆ కబుర్లేమిటే —'


శారదమ్మగారు కేకపెట్టి మూలిగింది.

'చూశావా స్వైరసకూత! — ఈవిడ గారు తల్లో — సవతితల్లో అంతు చిక్కక మతి పోతూంది మాష్టారూ' అంటూ విసురుగా వంటింట్లోకి తరలిపోయింది పావని.

'మాడ్చి తగలబెట్టావే తల్లీ మళ్ళీ జన్మలో పనిచెప్పకుండా. లెంపలేసుకుంటున్నా పూర్వజన్మలో — ఖర్మ — మొగరాయుణ్ణే కన్నానే తల్లీ — నీకు నడుమెక్కడ వంగుతుందే — నాలుగు వేపుడు ముక్కలు వేయించి, ఉద్ధరించేదు చాలు సిత్తుల 'తగలెట్టవే అంటే — పొయిలోనా వేశావుగదుటే వంటిల్లంతా. ఎక్కడో రాసిపెట్టిందో గాని — ఆ కట్టుకొన్నవాడి కొంపకేకి వందరెయ్యవుటే మవ్వా —'


— అంటూ బాధపడుతున్న శారదమ్మగారి మాటలూ — గుర్రంతోకలా జడ కట్టుకుంటూ కూనిరాగం తీస్తున్నపావని సంగీతమూ — రెండూ రెండు చెవులతో వింటున్న స్వామి — సాంబారులో ఉప్పు పడలేదనే విషయం గుర్తుకు రాకుండానే నాలుగుముద్దలు తిని చెయ్యి కడుక్కున్నాడు.

(ఇంకా ఉంది)



ప్రొద్దుట
తాజాతనము
గంటలు తరబడి
రోజంతా

కొను, స్నానం అయిన తరువాత ప్రొద్దుట
పూటవుండే తాజాతనము రోజంతా
గంటల కొద్దీ వుంచుకోవచ్చు....పాండ్స్
డ్రీమ్ ఫ్లవర్ టాల్కుతో. భారతదేశంలో
విస్తారంగా అమ్ముడయే టాల్కు
పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్కుకు నాజూకైన
పరిమళము అల్లా వస్తూనే వుంటుంది....
పాండ్స్ డ్రీమ్ ఫ్లవర్ టాల్కు తడిని
వెంటనే పీల్చుకుంటుంది,
అతివస్త్రహితంగా చేరాలనిపిస్తుంది....
చల్లగా, తాజాగా, పరిమళిస్తూ
వుంటుంది. ఉక్కతో ఒళ్లంత
అంటుకుంటూండే ఉష్ణ
ప్రదేశాల్లోనూడా. ఇది సంవత్సరం
పొడుగునా అన్నికాలాలలోను
వుపయోగించగల టాల్కు!
3 సైజులలో లభిస్తుంది
ఫ్యామిలీ-లార్జి-మీడియమ్



పాండ్స్
డ్రీమ్ ఫ్లవర్ టాల్కు

అతి మృదువుగా ఉల్లాసకరమైన టాల్కు
చీస్ బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్
(పరిమితమైన బాధ్యతతో యు. ఎస్. ఎ. లో స్థాపితము.)

P-9183



బొమ్మల కథా సీరియల్
1
వీళ్ళిద్దరి మధ్య వున్న స్నేహం యీనాటిది కాదు! ప్రస్తుతం ఆంధ్ర రాజధానిలో వున్న ఒక పెద్ద కంపెనీలో...
రాంబాబు
సాంబాబు
నిక్షేపంగా ఉద్యోగం చేస్తున్నారిద్దరూ! రాంబాబు కింకా పెళ్ళి కాలేదు! రెండేళ్ళ క్రితమే పెళ్ళైనా సాంబాబు యింకా కాపురం పెట్టలేదు! అందుకే యిద్దరూ ఒకరూంలో ఉంటూ గడిపేస్తున్నారు! ఇంతలో ఓరోజు ఆఫీసులో
* * * * * *
ఇవాళ పొద్దున్నుంచీ ఆఫీస్ వర్క్ మీద బుద్ధి యిటులేదురా! ఎంచేతంటావ్?
ఏం! బాస్ నోరు జేసుకున్నాడా? తలనొప్పా? లేపోతే యివాళ ఏదయినా కొత్త సినిమా...
MANAGER
ఛఛ! అలాటిదేమీ కాదురా!
ఇందాకట్నుంచీ యిక్కడ ఏదో గాయం తగిలినట్టు బాధగా వుంది రా!
అరెరెయ్! అసలు సంగతి సూటిగా చెప్తావా లేదా!
చెప్తాన్రా బాబూ చెప్తాను! ముందు నా కాలరు వదిలెయ్!
అదారా దారికి!
వస్తాగాని ముందు కేంటీన్ కి నడు!
దార్లో రాంబాబు సాంబాబుకి అసలు విషయం చెప్పాడు!
ఛాల్లా! అదా సంగతి! అంతా బాగానే వుంది కానీ...


గ్రీన్ విల్లాలో ఉన్న ఆ అమ్మాయి తో నీకేర్పడ్డ లవ్ ఎట్ ఫస్ట్ సైట్ లో నాకు నమ్మకం లేదురా! నువ్వెవరో తెలీకుండా నిన్నే ఎలా ప్రేమిస్తోందని అనుకోడం!
నువ్వు ఎవన్నా సరే! నేను మాత్రం ఆ అమ్మాయిని గాఢంగా ప్రేమిస్తున్నారా!
... ఆ అమ్మాయి కూడా నన్నే ప్రేమిస్తోందని అనుకుంటున్నాను!
అయితే వెంటనే ఆ అమ్మాయిని పరిచయం చేసుకుని నువ్వనుకుంటున్నది ఎంతవరకూ నిజమో కనుక్కో!
సాంబాబు సలహా రాంబాబుకి నచ్చింది! కానీ రాంబాబు వద్ద యింకా జేసిన ఆ అమ్మాయి నాల్రోజుల్దాకా మళ్లీ బస్టాప్ లో కనబళ్లేదు!
* * * * *
కష్టాలు కలకాలం వుండవు కదా! అదే జరిగింది యీ రాంబాబు విషయంలో కూడా! ఉన్నట్టుండి ఓ సాయంత్రం...
ఒరేయ్! చూడు చూడు! ఆ అమ్మాయే!
ఏయ్ రిక్షా! ఇలా రా!
తొందరగా ఆ రిక్షా వెనకాతే పోనిసికెళ్లు!
అలా ఒకదాని వెంట మరోటిగా వెళ్లిన....
...ఆ రెండు రిక్షాలు 'కల్పలత' దగ్గర కొచ్చి ఆగాయ్!
UPER BAZAR

వారఫలం

22-5-1970 శుక్రవారం మొదలు
28-5-1970 గురువారం వరకు

మేషం : వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

వృషభం : నమ్మినవారి వల్ల యిబ్బందులకు గురి కాగలరు. అధిక వ్యయం జరుగుతుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం : అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరతాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కర్కాటకం : వ్యాపారంలో సాటి వారితో పోటీ పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం ఆఖరులో మీరు ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వ్యాపారంలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాటి వారితో మాట పట్టింపులు తగవు.

కన్య : ఇతరులనిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు.

స్త్రీలకు— ప్రయాణాలోచనలు చేస్తారు. దైవకార్యాలు నెరవేరతాయి.

తుల: వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. సంతోష కరమైన వార్తలను వింటారు. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. మీకు మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించ గలరు.

స్త్రీలకు — వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. నూతన విషయాలను తెల్సు కొంటారు.

వృశ్చికం వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. సాటి వారిలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలో మొగమాటాలు తగవు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. బంధుమిత్రులను కల్సు కొంటారు.

ధనుస్సు : వృత్తిలో నూతనావకాశాలులభిస్తాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోష కరమైన వార్తలను వింటారు.

మకరం: కొన్ని వ్యవహారాల్లో అనవసరమైన శ్రమ కలుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

కుంభం. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో తిరిగి అనుకూల పరిస్థితులు యేర్పడతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

మీనం : అన్ని వ్యవహారాల్లోను గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సు కొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

—మహేష్

3 స్విష్ బ్లేడులు

5 యితర బ్లేడులు అంతకాలమే పనిచేస్తాయి

ఎందువలన?

1 అంతర్జాతీయ ప్రమాణములకు సరిపోయేలా ఉండుటకు, దిగుమతి చేయబడిన టంగ్‌స్టన్ కార్‌బైడ్ పైన తయారుచేయబడినది.

2 ముక్కు క్రింద కోతలు, గాయములు రాకుండుటకై మూలలు గుండ్రముగా చేయబడినవి.

3 ప్రతి బ్లేడు క్రొత్తదిగా చాలసార్లు గడ్డము చేసుకొన్నా ఉండేలా గడ్డము చేసి పరీక్షింపబడినవి.

4 కేశ రంధ్రాలలో కూడా క్షౌరం చేయుటకై మొనతేరిన పదును చేయబడినది.


5 తినివేయబడకుండా ఉండుటకు మరియు చాలా కాలము నిలిచే పదునుకు 1100°పై హీట్ ట్రీట్‌మెంటు చేయబడినది.

6 ఎక్కువ నున్నగా ఉండుటకు ప్రత్యేకమైన ఫార్ములా టిఆర్-7 హై డెన్సిటీ పోలిటెట్రా-ఫ్లోరో ఎథిలీన్ పూయబడినది.

7 దిగుమతి చేయబడిన స్టెయిన్‌లెస్ స్టీలునుండి తయారుచేయబడినవి.

8 ఉండాలన్న నాణ్యతకు మరియు సామర్థ్యతకు అన్ని దశలలోను ఎడతెగని పరీక్షలు జరుపబడినాయి.


9 అదనపు పదునుకు మళ్లీ ప్రెస్సింగ్ అంచు!



అదిగో అందుకనే మీకు

ఒక ప్యాకెట్టులో 3 స్విష్ స్టెయిన్‌లెస్ బ్లేడులనే యిస్తున్నాము.

సంఘర్షణ



కొనకళ్ల వెంకటరత్నం

'తమ్ముళ్లుంగారు దయచేసినట్టున్నారే' అన్నాడతను ఎద్దేవాగా.

'ఏం? మీకు కడుపుబ్బుగా వున్నదా?' అన్నదామె నిష్ఠూరంగా. అతను డాక్టర్ రాజారావు; ఆమె అతని ధర్మపత్ని రాజేశ్వరమ్మ.

'అదేమిటిరాజా? బావగారు వస్తే, విసుక్కునేంత దరిద్రమా నాది? ఇకపోతే, ఆలివంకవారాత్మ బంధువు లన్నారు ... బావగారువస్తే లాంఛాలమీద లాంఛాలుకూడాను. వచ్చినప్పుడల్లా...అక్కయ్యకి చీర...బావమరిదికి రవల ఉంగరం...మేనల్లుళ్ళకి బిస్కట్ పొట్లాలు...ప్రెజంటేషన్ల మీద ప్రెజంటేషన్లు!' అని బనియన్ విప్పుకున్నాడు డాక్టరు.

'అబ్బ—ఎంత చదివారండీ? పదహారేళ్లయినా ఇంకా దోచుకుతింటామనే అభ్యారిల్లు? అమ్మాయి వాసంతి ఎదిగిందిగా...పెళ్లిచేసి అల్లుడి కేమాత్రం బాగుగా బహుమతి ప్రదానాలు చేస్తారో చూస్తానుగా...ఈ కంటిరెప్పలు దూరం కావు.' అని పెనిమిటి ఎత్తుకున్న పొరాయగం తుడిచేసి టర్కీ తువాలందించింది రాజేశ్వరమ్మ.

ఈ దయలాగంతా పేపరు తిరగేస్తో ముసిముసినవ్వులు నవ్వుకొంటూ ఆలకిస్తున్న రామనాథం స్టూలుమీద నించి లేచినవాడై—

'బావగారు పెందరాళే తెమిలారల్లే వుందే ఇవాళ? ఆపరేషన్లు లేనా యేం?' అని పలకరించాడు డాక్టర్ని.

'ఆ...ఆ...నేను చెయ్యాలిసిన 'ఆపరేషన్లు' అయ్యాయనుకో. ఇహను... 'నన్ను' ఆపరేషన్ టేబిలుమీద కెక్కించే దొరగారు వచ్చారుగా' అని రామనాథం వంక చురుక్కున చూచి ... కిసుక్కున నవ్వి ... తువ్వాలు చుట్టబెట్టుకున్న వాడల్లా 'బాత్‌రూం'లోకి ఒక్క గెంతు గెంతాడు డా. రాజారావు.

'టీపాయ్' మీదనించీ 'కప్పులు' తీసి 'వాష్‌బేసిన్'లో కడిగి 'కబోర్డు'లో పెడుతోంది రాజేశ్వరమ్మ.

'చూశావా అక్కయ్యా...నేను రోజూ మీ ఆయనమీద 'ఆపరేషన్లు' చెయ్యడానికే వస్తున్నానట' అన్నాడు రామనాథం తెల్లబోతూ.

అతగాడింకా డాక్టరుగారి విసుళ్లకి పూరాగా అలవాటు పడలేదు.

* * *

డాక్టరు రాజారావుగారి 'ఆపరేషన్లు' అందరూ ఎరిగున్నవేను. రామనాథం చేసే 'ఆపరేషన్లు' హాస్యాల రూపేణా... 'ఎనస్తీషియా' 'క్లోరోఫారమూ' లేకుండా సాగిపోయే వెక్కిరింపు అని ఆ సందర్భమిదీ—

డా. రాజారావుగారి ఆసుపత్రి పెద్దదే. మేడమీద ఆయన వుంటారు కింద ఆసుపత్రి. ఆయన జిల్లా మొత్తంమీద పేరుమోసిన సర్జన్. ఆయన 'ఆపరేషన్ థియేటరు' ఎప్పుడూ కలువపువ్వులా వుంటుంది. కత్తులూ, కత్తెరలూ 'స్టెరిలైజర్'లో ఎప్పటికప్పుడు కడిగిన ముత్యాలల్లే మిలమిలలాడుతూ రెడీగా వుంటాయి. ఆయన 'ఆపరేషన్' చేస్తే పట్టు కత్తిరించినట్టు అనాయాసంగా వుంటుందని ప్రతిపి 'హాస్పిటల్'లో ఒక

"ఎక్విప్‌మెంటు" న్నదనీ ఒకటి లేదనీ అనేందుకు లేదు. ఆక్సిజన్ సిలిండరే'నా, ఎల్ట్రా వయొలెట్ థెరపీయేనా, పెల్లెన్‌ల్యూకరేటస్సైనా ... వగయిరా వగయిరా పూర్తి పరికరాలతో అనుపత్రి కలకలలాడుతూ చుసేంద్రదంలా సభుగరిసి ఆకర్షిస్తో న్నుంటుంది.

ఆయన హాస్పటలు సుసంపదని ప్రతీతి; ఆయనది రోరింగ్ ప్రాక్టీసు; స్వతహా మితభాషి; నిగర్వి; చల్లగా మాట్లాడతాడు; కోపతాపాలు ఎరుగడు; రోగం చిన్నదైతే పెద్దగా చిత్రించి చెప్పి ప్రాణాలు తియ్యడు. రోగం పెద్దదయినా దాని ఉధృతాన్ని వర్ణించి చెప్పి హడలగొట్టడు. అసలు ఆయన్ని చూస్తేనే రోగం తిరుగుమొహం పడుతుందని అదో నాడిక చుట్టూతా; అందుకే ఆయనకి దేవుడు డాక్టరని పేరు.

వచ్చిన చిక్కల్లా డాక్టర్ రాజారావు అతిపుదారుడు. ఆ అపుదార్యం పేదసాదల పట్ల నయితే హర్షించ దగ్గదే. కాని, డాక్టర్‌గారి కలాంటి పక్షపాతం లేదు. ఉన్నవాళ్లనీ, లేనివాళ్లనీ, ఇవ్వగలవాళ్లనీ, ఇవ్వలేనివాళ్లనీ ఒకే అంచున్తో చూడడం ...ఒకే మోతాదులో అప్యాయత వొలకబొయ్యడం...జీర్ణించిపోయిన అలవాటయిపోయింది డాక్టరుగారికి. ఎవరేనా ఫీజిస్తే, దేనికిస్తున్నారో, ఎంత ఇస్తున్నారో కూడా అలా చూడటమనేది లేదు; పంట్లాం జేబులో పెట్టుకుకోయ్యడం...తరవాత ఇంజక్షన్‌కని 'అయొడిన్ స్వాబ్' చేతో పుచ్చుకొని 'కాంపవుండరు' నిల్చున్న రోగిదగ్గరికి జరిగిపోవడా —అదే తంతు.

దానితో...డాక్టరుగారి మంచిని దర్జాలాగా ఉపయోగించుకునే ప్రబుద్ధులెక్కువయ్యారు. ఇప్పేవాళ్లే చూస్తే దర్జాగా చేస్తున్నారు మరి! లేనివాడూ ... ఇవ్వలేనివాడూ ... సరేసరి... వాడిచ్చేదీ లేదు...ఈయనగారు పుచ్చుకునేదీ లేదు; వాళ్లలాగూ నెత్తిన చేతులు పెడుతూనే వున్నారు వాడికి డాక్టరుగారి లోతిలి ధర్మాసుపత్రి క్రిందలెక్క. నాడితోపాటు...కలవాడూ...ఇవ్వగలవాడూ సాధ్యమైనంతవరకూ విగనామం పెట్టాలని చూస్తున్నాడు. 'ఏమీ ఋట్టజెప్పని వాళ్లకన్న, దండిగా చెల్లగొడుతున్న మనకి అదనంగా ఈయన వారగబెడుతున్నదేమిటి?' అని స్వగతంగానే అనేసుకున్నారు చాలామంది.

లోకంపోకడ అల్లాంటిది?

మంచితనం మరీ చవకయితే కూరలో లోటకూరకాదని చూచినట్లు చూస్తారు మనిషిని!

కాగా, డాక్టరు రాజారావు స్నేహశీలి. ఆయన చేసే స్నేహాలంకథి కూడా చాలా విస్తృతమయినది. ఉద్యోగులేనా, ఉపాధ్యాయులేనా, ధనికులేనా, నిర్ధనులేనా, కవులేనా, గాయకులేనా, ఆఫీసర్లేనా, అలగాజనమేనా...అందరూ ఆయన స్నేహకోటికోనివారే.

దేముడు డాక్టరుగారి అభిరుచులు సైతం బహుముఖాలు. ఆయనకి సంగీతమంటే ఇష్టం. సాహిత్యమంటే ప్రీతి. సినిమా అంటే ప్రాణం. నాటకాలంటే పిచ్చి. నాట్యాలంటే వ్యామోహం. అసలు ఈ 'ప్రాక్టీసు' అందుకోకముందు 'సిక్రిటిక్కు'గానూ నవలా రచయితగానూ కొన్నాళ్లు కలంతిప్పి సాముగరిడీలు చేశారు. ఆయన సాహితీ బంధువులూ, కళాసింధువులూ ఏర్పరుచుకున్న సంబంధాలే గాక, స్నేహమే ఒక కళకింద మలుచుకొన్న అమృతమూర్తి. అందుచేత ఆత్మీయతా, ఆప్యాయతా కావలసిన ప్రతివ్యక్తీ ఆయన పరిధిలోకి ఆకృష్టమై ఆయన సాంగత్యాన్ని అపేక్షించడం జరిగింది.

ఇప్పుడయినా ఎవరేనా దొరకాలేగాని... పట్టుకుని...ఆయా విషయాలమీద తాపీగా చర్చలు కొనసాగించే ఓపిక మిగిలే వుంది ఆయనలో.

ఎటొచ్చీ రాజకీయాలతోమాత్రం ఆయన ప్రమేయం పెట్టుకోలేదు. ఆ బురదలో కొన్ని అడుగు పెడితే ... తక్కిన ఇన్ని రంగాలలోనూ సజీవంగా మెరులుతున్న ఇన్ని అభిరుచులూ, ఆసక్తులూ ఒక్క దెబ్బని ఎగిరి చక్కా పొయ్యేవి. కాని అది జరగలేదు.

ఏతావాతా, చెప్పొచ్చే దేమంటే ... ఇటు, సాంఘిక, సామాజిక, విద్యా, విజ్ఞాన సాంస్కృతికరంగాలన్నిటినించీ అపుర్వధాలు అప్పనంగా పట్టుకుపొయ్యే రోగులు డాక్టరుగారిచుట్టూ పెరిగిపోయారు; కనపడితే చాలు కౌగలించుకుంటాడాయను డక్టరు.

అంతాత...పోను పోను...తాము డాక్టరు దగ్గరకి వెడుతుండటబట్టి ఆయన హోదా పెరిగిపోతున్నది అనుకునే ధోరణికి వచ్చేశారు చాలామంది మిత్ర మహాశయులు. 'ఈయనకి 'ఫీజో'కటా పైపెచ్చు?...దండగ' అనిపించింది కొందరికి. ఆశ్చర్యమేముందీ?

అయితే, ఇంత ధారాళంగానూ ఉచిత వైద్యం చేస్తున్న డా. రాజారావుకి రాబడి తక్కువేమీ కాదు. కాని డాక్టరుగారిచెయ్యి ఎంత పెద్దదయితే దానికంత గాలితాకిడీ వుంది. ఆయనకి క్షణం తీరిక లేదు. దమ్మిడీ వెనకేసింది కనపడదు.

'టవున్'లోకి ఏ పెద్దమనిషి రానీండి ... డాక్టరు రాజారావుగారింట్లో విందు కుడవకుండా ... వారి ఆతిథ్యమందుకోకుండా వెళ్ళినవాడిది పాపం. కనిపించిండి తరవాయి ... డాక్టరుగారు రెండు చేతులూ ఆహ్వానిస్తారు...వారితో అవతల ఆసామికి తప్పుకుందుకు వీలూ వుండదు ... మర్యాదలు బహుమాన్యాలిపరి లవనిరమూ ఎరుగదు.

అయితే డాక్టరుగారు పిలిచేది ఏ ఒక్కరిరో అయినా ఆ ఒక్కరితోపాటు మరో పదిమంది ఆయన సహపంక్తిని భేవుమి లేనుస్తో లేకుండా జరగదు. ఆ వచ్చేది ఏ కవిగారో అయితే...ఇక చెప్పేరి ...ఆయనచుట్టూ మూగి ఏక 'టేబిలు' మీద 'ప్లేట్లు' ఖాళీచేస్తున్న జనాభా అంతా కవిగారి బృందమని డాక్టరుగారనుకుంటారు, అదంతా డాక్టరుగారి పరివారమని కవిగారనుకుంటారు అంటే లేదా.

ఇక పోతే,...వచ్చిపోయే బంధు బలగమింతా అంతా కాదు. 'ట్రీట్‌మెంట్ల'కయితే అర్థంవుంది. కాని రామకోటి వుత్సవాలకనీ, వెంకటేశ్వర సప్తాహమనీ కనీ, వూళ్ళో నడుస్తున్న విష్ణుయాగానికనీ...ఒకటా?చెరరు వుండేకోటికి చీమలు తామే వస్తవి బారుకట్టి!

దానా దీనా...ఇంట్లో వేసేవిస్తరీతిపే విస్తరీసు, రాజేశ్వరమ్మ పరేసరి... పెళ్లివారువచ్చి పెరటల్లో దిగినట్లే వుంటుంది ఎప్పుడు చూచినా హడావుడిగా.

'ఈ వంటా వార్పూ వడ్డన కార్య క్రమాలకని ఇంటినిండా తొంబకింద నవుకర్లు, చాకర్లు. సేవకులింట్లో ఎక్కువయితే చేస్తే పనులు మిగిలిపోవూ ? ఈ వచ్చేపోయ్యే జనాభాకి కాఫీ టీలకి గాను... పెరట్లో పాలిచ్చే మూడు గిబిడిగేదెలు, వాటికి గడ్డి గాదం వేసేందుకూ, రెండు పూటలా పాలు పితికి వప్పజెప్పేందుకూ, ఇద్దరు పాలేళ్లు, వాళ్ళకి ఉభయమూలగా ఒక రేకుల షెడ్డు.

ఇలా...ఇలా ... డాక్టరుగారి కుటుంబ వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించుకుపోయి ఒక దివాణంగా మారింది.

* * *

రామనాథం డాక్టరుగారికి పెద్ద బావమరిది, ఆయనది కొవ్వూరి కాపరస్థులం, చదువూ సంధ్యా పూజ్యమయినా రామనాథం గొప్ప వ్యాపారస్తు. చాలా చాలా వ్యాపారాల్లో తలదూర్చి...చక్రం తిప్పి... అలిసిపోయి...ప్రస్తుతం ఖాళీగ వున్నాడు. సొంత పెట్టుబడితో వ్యవహారం నడిపే అసామీ కాస్త అవి ఖాళీగాని అడుగు ముందుకువెయ్యడు. ఉత్తరోత్తరా అంత నాల నిచ్చెనలమీదనించి పాతాళాలోకి దిగివచ్చే లాభాలమాట ఎలావున్నా ... మొదట్లో పెట్టుబడికింద వెచ్చించిన మూలధనం మాయంకాకుండా టూచుకోవలిసిన జాగర్తంటా

సంఘపక్షం

ఒకటే తప్పనిసరిగా ఉంటుంది యజమానికి. రామనాథం చేతిలో 'క్యాపిటల్' శూన్యం. 'డబ్బు నీదీ బుర్ర నాదీ...కలబోద్దాం పదు' అని నడుం బిగించే బాపతు. అందుచేత అతని పథకాలు చాలా పెద్ద ఎత్తున నడుస్తాయి. ముగ్గులోకి దిగే ముందు అతగాడు వర్ణించి చెప్పే విధానంలో అరచేతిలో వైకుంఠం అగుపించి, రూపాయల మోత మహా శ్రావ్యంగా వినిపించినా...తరవాత ...రంగులు వేసి పంకాలు బిగించే సమయంలో గాలిమేడలు కాస్త పక్కకి వొరిగేవి.

అట్లాగని వ్యాపారంలో రూపాయలు పీకేసి ... సొంత జేబులు నింపేసుకుని... బాయింటుదారు నెత్తిన చేతులు పెట్టే టోకరా ఇచ్చే గడి కింద పందికొక్కు జాతి కాదు రామనాథం. 'పెట్టుబడి మనది కాదూ' అన్న తరవాత మనకి తెలీకుండానే......పనలో సొంగులు వాడే ధైర్య సాహసాలు లలాంటివి! ఆ తరవాత మనం వదిలితే గాలిపటాన్ని నొక్కిపట్టే దారం కాస్త పురివిప్పిపోతుంది. అప్పిస్తే ఏమనుకుని కానేస్తా సంటాడు రామనాథం.

రామనాథం ఈ డాక్టరు బావగారి ఖర్చూ...ధర్మసత్రం కింద నడుస్తున్న ఇల్లూ వాకిలి ... అన్నీ నిశితంగా పరిశీలించాడు. ప్రస్తుతం కొవ్వూరికీ ఏలూరికీ మధ్య నడుస్తున్న తన విద్యుద్యోగ యాత్రలో డాక్టరుగారి సంపాదనని ఒక దానికి తీసుకురావాలని...అయిన వ్యాపారం తోని రూకలు కాస్త తగ్గించాలని... ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాడు అపూ తడపా. చెప్పి నపుడల్లా...ఇక్కయ్యని మధ్య పెట్టుకుని..బావగారి చెవికెక్కని హితబోధలు పదేపదే చేసి చక్కాపోతున్నాడు. అవి రామనాథం 'జవహేషన్లు.'

* * *

డాక్టరు రాజారావుకి మూగ్గురాడపిల్లల తరవాత ఇద్దరు మగ నలుసులు. పెద్ద అమ్మాయి నాసంది కాలేజీ చదువు మహా వ్యాపంగా సాగుతున్నది. తక్కిన పిల్లలు కాన్వెంటు స్కూళ్ళలో, కిండర్ గార్టెన్లలో ఇంగ్లీష్ విద్యతో కట్టుబాట్లు పెరుగుతున్నారు. వాళ్ళ అందరికీ ట్యూటరింగ్ లో నాటకంతోనూ గంటగంట...వ్యాపకాలు ప్రత్యేకించి ఉండనే ఉన్నాయి.


ప్రస్తుతం మూడు పువ్వులూ ఆరు కాయలుగానే ఉంది డా. రాజారావుగారి పని.

కాని పెద్ద పిల్ల పెద్ద చదువులు చదువుతున్నదన్న ఎక్కువలో ... ఆమెకి పెళ్ళి వయస్సు...అంటే పెళ్ళి వయస్సు దగ్గర పడుతున్న వయసం అడుగున పడిపోతోంది. గృహలక్ష్మి అయ్యే ముందు ధనలక్ష్మి కూడా ఆమె వెనకాల రెండడుగులు వేస్తేనేగాని ఏ గృహ ద్వారాలూ తెరుచుకోవన్న చేదునిజం... ఆకాశామీద విమానయానం చేస్తున్న డాక్టరు గారి చూపు కింకా అందలేదు. ఆయన మహానుభావుడు! ఈ నేలమీద రేగే దుమ్ముకి ధూళికీ అతీతుడు!!

'అయితే, బ్యాంకులో నిలవేమాత్రముంది అక్కయ్యా?' అని అడిగాడొకనాడు రామనాథం. పలుకున్నది రాజేశ్వరమ్మ.

'హయ్యో రాత...'బ్యాంకు ఖాతేనా? కటా? నాయనా, కదిలే జీవనది లాంటిదిరా మా యిల్లు, నీళ్లు నిలవుంటే పాకుడుపట్టి పసరెక్కిపోదూ?' అన్నది.

'మరి రేపు పిల్లకాయలు పెళ్లికున్నార్లు, బావగారి సామ్మేదాకి తగ్గట్టు



కామయని గోపని పెద్ద చదువులు చదివిం చాలి. ఎన్నెన్ని బరువు బాధ్యతలు ముందున్నయ్యో తెలుసునా? రోజులన్నీ ఒక్కలా వుండేనా?'


'దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి...నూనె లేని ప్రమిదలో వత్తి చరచరా కాలిపోతుంది మరి, దప్పి గొనక ముందే తవ్వాలి బావి, కళ్ళున్నప్పుడే కాటుక పెట్టుకోవాలి, అవి పోయిం తరవాత సూర్య నమస్కారాలు చేదామంటే కాదు. కాలానికి ఋతువులు మారినట్టే మనిషి అయిశ్వర్యానికీ అదృష్టానికీ ఆటూపోటూ వుంటుంది. 'దూకలేని వాడు పోకచెయ్యడు.' అని హితం చెప్పాడు రామనాథం.

'ఏమి చెయ్యను తమ్ముడూ? నిజానికి నమ్మినమ్మకపో ... మీ బావగారిది కన్ను చెదిరే సంపాదనుకో...కాని ఏమి లాభం? ఒక్క పైసా వెనకేసిందికి లేదు. ఎడారిలో తుపాను వస్తేనేంగాక...ఎక్కడిదక్కడ ఇంకిపోతున్నదనుకో' అని తుంచేసింది రాజేశ్వరమ్మ.

ఇకపోతే ఎవరికైనా సంపాదనకి కొన్ని పక్కదార్లుంటయ్యని తెలియనే తెలియదాయనకి.

అక్కడికీ, సత్యన్నారాయణవ్రతమని ఒకసారి ... మేడమీద హాలు వేసినప్పుడు గృహప్రవేశమని పేరుపెట్టి ఇంకొకసారి, డాక్టరు బావని పీటమీద కూచోబెట్టి, చదివింపులంటూ ఒక తతంగం నడిపి, పదిహేను పదహారువేలు రాబట్టి బ్యాంకులో వేయించాడు రామనాథం. డాక్టరికి ఇలాంటి పక్కవాటు సంపాదన అంటే చికాకు. చిన్నచిన్న రోగలొచ్చి వైద్యం చేసినప్పుడు...మొహమాటానికి పోయి వొదులుకున్న చిల్లరమల్లర కేసులన్నీ ఇలాంటి శుభసమయాలలో కూడ దీసుకోవచ్చును బావా అంటే మొహం చిట్లిస్తాడు; ఇందులో బలవంతాన గుంజుకున్నదేముందీ?

అడ్డమైన వాళ్ళా 'మెడికల్ సర్టిఫికెట్లూ' 'ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లూ' తేరగా రాయించుకుపోతున్నారు డాక్టరుగారి దగ్గరనించి. 'సర్టిఫికెట్టు'కింతా అని 'ఛార్జి' చెయ్యవయ్యా అంటే, 'ఎరిగున్నవాడు — ఎలా అడగనూ?' అంటాడు; ఎరగనివాడి దగ్గర మహ



వికృచ్చిగా వసూలు చేసినట్టు!

ధనాశ అంటూ లేకపోయింతరవాత వంసారి అన్నవాడు ఎట్లా కొరగానివాడై పోతాడో వెయ్యివిధాల చిలవలు పలవలుగా వర్ణించి చెప్పాడు రామనాథం. వింటేనా?

ఇట్లా కాదని 'యక్స్—రే క్లినిక్కు' ఒకటి పెట్టించాడు డాక్టరిచాత. డాక్టరుచేత పదకొండణాల వాటాలు కొనిపించాడు. తతిమ్మా వాటాలు చిల్లరమల్లరగా 'టవున్‌లో' ఇతర డాక్టర్లు సర్దుకున్నారు. వూళ్లో యక్స్—రే క్లినిక్కంటూ వొకటి లేదు. లాభసాటిగా వుండచ్చు.

* * *

'రండి రండి... బహు కాలదర్శనం' చిరునవ్వుతో ఆహ్వానించాడు డా. రాజారావు. కూచున్నారు కోటిలింగంగారు.

'బొత్తిగా వల్లపూసయిపోయినారేం?' అని ఇష్టంగా నవ్వాడు డాక్టరు.

'ఏదో ఈ మధ్య వొంట్లో కాస్త ఆరోగ్యంగా వుంటోందండి' అని నసిగాడు కోటిలింగం హాస్యంగా.

'అంటే ఏదో రోగం వస్తేనేగాని నాకు కనపడరన్నమాట' పకాలుమన్నాడు డాక్టరు.

'అంతే గదండీ; రుగ్మత లేనప్పుడు గూడా డాక్టరుగారి టయిము తినేందుకు వస్తే లేని రోగాలు సయితం గుర్తుకి రావచ్చు.'

ఇద్దరూ కలివిడిగా నవ్వుకున్నారు.

కోటిలింగంగారు మోతుబరి ఆసామీ. టవున్‌లో పెద్ద 'బిజినెస్ మేగ్నెట్' డాక్టరికీ ఆయనకీ జోస్తీ.

'వారం రోజులనించీ అప్పుడప్పుడు సాయంత్రవేళ ఉష్ణం తగులుతోంది... అన్నహితవు లేదు ... నోరు అరుచిగా వుంటోంది. వళ్లమాలిన నీరసం' వచ్చిన పని వివరంగా చెప్తున్నాడు కోటిలింగం.

'కాంపవుండర్ని 'టెంపరేచరు' చూడమన్నాడు డాక్టరు.

స్టెతస్కోపుతో ఛాతీ పరీక్షించాడు. ఊపిరితిత్తులలో గురగుర ఏమీ లేదు. పెన్సిలిన్ అయిదు డోసులిస్తే సరిపోతుంది.

ఆలోచించాడు డాక్టరు. ఎందుకైనా

సంఘర్షణ

మంచిది. యక్స్—రే ఫోటో తీయించుకు రమ్మని రెక్విజిషనిస్తేనో? చీటీ వ్రాసి ఫోటో తీసుకొచ్చి చూపమన్నాడు. 'యక్స్—రే క్లినిక్కుకి అనుబంధంగా లేబొరేటరీకూడా వోపెన్ చేశారు. కళ్లీ నీరుడూ రక్తమూ కూడా పరీక్షకి పెట్టాడు.

కోటిలింగానికి గుండె గుభిల్లుమంది. కొంప మునుగుతోందా ఏమిటి చెప్మా? నిలువుగుడ్లు పడిపోయి నిల్చుండిపోయాడు అమట్న.

'మరేం ఫరవాలేదు ... ఆందోళనకి ఆస్కారం లేదనుకోండి. అయినా అనుమానం నివృత్తి చేసుకున్నది రైటు కదా' అని పంపేశాడు డాక్టరు.

కోటిలింగం ట్రీట్‌మెంటు వారం రోజులు నడిచింది.

మధ్యలో ఒకసారీ...ఆఖర్న మరోసారి ఫోటోతోసహా పరీక్షలన్నీ యధావిధిగా జరిగినై. పరీక్షలు దేనికిదానికి లేబరేటరీలోనూ 'యక్స్-రే.క్లినిక్కు'లోనూ వేరువేరుగా ఛార్జీలు చెల్లించి పరిక్షా ఫలితం ఎప్పటికప్పుడు డాక్టరు చేతిలో పెడుతున్నాడు కోటిలింగం.

ఆఖర్న సెలవు తీసుకొంటూ ఏదో ఫీజు చేతిలో పెట్టాడు.నోట్లు పంట్లాం జేబులోకి తోసేశాడు డా. రాజారావు.

రాత్రి 'నైట్‌క్వీన్' విరగ బూసిందేమో సువాసనలు చెరిగి పోస్తోంది! చందమామ తెల్లనిమబ్బుల్లో దూరి దోబూచు లాడుతోంది. పెద్దమ్మాయి వాసంతికి పరీక్షలు దగ్గరపడినైగావును పుస్తకాలు ముందేసుకుని...గదిలో టేబిలు 'లైటు' ముందు కూచుని ...తుమ్మెద ఝుంకారం చేస్తున్నట్టు ... పాఠాలేవో గొణగొణ కంఠస్థం చేస్తోంది.

డాక్టరికెంతకీ నిద్రపట్టలేదు. ఎప్పుడూ ఆదమరచి నిద్రపోయే అలవాటాయనకి. అనవసరమూ అప్రస్తుతమూ అయిన ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి బుర్రలో. అందుకని నిద్ర పట్టటం లేదా, లేక, నిద్రపట్టక ఆలోచనలు చెలరేగుతున్నాయా? తను గాడితప్పి మామూలుకి భిన్నంగా నడి చాడావేళ. అదీ. తపన!

కోటిలింగానికి మామూలు జ్వరమేను, దానికి వాడింది మామూలు పెన్సిలిన్ డ్రగ్గేను.

ఇంకో పేషెంటయితే అసలు 'ఫీజే' అక్కర్లేదనేవాడు డా. రాజారావు.

కోటిలింగం దగ్గర ఈ చిన్నసాదా జ్వరానికి ఇంతఫీసు తీసుకున్నందుకు గుండె పీకుతోందా? ఇంత ఇమ్మనీ అంత ఇమ్మనీ తను దేవిరించాడా? అదేం లేదే.

ఇకపోతే, కోటిలింగం పన్నకారు మనిషేమీ కాదు, అతనికెంత ఆస్తివున్నదో అతనికేతెలీదు, ఆమాటకొస్తే...దానికి ఎన్ని అంకెలు కూడాలి, ఎన్ని 'బిల్డింగులి'కి విలవకట్టాలి — ఎన్ని 'ఫ్యాక్టరీల'లో 'షేర్లు' గుణించాలి? అతను చేస్తున్న దానధర్మాలా కోకొల్లలు! రాముడి పెళ్లనీ, దేముడి యజ్ఞమనీ, కామాక్షి సహస్రహామనీ ... తలా ఒకరూ వచ్చి ...ఎప్పుడూ ఏదో దండుకొని పోతో వుంటారాయన దగ్గర్నించీ. ఆయన 'బిజినెస్సు' ఉచ్చదశలో వుండగా చూచి, 'నీ గురుడు ఏకాశమందున్నా'డని జాతకం చెప్పి... ఏవేపునయినా సందర్భం కలిసిరాక కాస్త దిగాలుగా వున్నప్పుడు పసిగట్టి... గ్రహదోష నివారణకని పరిహారాలు సూచించీ ... అతనిదగ్గర వందలువందలు దానాలూ దక్షిణలూ పట్టుకుపోయిన జ్యోతిష్కులూ సిద్ధాంతులూ లెక్కిస్తే వేస్తారు చుట్టుపక్కల. అతని దగ్గర నించీ 'ఫీజు' దండిగా గుంజితేనేం, మూడు 'యక్స్—రే' ఫోటోలు తీయిస్తేనేం తీసరమా? విషజ్వరం కాదన్న సందేహం నివృత్తి చేసుకుందుకు 'ఫోటోలు' తీయించాలిసొచ్చింది తనూ. అందులో తప్పేముంది? అది మామూలు జ్వరమేను అని వొక నిర్ధారణ కొచ్చేందుకు తన డిగ్రీ తన విజ్ఞానమూ, తన అనుభవమూ అక్కరకొచ్చినయ్యా లేదా? వాటి విలువ ఇరవయ్యంటే ఇరవై, నలభైయ్యంటే నలభై, ఖచ్చితంగా రోగనిదానంచేసి మరీ 'ట్రీట్‌మెంటు'కి దిగాలిగదాతను? అదితప్పా? ఫోటోలు చూచింతరవాత... కళ్లపరిక్షకి పట్టిన తదుపరి ... ఇది క్షయకాదనీ ... మామూలు జ్వరమేననీ... ఒక నిర్ధారణకి వచ్చాడు గాబట్టి సరిపోయింది. లేకపోతే...

అది 'మలేరియా' అని కొన్నాళ్ళూ... 'టైఫాయిడ'ని కొన్నాళ్ళూ, బిళ్ళలూ 'ఇంజక్షన్లూ' వాడివాడి...అది కొసకి ఏ విషజ్వరమోనని తేలినాక...అప్పటికే అది తన చెయి దాటిపోతే... తను కక్కుర్తిగా వైద్యం చేస్తున్నట్టు లెక్కకి రాదా? అంతరాత్మ ఏదో గోలచేస్తోంది తప్ప, తను చేసిన అపరాధమేమున్నది ఇందులో? భయంకరమైన వ్యాధిలక్షణాలేవో పొడ చూపినట్టూ, డాక్టరు చక్రమడ్డేసినట్టూ, అతగాడు 'ఫీల'యి, తనకి 'ఫీజ' కాస్త ఎక్కువగా ముట్టజెబితే తన మోసమేమున్నదనీ? ఈ ప్రశ్నలన్నీ లోపల్నించీ వరంపరగా దూసుకొచ్చి నిలబడుతుంటే, తాపీగా సమాధానాలు చెపుకొంటూ పోతున్నాడు డాక్టరు.

ఆ తరవాత 'ఫోటో'లు తీయించుకు రమ్మనమని చాలామందికి 'రెక్విజిషన్లు' వ్రాసి బెత్తాయించాడు డాక్టరు. వాళ్ళల్లో కలవాళ్ళున్నారు, లేనివాళ్ళున్నారు, కాని తనేం చెయ్యగలడు? అనుమానముంటేనే 'యక్స్—రే క్లినిక్కు'కి పొమ్మంటున్నాడు తను. తన 'డ్యూటీ' తను చెయ్యాలిగదా—అ.

ఇంతాజేసి ఫోటోలు తీయించుకు రమ్మని డా. రాజారావు పంపిన రోగుల సంఖ్య బహు స్వల్పం. తతిమ్మా డాక్టర్లు పంపిన కేసులు కోకొల్లలు. పదకొండణాల వాటాదారు కాబట్టి 'క్లినిక్కు'కి వచ్చిన లాభాలు పంపిణికి వచ్చేసరికి హెచ్చు భాగం డా. రాజారావు పరమవుతున్నాయి దానితో డాక్టర్లకి కాస్త కంటగింపుగానే వుంది. ఒకసారి రామనాథం గుణిశాడు కూడాను అట్లాగని. రాజారావుకి తట్టుగాలి వచ్చింది. ఈ రామనాథానికి ఇంట్లో మెల్లిమెల్లిగా పెత్తనం జిక్కుతోంది. ఇతగాడు ఒకరవ్వ కాల్చమంటే వాళ్ళంతా వాతలు పెట్టేలా వున్నాడు. అయినదానికీ కానిదానికీ 'ఫోటో'లకి 'రిక్విజిషన్లు' బరికెయ్యమని ఇతని సలహానా? అక్కడికీ తను యధాశక్తిగా 'క్లినిక్కు'కి పని జెబుతోనే వచ్చాడు అంతరాత్మ నోరునొక్కి.

ఈ వాదోపవాదాలన్నీ ఎందుకు బయల్దేరినయ్యో డా. రాజారావు కర్థం కాలేదు. ఎవరడిగారనీ తనని? ఫోటోలు తీయించుకు రమ్మనమని అడ్డమైనవాళ్ళనీ ఎందుకు తరుముతున్నావూ అని ఏవరునిగ్గదీశారూ తనని? ఆ మాటకొస్తే, తను జాస్తిగా ఫోటోలు పట్టమ్మని సాగించిన తరవాతనే తనకెక్కువ పేరొచ్చింది; ఏదో ముంచుకొస్తుంటే ఆనకట్ట వేసినట్టూ ...మహా జాగర్తగా ట్రీట్మెంటు చేస్తున్నట్టూ... కర్ణాకర్ణిగా మ్రోగుతున్నది కూడాను చుట్టుపక్కల.

అంతవరదాకా ఎందుకూ? కోటిలింగానికి ఎంత తృప్తిగా వున్నదనీ తను మూడు ఫోటోలు తీయించినందుకు!

నిశ్చింతగా కన్నుమూసుకున్నాడు డాక్టరు. గాఢంగా నిద్ర పట్టేసింది.

డాక్టరికే తెలియదు; మనస్సు మహా చెడ్డది; తనకిష్టమయిన పని ఏదిగానీ, అది నజావయిందనీ, నబవయిందనీ, దాఖలాలతో సహా మనముందుంచి వొప్పిస్తుంది. అందాకా ఎందుకూ? ఒక దొంగనీ ఒక హంతకుణ్ణి నిలబెట్టి పలికిస్తిమా...ఆ దొంగతనమూ, ఆ హత్యా న్యాయమైనవేనూ అని, సహేతుకంగా, యుక్తియుక్తంగా, కాదనేందుకు వీలు లేకుండా నిరూపణ చెయ్యగలడు.

*   *   *

'మీ తమ్ముల౦గారు సంచార మంత్రిత్వశాఖ నిర్వహిస్తో... ఏలూరు రోడ్లు సర్వేచేస్తో కాలక్షేపం చేసే బదులు...ఏదయినా వుద్యోగమొకటి సంపాదించుకుని రాచరికాలు వెలిగించేగూడదూ?' అన్నాడు డాక్టరు వంకాయి కూరలో బఠానీలు రుచి చూస్తో.

'డైనింగ్‌హాలు'లో 'టేబిల్ మీల్స్' తినుకుంటున్నారు డాక్టరు దంపతులిద్దరూ.

'వెన్న చేతులో బెట్టుకొని నేతికేడ్చినట్టుంది. చెట్టంత బావగారుండగా మా తమ్ముడికేం కొదవ? ఏదో వాకవారి చూపండిమరి' అని పింగాణీ ప్లేటులోకి 'క్యాబేజీ సూప్' వొంపింది రాజేశ్వరమ్మ.

'నేనా? ఆయనగారికా? ఉద్యోగ ప్రదానమా?' అన్నాడు డాక్టరు బిత్తరపోయి.

'రాత్రి అదే అనుకున్నాము.' అన్నది రాజేశ్వరమ్మ ముక్తసరిగా.


'ఏమని?' ప్లేట్లో 'స్పూను' అట్లాగే వుంచి భార్యా రత్నం వంక ప్రశ్నార్థకంగా చూశాడు డాక్టరు.

'మీరు 'ప్రిస్క్రయిబ్' చేస్తున్న మందులే వేనకు వేలు ఖరీదుంటయ్యట. ఒక 'మెడికల్ స్టోర్సు' పెడితే నో? తమ్ముడు 'మేనేజిమెంటు' చేస్తాడు. ఆలోచించండి.'

'ప్లేట్లో స్పూను' మళ్లీ పని చెయ్యడం ప్రారంభించింది.

'అలా చెప్పు' ఏదో 'స్కీము' ముందే

ఇదుగో – నా తోక
ఆడుతోందా చూడమ్మా??



తయారై వున్నదన్నమాట. నేను 'మెడికల్ స్టోర్సు' పెట్టి... నా దగ్గరకి వచ్చిన 'పేషెంట్లం'దరినీ నా 'స్టోర్సు'లోకి వెళ్ళి ఔషధాలు కొనుక్కోండమ్మన్నని తరిమితే ... ఈ టవున్‌లో డాక్టరుగా నా పరపతేముంటుందిహనూ?'

'అబ్బ — మీ పేరు మీదుగా ఎందుకుంటుందండీ స్టోర్సు? నా పేరుమీదే తెరవవచ్చును. పేరు వాడిది లాభాలు మీవి? ఇంతని జీతమివ్వండి వాడికి చాలు.'

డాక్టరు ఆలోచించాడు.

ఈ మధ్య 'క్లినిక్కు'మీద ఎప్పుడు కొంతా అప్పుడు కొంతా పైకం వేసుకునే అలవాట్లు మెల్లి మెల్లిగా మానుకుంటున్నాడేమో, 'బ్యాంకు పాస్ బుక్కు' అడపాదడపా చూచుకొంటున్నాడు రాజారావు. అయిదువేల పై చిలుకు నిలవ తేలినప్పుడు, ఆరువేల అంకె మీదకీ, ఏడువేలదాకా పూడినతరవాత, ఏటుదుశ్శబ్దమనిపించి, ఎనిమిదివేల సంఖ్య మీదకే చూపు సాగారుతోంది.

'మరి దానికెంత పెట్టుబడి గావాల్నో ఏమిటో?' మొగ్గ ముందు కొప్పేసి నిళ్ళు నమిలాడు డాక్టరు.

'ఆ మాత్రం మనదగ్గర లేకపోలేదులెండి. తాడూ బొంగరం లేకుండా దిగుతామా?' కార్యేషుమంత్రి అనిపించుకొన్నది రాజేశ్వరమ్మ.

'సరే కానిమ్మను' 'వాష్ బేసిన్'లో చెయ్యి కడుక్కుని 'న్యాప్‌కిన్'తో మూతి తుడుచుకుని క్రిందికి దిగిపోయాడు డాక్టరు.

ఒక నమ్మకముంది డాక్టరుకి, రామనాథం ఏ వ్యాపారం చేయించినా ధిగ్రమింగుడు వ్యవహారాలకి మాత్రం దిగడు.

ఇన్నాళ్ళూ డాక్టరుగా ఉన్నతంగా బ్రతికాడు తను. ఇప్పుడు మెడికల్ స్టోర్సు పెడితే తప్పేముంది? తను ఏవ మేషాలు లెక్కబెడుతున్నాడు గని...తెలివిగల వాళ్ళు వ్యాపారంచేసి లక్షలు పోగేసుకోవడం లేదూ? ఆ మాటకొస్తే వ్యాపారం కాని దేమున్నది? ఇరవైవేలు ఖర్చుపెట్టి 'యం. బి' చదివి, 'స్టెత' 'స్కోపు' మెళ్ళో వేసుకుని, నాలుగు రూపాయల మందు వాడి, నలభై రూపాయలు 'ఫీజు' రాబట్టుకోవడం వ్యాపారం కాదా యేం? వేషమెంత మార్చినా, విద్యలెన్ని నేర్చినా వ్యాపారంకాని వ్యాపాలాలెన్ని మసచుట్టూ తా నడుస్తున్నయ్యనీ! గల్లాపెట్టె, చిరా ఆవర్జాలూ లేకుంటే సరిపోయిందీ?'

ఈ తర్కంతో డాక్టరుగారి అంతరాత్మ నోరు మూసుకుంది.

'ఫ్రిలెన్‌సాంటు' 'వాసెన్‌షర్టు' మీదకి 'టక్‌న్' చేసుకుని టక టక మెట్లు దిగి పోయాడు డా. రాజారావు.

'సంజీవినీ మెడికల్‌స్టోర్సు' వెలిసింది. రామనాథం రొట్టె నేతిలో పడింది.

డా. రాజారావుకి దానితో ఏమీ సంబంధం లేనట్టే లెక్క. 'డ్రగ్ స్టోర్ లైసెన్సూ' 'నార్కొటిక్ డ్రగ్సులికి 'ఎక్సైజ్ పర్మిట్లూ' అన్నీ రామనాథం పేరనే వున్నాయి.

మెడికల్ స్టోర్సులో అమ్మకాలు జాజ్వల్యమానంగా సాగుతున్నాయి. కొత్త నీటికి చేప ఎదురెక్కినట్టు చకచక అమ్మకాలు సాగిస్తున్నాడు రామనాథం. మొదటినెల వెయ్యి, రెండోనెల మూడు వేలు ... ఇలా అలా పెరిగిపోయినయ్యి అమ్మకాలు.

అంతవరకూ డాక్టరు రాజారావు 'మెడికల్ రిప్రజంటేటివు' లిచ్చిన సాంపుల్ ప్యాకెట్లలోనించీ, బిళ్ళలుగానీ, 'వయాల్స్'గానీ, 'యాంపూల్సు' గానీ ఇచ్చిన పేషెంట్లకి విచ్చలవిడిగా ఖర్చు పెట్టేరిహాజు. 'స్టోర్సు' పెట్టింది లగాయితూ, ఏ 'క్లయింట్లు' వచ్చినా ఫలాని 'డ్రగ్సు' తెచ్చుకోమని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసివ్వడం సాగించాడు. వాళ్ళు పక్కనే 'సంజీవిని మెడికల్ స్టోర్సు'లో నించీ కొని తెచ్చుకున్న తరవాత... అవి ఎలా వాడాలో అబీశీలుగా చెప్పి బెడద వదలించుకుంటున్నాడు. దానితో డాక్టరు 'ఫీజు' ఎగవేసేది చాలక, దర్జాగా ఔషధాలు నమేయూ జేవార్చుగ పట్టుకుపోయే ఫురానా మనుషుల తాకిడీ కాస్త తగ్గింది.

'పేషెంట్ల'కి కూడా తృప్తిగ నే వున్నదీ పద్ధతి.

ఎప్పుడేనా ఏ సన్నకారు 'పేషెంటు'కేనా ఆసుపత్రి మందిచ్చి పంపుగామని చూచినా, 'మెడికల్ సాంపుల్స్' బీరువాలో బొత్తిగా కనిపించడంలేదు డాక్టరికి.

డా. రాజారావుకి చటుక్కున స్ఫురించింది. రామనాథం ఆశాపాతకుడు. ఆసుపత్రిలో వున్న 'సాంపుల్స్' కూడా 'స్టోర్సు'కి పట్టించేస్తున్నాడేమో దారుణంగా. అవి అమ్మకూడదు నిజానికి, ఆ ప్యాకెట్ల మీద, ఇది 'డాక్టరికిచ్చిన నమూనా — అమ్మకానికి కాదు' అని యింగ్లీషులో అచ్చుగొట్టి వుంటుంది కూడాను.

'సాంపుల్స్ ఏమవుతున్నాయా?' అని కాంపవుండర్ని అడగుదా మనుకున్నాడు, కాని ఎందుకో అడగలేదు, అడిగినట్టయినా, రామనాథం మోసుకుపోతున్నాడని బైటపెట్టక మానడు. ఆ పైన రామనాథాన్ని నిలెయ్యాలిశి వస్తుంది. తరవాత నడిచే తంతు చాలా చికాకుతో కూడుకున్న వ్యవహారం. రామనాథ మంటే డాక్టరుకి ఒక విధంగా అసహ్యమూ కాస్త భయం కూడాను. మెదలకుండా ఊరుకున్నాడు.

తరవాతనిపించింది, సాంపుల్సమ్ముకోవడం తనకీ యిష్టమేనా కొంపతీసి?

ప్రాక్టీసు యధావిధిగా సాగిపోతూనే వుంది. చెదురుగా వస్తున్న పదులూ వందలూ ఇంటి వాడకానికని యెప్పటికప్పుడు ఖర్చయిపోతూనే వున్నాయి మామూలు ధోరణిగ. 'ఎక్స్-రే క్లినిక్కు' మీదా, మెడికల్ స్టోర్సు మీదా వస్తున్న లాభాలు వేలమీద వుంటున్నాయి. అది రాగానే చేజిక్కించుకుని చెదిరిపోకుండా 'బ్యాంక్ ఎక్కవుంట్' కెక్కించి జాగర్త పడుతోంది రాజేశ్వరమ్మ.

* * *

ఆ మధ్య ఒకసారి 'ఎక్కవుంటు' తిరగెయ్యటంలో, అందులో చూపిన లాభం కన్న ఎక్కువ మొత్తం తనకు ముడుతున్నదని గమనించాడు డాక్టరు. ఎక్కువ ఎలా ముట్టజెబుతున్నాడబ్బా? చిత్రంగానే వుంది.

ఈ మెడికల్ స్టోర్సు పెట్టిన తరువాత రామనాథాన్ని చూడటమంటే కాస్త బెరుగ్గానే వుంది డాక్టరికి. ఎక్కడ ఏ మురుగు కాలవలోకి దింపుతున్నాడో అన్న భయమే!



మీ మీ సరకుల పట్టిలో
ఉండే తీరాలిది
ఆ టీపేరే A-1 డస్ట్
రుచికి అమోఘం
సువాసనలో గొప్పతనం
తరచి తరచి చూడండి
—డబ్బు ఆదాచేస్తుంది!
Brooke Bond Tea
Brooke Bond
A-1 Dust Tea
బ్రూక్ బాండ్ A-1 డస్ట్
ప్యాకెట్టుకు
హెచ్చు కప్పుల మంచి టీ

'ఈలోగా ఒక వొడదుడుకు వ్యవహారం బయట పడింది. ఒక 'హార్టు పేషెంటు'కి గుండె నొప్పి కనిపిస్తే 'పెథిడ్రిన్' తెచ్చుకొమ్మని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసిచ్చాడు డాక్టరు. 'సంజీవినీ మెడికల్ స్టోర్సు' నించి మూడు రూపాయలిచ్చి కొనుక్కు తెచ్చుకొన్నాడు. అది కంట్రోలు అయిన డ్రగ్గు. ముప్పావలాకన్న యెక్కువమ్మగూడదు. రామనాథం... వీడి కక్కుర్తి మండ...తనకి తెలీకుండా అవుషధాలు 'బ్లాక్' లో అమ్ముతున్నాడా కొంప దీసి? దినం మంచిదని తెల్లవార్లూ దొంగిలించినట్టుంది! అవలక్షణం గలవాడికి అక్షింతలు వేస్తే, నెత్తిమీద నించీ తన నోట్లో వేసుకున్నట్టున్నాట్ట!! మొన్న 'స్టోర్సు'లో ఒక బేడ నాటా తీసుకోమన్నాడతన్ని. అప్పటినించీ పుట్టిందా ఈ బుద్ధి!

తళుక్కున మెరిసింది, నిన్న ఎక్కవుంట్లు చూస్తుండగా తన కొచ్చిన ధర్మసందేహం...ఏదీ?...పద్దులేని లాభాలు తనకెలా దఖలు పడుతున్నయ్యా అన్న మీమాంస...ఇప్పుడు తీరిపోయింది.

రవుతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళతో నడుస్తుందిట. రామనాథాన్ని చివాట్లు వెయ్యాలి. ఈసారి బాగనే కోపం వచ్చింది డాక్టర్‌కి. ఇట్లాంటి నకిలీ వ్యవహారమంటే తనకి కంపర మెత్తుతుంది.

దూకుడుగా మెట్లెక్కి రాజేశ్వరమ్మ మీద విరుచుకుపడ్డాడు.

అంతా వింది రాజేశ్వరమ్మ 'మెడికల్ స్టోర్సు' పెడితే లక్షణంగా డబ్బు చేసుకోవచ్చును అనుకున్నదామె. అంతే. అందులో తప్పేముందీ? కాని వక్రమార్గాన ఆర్జించుకోవాలన్న కక్కుర్తి ఆమెకే కోశానా లేదు. తమ్ముడెందుకిలా అడుగడుగునా పెనిమిటి కిష్టంలేని అడ్డదార్లు తొక్కుతున్నాడో అర్థంకాలేదామెకి.

డాక్టరూ తొందరపడ దలుచుకోలేదు. అంతకీ...బ్లాక్‌లో మందులమ్మి కురదలా జేబులో వేసుకుంటున్నాడా అంటే ఆదేం లేదు. అదంతా డాక్టరికే ముట్టచెబుతున్నాడు.

ఆ దుస్సంకల్పమే వుంటే డాక్టరుకి తెలీకుండానే, చీకటిబజార్లో అవుషధాలమ్మకుని, లెక్కలలో కంట్రోలు రేటుకే అమ్మినట్టుచూపి అదనపు పైకం చల్లగా గుటకాయి స్వాహా చెయ్యొచ్చును గదా బావమరిది? దొంగతనంలో మళ్లీ కొంత నీతి నిజాయితీ! ఇతగాడికి తనకేదో అయిశ్వర్యం తవ్వి తలకెత్తుదామని తాపత్రయం దేనికీ? ఆ తపనమీద అప్రాచ్యపు పనులికి దిగి, తన పరువూ ప్రతిష్ఠా గంగలో కలపటం దేనికీ?

డాక్టరుకి అనుభవం లేదుగాని, కొందరికి అడ్డగోలుగా డబ్బు వొల్లడమంటే మహాసరదా. అట్లాంటి అవకాశాలు జారవిడుచుకున్నప్పుడల్లా పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. ఫస్టుతారీఖున టంచన్‌గా వచ్చే జీతపురాళ్ళ మట్టి మశానమూ. టేబిలుకిందనించీ అంది పుచ్చుకునే పదిరూపాయిల నోటు బెల్లంముక్క, మార్కెట్లో కొని సంచిలో వేసుకునే మామిడికాయ వెల ఒక అణా కోరడిపక్కనే పోతోపోతో...తోటమాలీ కన్నుగప్పి కోసుకున్న మామిడిపిందె ఖరీదు ఒకరూపాయి. దానిరుచి చెప్పడానికి వీలులేదు!

'ఆ పాపపు సొమ్మేదో నువ్వే తీసుకో', అని రామనాథం మొహాన్ని కొడదామనుకున్నాడు డాక్టరు. కాని—

'నేను ముదలకిస్తాలెండి... మీ రూరుకోండి...నలుగురరా చేస్తున్నపనే గవును గోల! అంచాత 'బ్లాక్'లో మందులమ్మడమనేది మీ రనుకున్నంత మహాపరాధం కాదనుకుంటున్నాడేమో తమ్ముడు. గోరంత వుంటే కొండంత చేస్తున్నారు మీరు మరీన్నూ' అని సాగతీసింది రాజేశ్వరమ్మ.

డాక్టరు చల్లబడ్డాడు.

రాత్రి భోజనాలదగ్గర కూచున్న తరవాత ఆయనకోపం పూరాగా కాకపోయినా చాలాభాగం దిగజారింది. కాలీఫ్లవర్ పెరుగుపచ్చడి మహాపసందుగా కుదిరింది. ఒకటికి రెండుసార్లు మారు వడ్డించుకోవడంలో ముఖ్యాంశం అడుగున పడిపోయింది.

ఆఖర్న...ఎట్లాగయితేనేం...తెగించి...మంచలింపుగా—

'రామనాథం—డ్రగ్గులు 'బ్లాక్' చేస్తే వున్నీ—ముఖ్యంగా 'కంట్రోలు'యిన 'పెథిడ్రిన్. మార్ఫియా' లాంటివి. అమట్టు నలుగురి నోళ్ళలోనూ పడి నట్టయినా...అదుగో ఆ డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు పాణిగ్రాహి చండశాసనుడు. మన స్టోర్సు 'బ్లాక్‌లిస్టు'లో పెట్టినా పెట్టవచ్చు. అంతేనా? 'స్టోర్సు'లాక్‌చేసి 'డ్రగ్‌లైసెన్సు' రద్దుకి పైకి వ్రాసి ప్రాసిక్యూట్ చేసినా చేస్తాడు. ఏం చెప్పగలం? 'క్యాన్సిల్' చెయ్యరో నాకు ఖాతరు లేదు, కాని ఎంత తలవంపులు! పేరు నీదైనా 'స్టోర్సు' నాదని ఎవరికి తెలియదు? వచ్చిన పరువు వచ్చినా పోదుస్మీ, మంచి మాయిల్లు దాటదు, చెడుగన్నా వూరువాడా మోగుతుంది. నేను జిల్లా 'మెడికల్ ప్రాక్టీషనర్స్ యూనియ'న్‌కి ప్రెసిడెంటుని కూడాను ఖర్మ. డాక్టర్లు వెలగబెట్టాలిసిన నీతి నిజాయితీని గురించి 'లెక్చర్లు' దంచుతున్నాను. లేని డబ్బుకోసం ఉన్న పరువు జూదంలో కాస్తే రెండూ ఊడి పక్కబోగలవు. సంతలంజని నమ్మి ఇంటి ఇల్లాలిని వొదులుకున్నట్టవుతుంది జాగర్త' అని నన్నసన్నగా హితబోధ చేస్తున్నట్టభినయించి, బేలగా నవ్వి తేల్చిపారేశాడు డాక్టరు.

ఈయనేమయినా వాసన పసిగట్టాడా యేం చెప్మా అనుకొంటో, పులుసులో ములక్కాడలు చీల్చాడు రామనాథం.

'అబ్బే — నేను అవుషధాలేవీ రహస్యంగా అమ్మటం లేదునమ్మండీ' అని పాము చావకుండా కర్ర విరక్కుండా, ముక్తసరిగా సమాధానమిచ్చి, మాట మార్చి, భోజనం ముగియగానే మామూల్మలుగా కాస్సేపు పిచ్చాపాటీ వేసుకునే అలవాటుకి భిన్నంగా, అమట్టు, ఏదో అర్జంటుపని వున్నట్టు, కండవా భుజమీద్మద వేసుకుని, గబగబా మెట్లు దిగి బైటికి చక్కాపోయాడు రామనాథం.

రామనాథం అబద్ధం చెప్పలేదు, తెలివి తక్కువ నాగన్న మాటిగా అబద్ధం చెప్పి దొరికిపోతాడు, బుర్రలో గుంజున్నవాడు మాట మెలేస్తాడు. 'రహస్యంగా నేనేమీ అమ్మటం లేదూ' అన్నాడు రామనాథం, అది అక్షరాలా నిజం. 'బ్లాక్' లో బహిరంగంగానే అమ్మి

తున్నాడు మందులు. ఇంకో బ్లాక్ ఏమిటో నా మొహం! అంతా వైటే!! అదీ అతని 'థియరీ.'

వెనక ఒకసారి చలమయ్యగారి వచారీ కొట్లో సారథ్యం వెలిగిస్తున్నప్పుడు, వంచ్చదార చీకటిబజార్లో అమ్ముతున్నట్టు కేసొకటి వచ్చిపడింది. రామనాథం సాక్ష్యమివ్వాలి వచ్చింది. అమట్నే బోనెక్కి అడ్డంకోంగా వాదించాడు. 'అమ్మేవాడు కొనేవాడూ ఉభయులికీ ఇష్టమై జరిగిన మార్పిడీ నేరమెట్లా అవుతుందండీ?' అని అతని వాదం. అమట్నే బెంచీకటూ యిటూ వల్లకోట్లు వేసుకుని కంఠశోష పడుతున్న ప్లీడర్లిద్దరూ తెల్లమొహాలు వేశారట!

మేడమీద పక్కవరండాలో క్రోటన్ కుండీల మధ్య నడిచే ఇష్టగోష్టిలో రామనాథం కొన్ని ప్రమాదకరమైన సూత్రాలే వీకరువుపెడుతూ వచ్చాడు. నేరమంటే ఒక వ్యక్తివల్ల మరో వ్యక్తికి జరిగే అన్యాయంట. 'కొనేవాడూ అమ్మేవాడూ లలోచీ అయితే పట్టిచ్చేవాడేడీ?' అంటాడు.

ఇది మంచి సెబ్బరా అని స్పష్టంగా గీట్లు కొట్టుకొని కూచునే మనస్తత్వం డాక్టరిది. ఆ గీతలు అటూయిటూ కాస్త కదిలినయ్యా, విలవిలలాడిపోతాడు. ఒక్కొక్కసారి రామనాథం ఆ గీతలు పూర్తిగా చెరిపెయ్యడానికీ జంకడు.

అసలు 'స్టోర్సు' తాలూకు పద్దులే రెండురకాల 'రిజిస్టర్ల'లో నమోదవుతున్నాయని డాక్టరికి తెలియదు. 'సేల్స్ టాక్స్ ఆఫీసరు' తనిఖీకని దాఖలు చేసేవి ఒకసెట్టూ, నిఖార్సుగా ఎంత మిగులుతున్నదో తేల్చి చూపేది మరొకసెట్టూ, వేరువేరు. 'లేకపోతే వ్యాపారంచేసి మిడికి వచ్చే' అన్నాడొకసారి రామనాథం. అదీ రాజేశ్వరమ్మతో. డాక్టరుతో కాదు.

'సరేలే. ఈ వివరం బావకి తెలీనీకు' అని సరిపెట్టేసిందామె. 'మాటిగా పోవాలెనంటే నక్షత్రకుడెన్ని గుంటచిక్కులు పెట్టాడూ?' అని సత్యహరిశ్చంద్ర నాటకమొకసారి స్మరించుకున్నది కూడాను.

ఇంచుమించు వారాని కొకసారన్నా రిజిస్టర్లు తిరగేయడంతో. ఏ 'డ్రగ్గు' ఎంత 'స్టాకు'లో వున్నదీ డాక్టరికి జ్ఞానకముంటోనే వుంది. వైద్య పరిశోధనలు నానాటికీ ముందడుగు లేసుకొంటూ పోతున్న యుగమాయెను: 'మెడికల్ జర్నల్స్' ఎప్పటికప్పుడు అధ్యయనం చేసుకొంటూ కొత్త కొత్త వ్యాధులికి కొత్త కొత్త మందులు సరేసరి ... పాతరోగాలకే సరి కొత్తమందులు...పటుత్వంగలమందులు... వాడే అవసరం గుర్తించి...'ప్రాక్టీసు' నడుపుకొంటూ పోయే పద్ధతి డా. రాజారావుది. ఈమధ్య ఆ ప్రిన్సిపుల్‌కి భిన్నంగా గడితప్పి నడుస్తోందాయన కలం. ప్రిస్క్రిప్షన్ చీటీ వ్రాసేముందు... 'సంజీవినీ మెడికల్‌స్టోర్సు'లో అమ్ముడుపోకుండా నిలవున్న ఔషధాల తాలూకు జ్ఞాపకాలు... అనుకోకుండా మెదుల్తున్నాయి డాక్టరు మెదట్లో! ఏ వ్యాధికే 'డ్రగ్గు' చక్కగా పనిచేస్తుంది? అన్నయోచనా స్రవంతికి అడ్డంగా, సంజీవిని మెడికల్ స్టోర్సులో మురిగిపోతున్న మందుల ప్యాకేట్లూ... పాతగిల్లి విడుదలకోరుతున్న యాంపూల్సూ నిలబడుతున్నాయి.

డాక్టరుకి మహా చికాకుగా వుంది. తన ఇంటో ఆసుపత్రికి...బైట నడుస్తున్న మెడికల్‌స్టోర్సుకి బాహ్యంగా సంబంధం లేకపోయినా ... ఆ రెండు బాంధవ్యాలూ డాక్టరు మనసులో... తప్పనిసరిగా...ఆయనకి తెలీనంతగా...పెనవేసుకు పోతున్నయి క్రమక్రమేణా. ఇన్నాళ్లూ రోగిమీదా రోగమ్మీదా కేంద్రీకృతమౌతూ వచ్చిన శ్రద్ధాసక్తులు, ఈనాడు, అంతకు కొంత, 'యక్స్‌—రేక్లినిక్కు'కిపని కలిపించడమ్మీనా, మెడికల్ స్టోర్సుని కూడగట్టుకుని రావడమ్మీదా...ప్రసరించకుండా...పల్చబడకుండా జాగర్తపడటం డాక్టరికి...మానసికంగా వే అనుకున్నా...ఓ పట్టాన సాధ్యం కావడం లేదు. సాధ్యం కాదు కూడాను. మనస్సు మహా క్లిష్టమైన యంత్రం, అందులో ఎన్ని స్వార్థాలు. ఎన్ని యుక్తులు, ఎన్ని జిత్తులు మారువేషం వేసుకుని పెత్తనం చెలాయిస్తాయనీ? అవసరమైనప్పుడది వాదికిందా ప్రతివాది కిందా విడిపోగలదు. అంతేనా—వాళ్ళిద్దరూ తలపట్లు పట్టుకుంటుంటే విడదీసి...వాదోపవాదాలు సావధానంగా విని ...జాగర్తగా తీర్పు లిస్తున్నట్టు అభినయించే జడ్జీగారిని గూడా సృష్టించి బెంచీమీదకి పంపుతుంది.

'ఈ రామనాథం ఎన్ని బెడదలు తెచ్చిపెట్టాడూ?' అని డాక్టరు స్వగతంగా చీదరించుకున్నాడే గాని...అతగాడు తన చెవులు పట్టుకుని ఆడిస్తున్నాడని కావేషించుకుంటున్నాడేగాని...రామనాథం గుప్పిట్లో ఇరుక్కుపొమ్మని తనని శాసించిందెవరూ? మనిషి తన పతనానికి కారణాలు బాహ్యంగానే వెదుక్కుని చక్కా పూరుకుంటాడు. తనలో దాగుడు మూతలాడుతున్న దవుర్బల్యాల వంక ఛస్తే చూపు సారించడు. చిత్రం!



'జిల్లా మెడికల్ కాన్ఫరెన్స్'లో 'ప్రెజెన్ట్ చెయ్యాల్సి ఉండి 'నోట్సు' తయారు చేసుకున్నాడు డా. రాజారావు. 'పెన్సిలిన్ ఇంజక్షన్లు' ఇప్పుడు సర్వే సర్వత్రా వాడుతున్నారు డాక్టర్లు. కాని 'ఇంజక్షన్' ఇవ్వగానే కొంతమంది రోగులు 'షాక్' వచ్చి గిర్రున తిరిగి పడిపోతున్నారు. అందువల్ల ఆ 'ఇంజక్షన్' ఇచ్చేముందు 'పెన్సిలిన్' రోగి ఒంటికి పడుతుందా పడదా అని ఆరా చూసుకోవలసివస్తోంది డాక్టర్లు. ఈ 'పడక పోవడా'న్ని 'ఎలర్జీ' అంటున్నారు డాక్టర్లు, దానిమీద పరిశోధనలు జరగ్గా... 'పెన్సిలిన్ ఆయింటు మెంటు' తరుచు వాడే 'పేషెంట్లు' సర్వ సాధారణంగా ఈ 'ఎలర్జీ'కి గురి అవుతున్నారని తేలింది. ఆ 'ఆయింటు మెంటు' చర్మానికి అడుగుభాగంలో ఒక పన్నుని పొరకింద ఏర్పడి ... 'ఇంజక్షన్' ఇవ్వగానే 'రియాక్షన్' ఇస్తోందని కనిపెట్టారు. అందుచేత, 'పెన్సిలిన్ ఆయింటుమెంటు' వాడకం నిషేధించాలిసిన అవసరమెంతైనా వుంది. ఆ పాయింటు 'నోట్సులో' వ్రాసుకున్నాడు డా. రాజారావు.

బయల్దేరేముందు 'నోట్సు' ఒకసారి తిరగెయ్యడంలో ఏమి స్ఫురణ కొచ్చిందో మరి, చటుక్కున 'నోట్సు'లో ఆభాగం కొట్టిపారేసి కాగితాలు పంట్లాంజేబులో కుక్కేసి 'కాన్ఫరెన్సు'కి వెళ్ళిపోయాడు.

'కాన్ఫరెన్సయిన' తరవాత, సాయంత్రం 'క్లబ్బు'లో 'లాన్'మీద కూర్చుని 'గోల్డ్ స్పాట్' తాగుతూ తిరిగాలోచించుకున్నాడు. తనెందుకు ఆ భాగం కొట్టేసినట్టు? 'కాన్ఫరెన్సు'లో ఎందుకు ఆ విషయ మెత్తుకోలేదు తను? ప్రసక్తాను ప్రసక్తంగా 'పెన్సిలిన్ అయింటు మెంటు నిషేధించాలి' అని తను ప్రచారం చేసుకొంటూ పోతే ... 'సంజీవిని మెడికల్ స్టోర్సు'లో నిలవున్న 'పెన్సిలిన్ ట్యూబు'లు అమ్ముడుకావన్న భయం లోపల పనిచేసిందా కొంపతీసి?

ఈ రామనాథం తన వ్యక్తిత్వాన్నే కలుషితంచేసి వదలిపెట్టినట్టున్నాడు. 'కీ' ఇచ్చి వొదిలినట్టు అతని కిష్టమొచ్చిన విన్యాసంలో తన వ్యూహాపోహాలు మెలితిరిగి పోతున్నాయి ఖర్మ. తను పాప కూపంలో పడిపోతున్నాడా? ఇంతాచేసి

సంఘర్షణ

'పెన్సిలిన్ ఎలర్జీ'ని గురించిన పరిశోధన అప్పుడే ముగిసినట్టు లెక్కా? కొన్నాళ్ళయింతరవాత... వెనక్కి తిరిగి... 'పెన్సిలిన్ ఆయింటుమెంటు'లో దోషమేమీ లేదని తేలనూవచ్చును. ఎన్ని చూట్టం లేదూ? 'రిసెర్చి'కి అంతేముంది? డాక్టరుగా తనుచేసిన ద్రోహ మేమున్నదీ ఇందులో!

తనవీపు తానే చరుచుకుని ... ఒక 'గార్డినాల్' మాత్ర వేసుకుని, 'సీలింగ్ ఫాన్' మీట నొక్కి, 'వులెన్‌రగ్గు' మెడమీదికంటా లాక్కుని గాఢంగా నిద్రపోయాడు డాక్టరు.

* * *

ఆసుపత్రి 'కన్సల్టేషన్ రూం'లో కూచున్నాడు డాక్టరు. 'కాఫీ హోటల్' సర్వరొకడు వచ్చాడు. రక్తహీనంగా బలహీనంగా వున్నాడు. వైన వైనాలుగా అతగాడు చెప్పింది విన్నాడు డాక్టరు.

మలపరీక్ష అయినతరవాత కడుపులో పాములున్నాయని నిర్ధారణ కొచ్చాడు డాక్టరు. 'పెప్పరజిన్ సిట్రేట్' బిళ్ళలు తెచ్చుకొమ్మని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసిచ్చాడు. 'సంజీవిని స్టోర్సు'కి వెళ్ళి దానికి బదులు 'సాన్‌టానిన్' తెచ్చుకున్నాడు పేషెంటు

'మీరు వ్రాసిచ్చింది లేదన్నారండి ... ఇదీ దానికిలాగే మందేటంట' అన్నాడు వాడు.

డాక్టరు ఆలోచించాడు. మొన్న మొన్ననే 'పెప్పర్‌జిన్ సిట్రేట్' 'కన్‌సైన్‌మెంటొ'కటి వచ్చినట్టు బాగా గుర్తు—'డిస్ట్రిబ్యూటరు' 'స్టోర్సు' ముందు 'డెలివరీ వాన్' మీదనించి పేకేజీ పెట్టెలు దింపుతుండగా 'రవుండ్సు'లో తాను స్వయంగా చూశాడు కూడాను. అప్పుడే అయిపోయినయ్యా? అసంభవం. వాడి వ్యాధికి 'సాన్‌టానిన్' నయింతం పని చేస్తుంది. కాని, దరిమిలా ... దానికి ప్రత్యామ్నాయంగా వచ్చింది... అంతకన్నా రూఢిగా గుణ మివ్వగలదీ 'పెప్పరజిన్ సిట్రేట్', రామనాథం తను వ్రాసిన మందివ్వక 'సాన్‌టానిన్' ఎందుకిచ్చాడో తేలిగ్గా అర్థమయింది డాక్టరికి. ఆ 'స్టాక్కు' అయిపోదాకా నిల్వలా పెరుగుతుంటాయి గావును—'స్టోర్సు'లో.

ఆలోచన ఒక కొలిక్కి రానేలేదు. 'ఇంజక్షన్'ఇచ్చి 'పేషెంటు'ని పంపేశాడు.

తరవాత తరవాత గుర్తుకొచ్చింది డాక్టరికి. 'ఆల్బుమిన్' దోషమున్న 'పేషెంట్ల'కి 'సాన్‌టానిన్' 'పడదు' తను 'ప్రిస్క్రయిబ్' చేసింది అది కాదు గదా అన్న భరోసామీద అతని యూరిను పరీక్షకి పెట్టలేదు తను. దాంతో వాడిరోగ మెంతకీ లొంగుబాటుకి రాలేదు. నాలుగు రోజు లనుకున్నది ఇరవై రోజులు పట్టింది ఆఖర్న తన 'సాంపుల్స్'లోనించి 'పెప్పరజిన్ సిట్రేట్' వాడిన తరవాతనే గుణం కనిపించింది. వాడికి 'హోటల్ ప్రొప్రయిటరు' ఇరవై రోజులు నాగా వ్రాశాడు జీతం. 'నష్టమి చెయ్యమంటారూ!' అని విషాదంగా మొహం పెట్టాడు వాడు. డాక్టరు లోలోపల విలవిల్లాడి పోయాడు. ఎంతెంత నడకలు నడిచే అలవాటు లేని వాడికి దాన్నంత క్రూరంగా పోవాలిసొచ్చె. ఎవరో గొంతు నులిమేస్తున్నట్టు గింగిరాలు తిరిగిపోయాడు! స్వయంకృతాపరాధానికి శిక్షగా వాడి దగ్గరనించి దమ్మిడీ ఫీజా తీసుకోలే దక్కడికీనూ.

ఇలా ఎంతకాలమిటే... టైఫాయిడొస్తే 'టెట్రా సైక్లిన్ సిరప్' తెచ్చాడొక పేషెంటు. అంతకన్న గుణమిచ్చేది ... వెయ్యగానే పనిచేసేది 'క్లోరోఫెనికాల్ సిరప్' ప్రిస్క్రయిబ్ చేశాడు తను. ఈ రామనాథం ... అక్కడ 'స్టోర్సు'లో ఖాళీగా కూచుని...ఏమీ ఎరగనట్టు ... ఇక్కడ ఆసుపత్రిలో తన వైద్యాలన్నీ తారుమారు చేస్తున్నాడు త్రాష్టుడు!

రాత్రి భోజనాలకిముందు రామనాథాన్ని పట్టుకుని కడిగేశి వదలిపెట్టాడు. తానొకటి వ్రాశిస్తే అతగాడు ఇంకోమందు చేతిలోపెట్టి పంపిన సందర్భాలన్నీ ఏకరువు పెట్టాడు.

'మీరు వ్రాసిన 'పెప్పరజిన్ సిట్రేట్' స్టాక్కులో వున్న దనుకోండి. 'సాన్‌టానిన్' మురిగిపోతోంది మరి. అది ముందు వొదిలించు కోవాలి గదాని?...' తలగోక్కున్నాడు రామనాథం.

'అంటే నీ వుద్దేశ్య మేమిటి? 'ఫలాని మందు' అని 'ప్రిస్క్రయిబ్' చేశేది

నువ్వా నేనా ? నీ ఇష్టమొచ్చినమందులు నువ్విస్తుంటే ఇక నేనెందు కిక్కడ ?ఈ ఆసుపత్రికూడా నువ్వే నడుపు. నేను జపంచేసుకుంటూ కూచుంటాను.' అని ఒక్క కసురు కసిరాడు. డాక్టరు రాజారావు మొహం కండలుబ్బినై.

'మీ ఇష్టం...ఏదిమ్మనమంటే అదే ఇస్తా...నాదేం పోయిందీ ? అసలు మీ లొకసారి 'స్టాక్సు' విడివిడిగా పరిశీలించి ఏవేవి 'టయిం ఎక్స్పయిర'వుతున్నాయో..'

అరోణిక్తిలో చర్రుమన్నాడు డాక్టరు.

'శాట్' — స్టాక్సూ చట్టుబండ లూను. నా ఇష్టమొచ్చిన మందు నేను 'ప్రిస్క్రయిబ్' చేస్తాను. ఏది రాస్తే అదివ్వు. అది 'స్టోర్సు'లో లేకపోతే లేదనిచెప్పు. ఇంకొక 'స్టోర్సు'కి వెళ్లి తెచ్చుకుంటాడు. అంతేగాని నీ బోడి పెత్తనమొకటా యిందులో?' రెచ్చిపో ... డు డాక్టరు.

గుక్కిళ్లుమింగి బిరబిరా మెట్లుదిగి పొయ్యాడు రామనాథం.

తరవాత డాక్టరికి పశ్చాత్తాపం ముంచుకొచ్చింది. రామనాథాన్ని అనుకోవడం దేనికి? తనూ నిజానికి కొంత అస్తవ్యస్తంగానే 'ప్రిస్క్రయిబ్' చేస్తున్నాడు డ్రగ్గులు. తనకేదో వారగబెడదామని అతగాడు అడపాదడపా బురదలో అడుగు వెయ్యనూ, తనచేత మొహం వాచేలా చివాట్లు తిననూ జరుగుతున్న తంతు, అతనేదో తనపట్ల అపచారం చేస్తున్నట్లు తేపతేపకీ నోరువేసుకోవడం బాగుండలేదు, ఏదో బావమరిది కాబట్టి తలవొంచుకుని పోతున్నాడు మానవుడు, అమట్నే పారిపోకుండా, కాలునిల్రదొక్కుకుని, 'నువ్వొకటి వ్రాస్తే నేనొకటివ్వడం చూస్తుంటివిగదా...ఎందుకు తిరగ్గొట్టలేదూ? ఆమందే పట్రమ్మని ఎందుకు పట్టుబట్టలేదూ?' అని ఎదురుదాడిచేస్తే...తన నోటికి తాళం పడదూ? ఈ వ్యాపారంలో తనూ రామనాథమూ లాలూచీ అన్నగుట్టు గుట్టుగా వున్నంత సేపేగాని...అవాసెన కాస్త తొలగించి కుండ బద్దలుకొడితే మెతుకులు చెల్లాచెదరై పోవూ?

డాక్టరికి బెంగపట్టుకుంది. తను ఇట్లా దిగజారిపోతున్నాడేమిటి?

మెట్టుకి ... ఈ వ్యాపారంలో తల

పద్ధతులు ఇదివరకంత వుదారంగా, ఉన్నతంగా, ఖచ్చితంగా నడుస్తున్నాయా అంటే లేదనే చెప్పుకోవాలిసొస్తుంది. తన బుద్ధి పెడతలబడుతోందా యేమిటి చెప్మా? కంపనబడ్డ కాకిలా గిలగిలకొట్టు న్నాడు డా. రాజారావు. తేపతేపకీ 'బ్యాంక్ ప్యాస్ బుక్కు'లోవున్న అంకెలమీదకి దృష్టిపోతోంది. బుద్ధి గడ్డితింటోంది! ఏమి చెయ్యాలి?

* * *

కొయ్య గుర్రమెక్కి ఊగుతున్నాడు గోపీ.

చారల పైజమా వేసుకొంటూ, 'ప్రయివేటు మేస్టారు రాలేదుట్రా?' అని కళ్లెరజేసి గదమాయించాడు డాక్టరు రాజారావు.

'మేస్టారు రాలేదు నాన్నా' అన్నాడు గోపీ, ఊగడం ఆపి.

'మేస్టారబ్బాయికి జ్వరమటండీ. మూడు రోజులనించీ రావటం లేదు. ఎలా వుందో పాపం?' అని టీ అందించింది రాజేశ్వరమ్మ.

చటుక్కున స్ఫురించింది డాక్టరికి. ఆమధ్య మేస్టారు కుర్రాణ్ణి తీసుకొచ్చాడు ఏదో జ్వరమని. లోగడ ఆయనెప్పుడు వచ్చినా తన ఆసుపత్రిలో మందులే ఉచితంగా వాడనూ, 'ఫీజి'వ్వబోయినా తిప్పగొట్టనూ జరుగుతున్నదేను. ఈసారి అందరితోపాటు అలవాటుగా ఆయనకి 'ప్రిస్క్రిప్షన్ చీటీ వ్రాసిచ్చాడు. 'యాంపూల్స్'కొని తీసుకొచ్చాడాయన. నాలు 'గింజక్షన్లయి'న తరవాత ఆయన మళ్లీ రాలేదు కుర్రాణ్ణి తీసుకుని. ... వ్యాధి తగ్గుముఖం పట్టగానే రోగులు తన దగ్గరకి రాకపోకలు తగ్గించడం అనవాయితీ వున్నదేను. అంతే అనుకుని పట్టించుకోనేలేదు తను.

మేస్టారు పెద్దవాడు; పేదవాడు; బహుకుటుంబీకుడు. భారంగా సంసారమీదుస్తున్నవాడు.

ఏమయిందో ఏమో పాపం. సొంతకారు వేసుకుని మేస్టారింటికి వెళ్లాడు తిన్నగా.


ఇల్లు నానా దరిద్రంగానూ వుంది; అక్షరాలా అయ్యవారి నట్టిల్లు, కుర్రవాడు కుక్కి మంచంమీద పడివున్నాడు; ముక్కాలిపీటమీద మందులూ అరఖులూ పేర్చిపెట్టి వున్నాయి, ఇంట్లో అంతా గాబరాగా వున్నారు.


మేస్టారు క్షమించమని ప్రాధేయపడ్డాడు డా. రాజారావుని. వారంరోజులు చూచి...జ్వరమెంతకీ తగ్గకపోగా...ఇంకో డాక్టరి దగ్గర ట్రీట్మెంటు ప్రారంభించాడు. అదీకథ.

డాక్టరికి కోపంరాలేదు. సిగ్గువేసింది పైగా.

కొత్తడాక్టరు 'ప్రిస్క్రయిబ్' చేసిన 'డ్రగ్గే' మిటాని ముక్కాలిపీటమీద వున్న 'స్లిప్పు' పరిక్షగా చూచాడు డా. రాజారావు, స్ట్రెప్టో పెన్సిలిన్ వ్రాసివుంది! తలకొట్టేసి నట్టయింది. అది న్యూమోనియా 'అని తెలిసిన్నీ, తను అన్నా...

(64 వ పేజీ చూడండి)





జరిగిన కథ

శ్యామల రాధలతో పాటు మాధవిని కూడా స్వంత కూతుర్లాగే పెంచింది పరమేశ్వరి. శివశాస్త్రికి మాధవి మీద కంటే మాధవి తెచ్చే జీతం మీద అభిమానం ఎక్కువ. శ్యామలకి రాజారావుతో పెళ్లయింది. శ్యామల బిడ్డనికని కన్ను మూసింది. ఆ బిడ్డభారం మాధవిపై పడింది. ఆ యింట్లోనే అద్దెకుంటున్న మధు మాధవిని ప్రేమించాడు. మాధవిని రాజారావు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడని తెలుసుకుని మధు కంగి పోయాడు. రాధ తిరుగుళ్ల గురించి మాధవి హెచ్చరించవలసి వస్తుంది. రాజారావు ఉత్తరానికి మాధవి హతాశురాలవుతుంది. పాపని అతనికి అప్పగించడానికి పరమేశ్వరి ప్రయాణమవుతుంది. మాధవి మధుని వెతుక్కుంటూ వెళ్తుంది.

12

రిక్షా ముందు గేటులోనే ఆగిపోయింది మాధవి. ఆ ఇంటిలోపల అడుగుపెట్టాలంటే ఏదోగా అనిపించింది. అది తన మధు ఇల్లు. అన్నీ సవ్యంగా జరిగితే తను ఈ ఇంటికి ఇలా కాకుండా మరో రకంగా వచ్చివుండేది.

'ఎవరమ్మా ఎవరు కావాలి?'

మాధవి చివ్వున తలెత్తి చూసింది. ఎదురుగా ఒడ్డూ పొడవూగల ఓ వయసు మళ్లిన వ్యక్తి నిల్చొనివున్నాడు. ముఖాన [illegible] చొక్కాలేని ఛాతీమీద వేలాడుతున్న రుద్రాక్షమాలా, దబ్బపండు వర్ణంగల శరీర ఛాయ. సాక్షాత్తూ పరమశివుణ్ణే చూసినట్లనిపించింది మాధవికి. ఇతనేనా మధు తండ్రీ!

'పాపయ్యశాస్త్రిగారు...' సందేహిస్తూ అంది.

'నేనేనమ్మా! కాని ఈ ఊళ్లో మరో పాపయ్యశాస్త్రి కూడా వున్నాడు.'

'మధు నాన్నగారు మీరేగా? నేను మధు స్నేహితురాల్ని'

పాపయ్యశాస్త్రి వోక్షణం అర్థం కానట్లు చూశాడు. వయస్సులోవున్న వో ఆడపిల్ల వచ్చి తనముందే తన కొడుకు స్నేహితురాల్ని అని చెప్పుకుంటుందని, పల్లెసీమలోనే పుట్టి పెరిగిన పాపయ్యశాస్త్రి కలలోకూడా ఊహించలేదు. అనుకోకుండానే అతని భ్రుకుటి ముడిపడింది. పాపయ్య బుర్రలోకి అనేక అనుమానాలు తోసుకొనివచ్చాయి.

'ఆఁ నేనే మధునాన్న. లోపలకురా!' అన్నాడు పాపయ్యశాస్త్రి. అతని కంఠస్వరంలో మొదటవున్న ఆదరణ లేదని ఇట్టే గ్రహించింది మాధవి.

అతని వెనకే లోపలకు నడిచింది మాధవి బెరుగ్గా. ఆ ఇంట్లో మధు ఉంటే బావుణ్ణు! అనుకుంది మాధవి.

వసారాలో కూర్చొని ఇద్దరు ఆడవాళ్లు బట్టమీద ఎండివున్న వడియాలు ఒల్చుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ స్త్రీలిద్దరూ చేస్తున్న పనిని వదిలేసి మాధవినే వింతగా చూస్తూ కూర్చుండిపోయారు.

'ఎవరండీ ఆ అమ్మాయి.' ఒక స్త్రీ ప్రశ్నించింది.

పాపయ్యశాస్త్రి సమాధానం ఇవ్వకుండానే లోపలకు వెళ్లిపోయాడు. అతని వెనకే మాధవి బెరుకు బెరుగ్గా నడిచింది. మెల్లో ఇంట్లోవున్న ఉయ్యాల బల్లమీద కూర్చుంటూ, పాపయ్యశాస్త్రి చెయ్యి విరిగిన పాతకాలపు చెక్క కుర్చీ మాధవికి కూర్చోమన్నట్లు చూపించాడు. తన రాక అతనికంత ఇష్టంగా లేనట్లు గ్రహించింది మాధవి. ఇబ్బందిగా ఫీలవుతూ చూపుల్ని గోడలమీదకు సారించింది. గోడమీద ఎదురుగావున్న సీతారాముల పటంమీదనుంచి కదిలి ఆమె చూపులు మధు ఫోటోమీద నిల్చాయి.

'చెప్పమ్మా? ఏ ఊరు? ఏం పనిమీద వచ్చావు? మా మధుతో నీకేమయినా పని వుందా?' పాపయ్యశాస్త్రి కంఠం అదోలా మ్రోగింది.

'నా పేరు మాధవి. మాది హైదరాబాదు. మీతో పనివుండే వచ్చాను.' పాటం వల్లించినట్లు అంది మాధవి చిన్న స్వరంతో.

పాపయ్యశాస్త్రి వోక్షణం వకానంగా ఆలోచిస్తూ వుండిపోయాడు. వీడు ఈపిల్లతో వెకిలివేషాలు వెయ్యలేదుగదా?

క్కుంటూ ఎందుకొస్తుంది? పాపయ్య శాస్త్రికి ఏవేవో సందేహాలు కలుగుతున్నాయని గ్రహించింది మాధవి.

అంతలో ఏదో ముంచుకుపోతున్నట్లు హడావిడిగా వచ్చింది వడియాలు తీస్తూ కూర్చొనివున్న స్త్రీలలోని ఒకావిడ.

'హైదరాబాదా? ఎవరమ్మాయివి?'

అసలే అయోమయంలోవున్న పాపయ్య శాస్త్రికి భార్య ప్రవేశంతో వళ్లు మండిపోయింది.

'ఏమిటేవ్ ఆ ప్రశ్నలు? హైదరాబాదులో అందరూ నీకు తెలిసినట్లే అడుగుతున్నావ్! అవన్నీ నేను కనుక్కుంటాలే. ఆ అమ్మాయికి మజ్జిగతేటన్నా తెచ్చి ఇవ్వు ప్రయాణంచేసి వచ్చింది' అన్నాడు పాపయ్యశాస్త్రి.

'మజ్జిగ తేటెందుకు? కాఫీ పెట్టుకొస్తాను. 'అంటూ లోపలకు వెళుతున్న ఆమెను చూస్తూ' ఈవిడే మధు అమ్మగారై వుంటారు. మధు పోలికలు కనిపిస్తున్నాయి.' అనుకుంది మాధవి.

'మధు ఊళ్లో లేడా అండీ!' అంత సేపూ మనస్సును పీడుస్తున్న ప్రశ్న వెయ్యకుండా వుండలేక పోయింది.

పాపయ్యశాస్త్రి నొసలు ముడిపడ్డాయి.

'లేదు, హైదరాబాదులోనే వున్నాడు.'

'హైదరాబాదులోనా?' మాధవి ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

'అవును!' ముక్తసరిగా జవాబిచ్చాడు పాపయ్యశాస్త్రి. తను ఊహించింది నిజమే. అప్రాచ్యుడు ఈ పిల్లతో షికార్లు కొట్టి చివరకు ముఖం తప్పించివుంటాడు. ఇప్పుడు ఈ పిల్ల రావాల్సిన చోటుకే వచ్చింది. కొంపమీదకు ఏ అఘాయిత్యం తెచ్చి పెడుతుందో? తను జాగ్రత్తగా, పదిమందికీ తెలియకముందే సర్దిచెప్పి పంపించాలి.

'మధు హైదరాబాదులోనే వుంటున్నట్లు తెలియదండీ! మాఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. తర్వాత అతను ఆ ఉద్యోగం వదిలేసినట్లు తెలిసింది.'

'ఉద్యోగం చేస్తూనే వున్నాడు. అయితే ఆ కంపెనీలోకాదు. అది మానేసి గవర్నమెంటు ఉద్యోగానికి వచ్చాడు. మువ్వు వచ్చిన పనేమిటో చెప్పు?' 'మువ్వు తెచ్చిన



మెంత ఏది త్యాగం బయటపెట్టు
అన్నట్లుంది పాపయ్యశాస్త్రి కంఠస్వరం.

'మా పెదనాన్న మధు దగ్గర నాలుగు వేలు అప్పు తీసుకున్నాడు. మా అక్కయ్య పెళ్ళికి మధు సహాయం చేశాడు. ఇప్పుడు డబ్బు చేతికి అందింది. మా పెదనాన్నకు ఆరోగ్యం సరిగాలేదు. అందుకే ఆడబ్బు నాచేత పంపించారు.' అంది మాధవి.

పాపయ్యశాస్త్రి తేలిగ్గా నిట్టూర్చాడు. అంతవరకూ లేని మార్దవం ముఖంలో కనిపించ సాగింది.

'ఇదుగో డబ్బు, లెక్క చూసుకోండి.' అంటూ మాధవి కవర్ని పాపయ్యశాస్త్రికి అందించింది.

మధు హైదరాబాదులోనే వుంటున్నాడనీ, అయినా ఇన్నాళ్ళగా ఒక్కసారి తనను కల్సుకోవటానికి ప్రయత్నం కూడా చెయ్యలేదనీ మాధవి మనస్సు చివుక్కుమంది.

శివశాస్త్రి డబ్బు లెక్కించు కుంటున్నాడు. మధుతల్లి కాఫీ తీసుకొచ్చి అందించింది.

'ఇప్పుడెందుకండీ!' అంటూ సంకోచంగానే కాఫీగ్లాసు అందుకొంది మాధవి. మాధవికళ్ళు అప్రయత్నంగానే మధు ఫోటో వైపుకు మళ్ళాయి.

'మీ పెదనాన్నపేరు ఏమన్నావు?' పాపయ్యశాస్త్రి లెక్కచూసిన నోట్లను కవర్లో వుంచుతూ ప్రశ్నించాడు తలపైకి ఎత్తకుండానే.

'శివశాస్త్రి' అంది మాధవి .మధుమీద ఆలోచన్ల నుంచి బయటపడకుండానే.

'మనవాళ్ళ పిల్లేనన్నమాట? బస్తీ వేషంచూసి ఇంకా ఎవరో అనుకున్నాను?' శివశాస్త్రి భార్య ఉత్సాహంగా అంది.

మాధవికి ఆమె సంతోషం చూసి నవ్వొచ్చింది. పాపయ్యశాస్త్రి ముఖం కూడా వికసించటం గమనించింది మాధవి.

'వాడు ఆఫీసులో అప్పు చేశాడని విన్నాను. ఎందుకు చెయ్యాల్సి వచ్చిందో ఎన్ని విధాల అడిగినా చెప్పాడు కాదు. అన్నాడు పాపయ్యశాస్త్రి.

మాధవి మనస్సు మధును ప్రశంసించకుండా వుండ లేకపోయింది. మధు

అపరాజిత

నిజంగా ఎంత మంచివాడో! పొరపాటున కూడా ఆ విషయాన్ని ఎవరితోనూ అనలేదు. ఇదంతా మధు కేవలం తన కోసమే చేశాడు. తనకోసం ఎంత త్యాగాన్నయినా చెయ్యగల మధు, తను కనుపించటం కాస్త ఆలస్యమయితే చిరాకు పడిపోయే మధు ఊళ్ళోనేవుండి కూడా తనకు అంతదూరంగా ఎలా వుండ గలిగాడో? తనను అంతగా అసహ్యించు కుంటున్నాడా! అంతగా ద్వేషిస్తున్నాడా?

'పనిచేస్తున్నావా అమ్మా' మధు తల్లి ప్రశ్నించింది.

'అవునండీ. కాలేజీలో పని చేస్తున్నాను.'

'మా మధునుచూసి ఎన్నాళ్ళయిందమ్మా?'

'దాదాపు ఆరుమాసాలు కావస్తుందండీ. మా ఇల్లు ఖాళీచేశాక మళ్ళీ మాకు కనిపించలేదు' అంది మాధవి సాలోచనగా.

'ఏమోతల్లీ ఈ మధ్యనాడి ధోరణీ మారిపోయింది. సెలవలకు వచ్చిన రెండు రోజులూ నవ్వుతూ నవ్విస్తూ వుండే వాడు. ఇప్పుడు పది మాటలకు ఒక్క మాట సమాధానం చెప్పటమే గగనమై పోయింది. సంబంధం కుదిరింది. మొదట ససేమిరా తనకు పెళ్ళి వద్దన్నాడు, చివరకు వాణ్ణి ఒప్పించేప్పటికి తల ప్రాణంతోకకు వచ్చిందనుకో. ఒకపట్టాన ఒప్పుకున్నాడా! నేను ఏ బావిలోనో పడి నిలువునా ప్రాణాలు తీసుకుంటానంటే ఒప్పుకున్నాడు. పిల్లను చూడమన్నా చూడలేదు, వాడి తత్వమే మారిపోయింది' మధు తల్లి తన ధోరణిలో చెప్పుకు పోతోంది.

'ఊరుకుందూ నీవాగుడూ నువ్వూను, కొడుకుపేరు ఎత్తితే చాలు ప్రపంచం మర్చిపోతావు.' విసుక్కున్నాడు పాపయ్యశాస్త్రి.

'ఇప్పుడు నేనేం కాని కబుర్లు చెప్పానండీ!' చిన్నబుచ్చుకున్న స్వరంతో అంది మధు తల్లి జానకమ్మ.

వాళ్ళ గొడవలో మాధవిని చూడలేదు. మాధవికి ఓ క్షణకాలంపాటు ప్రపంచం లోనే తమాయించుకుంది'

'ఇక నేను వెళ్ళొస్తానండీ?' శరీరం లోకి చిచ్చిపోతున్న సత్తువను కూడ దీసుకుంటూ లేచి నిల్చుంది మాధవి'

పాపయ్యశాస్త్రీ, జానకమ్మా మాధవి వైపుచూశారు. మాధవి ముఖంమీద ముత్యాలలా దొర్లుతున్న స్వేద బిందువుల్ని చూసి ఆశ్చర్య పోయారు.

'అదేమిటి తల్లీ అలా వున్నావు? చెమట్లు కూడా పోస్తున్నాయి?' అంది జానకమ్మ'

'ఏం లేదండీ నాకు ఎక్కువగా చెమట్లు పోస్తూనే వుంటాయి.' అంది మాధవి అన్యమనస్కంగానే.

'ఇప్పుడెలా వెళతావమ్మా ఒక్కర్తెవూ! బాగా చీకటి పడిపోయింది. రేపు ఉదయం బస్సుకు వెళుదువు గాని' అన్నాడు పాపయ్యశాస్త్రి.

'అవును తల్లీ. రేపు మావాడికి తెలిసినా మమ్మల్ని కోపంచేస్తాడు అప్పటికప్పుడు నిన్ను వెళ్ళిపోనిచ్చినందుకు.' అంది జానకమ్మ.

మాధవి పెదవులమీద బోలు నవ్వు ఒకటి మొలచి అంతలోనే అంతర్ధానం అయిపోయింది. నిండు పాలకుండ విరిగి పోయినట్లుంది ఆమె మనస్సు.

'పరవాలేదండీ. అర్ధ గంటలో హైదరాబాదుకు బస్ వుంది. ఉదయం ఆరు గంటలకల్లా చేరిపోతాను. మళ్ళీ రేపు కాలేజీకి వెళ్ళాలి.' బాగ్ తీసుకొని లేచి నిల్చుంది మాధవి.


'భోజనం చేసయినా బయలుదేరు. వంట సిద్ధంగావుంది.' అంది జానకమ్మ.

'వద్దండీ. ఆకలిగా లేదు. వస్తాను' అంటూ సమాధానానికి ఎదురు చూడకుండానే బయటకు నడిచింది మాధవి. ఒక్క క్షణం ఆ ఇంట్లో వుండలేకుండా వుంది మాధవి. మాధవికి తన జీవితమే తనను వెక్కిరిస్తున్నట్లనిపించింది.

మాధవి అలా గబాగబా వెళ్ళిపోతుంటే జానకమ్మ విస్మయంగా పాపయ్యశాస్త్రి ముఖంలోకి చూసింది.

'బస్తీ పిల్లలు అలాగే వుంటారులే.' మామూలుగానే అన్నాడు పాపయ్యశాస్త్రి కూర్చున్న చోటనుంచి కదలకుండానే.

రాబిన్ బ్లూ చెప్పేవన్నీ
చేస్తుంది!



రాబిన్ బ్లూతో మరింత
తెల్లదనాన్ని మీరు
సాధించగలరు!

రాబిన్ బ్లూ-ప్రత్యేకంగా తెలుపు చేయగలనట్టిది. ఇతర నీలిమందులు ఇవ్వలేనట్టి తెల్లదనాన్ని ఇది ఇవ్వగలదు. చిటికెడు రాబిన్ బ్లూతోనే అనేక బట్టలను తెల్లగా ఉతుక్కోవచ్చు. పైగా ఇది సురక్షితమైనది—సర్వదా మీ వస్త్రాలను ధవళతరంగా వుంచగలదు.



ప్రకృతి సహజమైన తెల్లదనానికి రాబిన్ బ్లూ

జానకమ్మ గబగబా వీధివాకట్లోకి వచ్చింది. దూరంగా, త్వరత్వరగా నడిచి పోతున్న మాధవిని కనిపించినంతవరకు చూస్తూ నిల్చుండిపోయింది జానకమ్మ.

మాధవి వీధి మలుపు తిరగ్గానే, తనూ లోపలకు తిరుగుతూ 'ఈ బస్తీ ఆడపిల్లలకు ఎంతేసి ధైర్యాలో' అనుకుంది లోలోపలే జానకమ్మ.

* * *

రెండోరోజు బస్ దిగి ఇంటికి ఎలా చేరుకోగలిగిందో మాధవికి తెలియదు. శరీరం మనసూ కూడ ఆమె స్వాధీనంలో లేవు. రోజంతా తిండిలేదు పైగా ప్రయాణం, అనుకోకుండా దెబ్బమీద దెబ్బ తిన్న మనస్సు, ఇంట్లో అడుగుపెట్టగానే తనలోని శక్తినంతా భూదేవి లాగేస్తున్నట్లనిపించింది. ఒక్షణం కూడా నిల్చో లేకపోతుంది. చేతిలోని బాగ్‌ను విసిరి టేబుల్‌మీదకు తోసి మంచానికి అడ్డం పడ్డది, మధ్యాహ్నం రెండుగంటలకు పరమేశ్వరి వచ్చి నిద్రలేపం దాకా మెలుకువ రాలేదు.

'నువ్వెప్పుడొచ్చావ్ పెద్దమ్మా?' అంది మాధవి బరువుగా వున్న కనురెప్పల్ని బలవంతంగా ఎత్తుతూ.

'పన్నెండు గంటలబస్ కొచ్చాను, నువ్వు వళ్లు తెలియకుండా నిద్రపోతున్నావు. అందుకే లేపలేదు. మొఖమన్నా కడుక్కో లేదట? లే! లేచిముఖం కడుక్కో, ముందు కాఫీతాగి ఆ తర్వాత భోజనం చేద్దువు గాని.' అంది పరమేశ్వరి.

మాధవి బద్ధకంగా లేచి కూర్చుంది మంచంమీదనే.

'ఏమిటమ్మా మరీ అంత డీలా పడి పోయావు? అసలు ఎక్కడికి వెళ్లొచ్చావు?' అంది పరమేశ్వరి.

'బావ ఏమన్నాడు పెద్దమ్మా? శకుంతల కొత్తచోటుకు అలవాటు పడిందా? శకుంతలను పెంచటానికి వచ్చినావిడ ఎలా వుంది?' వరసనే ప్రశ్నలు వేసింది మాధవి సంభాషణను మరో వైపు తిప్పుతూ.

'రాజారావు బొత్తిగా చిక్కిపోయాడమ్మా! మనిషి చాలా దిగులుగా వున్నాడు. భార్యంటే ఎంత ప్రేమో? పెళ్లికూడా మానుకున్నాడు. మనపిల్లే దురదృష్టవంతురాలు. ఏం అనుభవించకుండానే వెళ్లిపోయింది.' పరమేశ్వరి కళ్లు వత్తుకుంది.

అపరాజిత

మాధవి పెదవులమీద పేలవంగా హాస రేఖ కదిలి అంతలోనే విరిగి పోయింది.

'శకుంతల ఎలా వుంది?'

'బాగానేవుంది. ఆ వచ్చినావిడ వయస్సు మళ్లినావిడ. జీవితంలో చాలాకష్టాలు అనుభవించిన మనిషిలావుంది. ఇంత నీడ దొరికింది చాలన్న సంతృప్తితో వుంది. శకుంతల ఒక్కపూటలో ఆమెకు మాలిమయిపోయింది.' అంది పరమేశ్వరి.

మాధవి మౌనంగా ఆలోచిస్తూ కూర్చుంది.

'నువ్వులేచి స్నానంచెయ్యి. వేడినీళ్లు పెట్టాను.' అంటూ పరమేశ్వరి గది బయటకు నచ్చింది, అలా బయటకు నడుస్తున్న పరమేశ్వర్ని చూస్తూ వుండి పోయింది మాధవి. మాధవి కళ్లలో నీరు తిరిగింది. ఇంత విశాల ప్రపంచంలో తన కోసం ఆలోచించే మనిషి పెద్దమ్మ వుంది అనిపించింది. ఆమె గుండెల్లో తలదాచుకొని తనివితీరా ఏడవాలనిపించింది. తను ఏనాడూ చూడని తల్లిని తల్చుకుంటూ బాత్‌రూం లోకి వెళ్లింది. స్నానం చేసి భోజనం చేశాక ఆమెకు కొంత సేదతీరినట్లనిపించింది. గతం గురించి ఆలోచించాలని లేదు ఏదో విరక్తిగా వుంది. మనస్సు రాగ విరాగాలకు అతీతంగా వున్నట్లనిపించింది మాధవి మళ్లీ పడుకుంది. హాయిగా నిద్రపట్టింది.

మాధవికి మెలకువ వచ్చేప్పటికి రాత్రి తొమ్మిదయింది. అదీ పరమేశ్వరి లేపితేనే లేచింది. రెండు ముద్దలు తిన్నాననిపించింది. మాధవికి 'ఇంకా—ఇంకా — ఇలా ఎంతోకాలం విశ్రాంతి తీసుకోవాలని వుంది. ఎంతోకాలంగా జీవిత యాత్రలో నడిచి నడిచి అలసిపోయినట్లుంది.

'పెద్దమ్మా ఇంకా రాధ రాలేదా?' మాధవి మామూలుగానే అడిగింది అన్నం తింటూ.

'లేదమ్మా! భోజనానికి కూడా రానని చెప్పి వెళ్లింది. ఎవరో స్నేహితురాలు పార్టీ ఇస్తుందట.' అంది పరమేశ్వరి.

మాధవి అన్నం తిని చల్లగాలికి వీధి వాకిట్లోకి వచ్చి నిల్చుంది. దూరంగా రాధవస్తూ కనిపించింది. రాధ పక్కనే నడుస్తున్న వ్యక్తిని మాధవి ఎంత దూరంలో చూసినా. ఎంత మందిలో చూసినా పోల్చుకోగలదు. అతన్ని చూసిన మాధవి ఉలిక్కిపడింది. తనకళ్లు తనను మోసం చెయ్యటం లేదుగదా? మధు! రాధతో! ఎంత దారుణం? ప్రేమ ఒకరితో. తిరగటం ఒకరితో. పెళ్లి మరొకరితోనా? ఎంత మోసం! ఎంతదగా!

రాధ తనను తప్పుకొని లోపలికి వెళ్లాకగాని మాధవి ఈ లోకంలోకి రాలేదు. మాధవికి మనస్సూ, శరీరంకూడా జుగుప్సతో చీదరపుట్టినట్టుగా అనిపించింది. గబగబా రాధ గదిలోకి వెళ్లి నిల్చుంది. బట్టలు మార్చుకోబోతున్న రాధ అలా వచ్చి నిల్చున్న మాధవివైపు చూసింది ప్రశ్నార్థకంగా. మాధవి రూపాన్ని చూస్తూ రాధ అర్థం చేసుకుంది మాధవి మానసిక పరిస్థితిని. తనతో వచ్చిన మధును చూసిందంటుం దనుకొంది.

'ఇంతసేపు ఎక్కడ కెళ్లావ్?' చాలా గట్టిగానే దాదాపు అరచినట్లుగానే అంది మాధవి.

రాధ మాధవి ముఖంలోకి నిర్లక్ష్యంగా చూసింది. జవాబివ్వలేదు.

'మాట్లాడవేం?'

'ఏమిటా అరుపులు! నీ పెద్దతనాన్ని నాముందు చూపించకు. ఇంతకుముందే చెప్పాను నా స్వంత విషయాల్లో కలుగ జేసుకో వద్దని.' అంది రాధ తీవ్ర స్వరంలో.

'రాధా!' మాధవి కంఠం వణికింది. మాటలు గొంతులోనే ఉండిపోయి మెట్టుకుపోయాయి.

రాధ ఓలా నవ్వింది. 'మొనోలిసా నవ్వుకు నిర్వచనం ఎవరైనా చెప్పగలరేమో కాని రాధ నవ్వుకు నిర్వచనం చెప్పటం సాధ్యంకాదు. మాధవి రాధ ముఖంలోకి వెర్రిదానిలా చూస్తూ నిల్చుండిపోయింది.

'మధును చూసింటావు. అవునా? అందుకే పాపం ఇంత వళ్లు మర్చి పోతున్నావు.'

'రాధా!'

'ఎందుకలా అరుస్తావు?'

'పిచ్చిలేదూ?'

'నాకా నీకా? నువ్వు మధును వదిలేసాకగా నేను తిరుగుతున్నాను.'

రాధమాట పూర్తి అయీ కాకుండానే చెంప ఛెళ్ళుమంది.

'నేను కొట్టగలను. కాని కొట్టను. నీ మానసిక పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. బావను పెళ్ళిచేసుకోవటానికి నిర్ణయించుకొన్న నీకు, ఇంకా మధుమీద మక్కువ తగ్గలేదు. నీకు మధు కావాలో లేక బావకావాలో తెలియదు. నువ్వు బావను పెళ్ళిచేసుకొని కులాసాగా కాపరం చేస్తుంటే, మధు దేవదాసులా నీకోసం తిరగాలనా నీ ఉద్దేశం?'

మాధవి కళ్ళప్పగించి చూస్తూ నిల్చుండిపోయింది.

'ముందు మధును ప్రేమించినట్లు నటించావు. తీరా ఆ కష్టయ్య చనిపోయాక నీ మనస్సు బావమీదకు మరలింది. బావతో షికార్లు మొదలు పెట్టావ్.'

'రాధా!' అంటూ మాధవి నేలమీద కూలబడింది.

'ఏం? నే నన్నది అబద్ధమా? మధు మనస్సును బాధపెట్టావ్. మధు వెళ్ళిపోయాడు, దానికి నువ్వు చేసిన మోసానికి మధు పిచ్చివాడే అయ్యాడు. మధ్యలో నేను ఆదుకోకపోతే మధు నువ్వు కోరుకుంటున్నట్లు దేవదాసే అయ్యుండేవాడు.'

'రాధా నీకు దండం పెడతాను. ఇంక ఆపుతావా?' మాధవి దుఃఖకంఠంతో పలికింది, చిట్లిపోతున్న నరాలను కూడదీసుకుంటూ.

మళ్ళీ రాధ అదే చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో విరక్తి వుందో, వ్యంగ్యమే వుందో చెప్పటం కష్టమే.

'మొదలు పెట్టడం నీవంతే అవటం కాదా నీవంతేనా! నేను చెప్పదల్చుకుంది చెప్పి తీరతాను, విను. మళ్ళీ మళ్ళీ నా విషయంలో కలుగజేసుకోకు. నేను మధును ప్రేమిస్తున్నాను.'

మాధవి చివ్వున తలెత్తి చూసింది. రాధ మాటల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తోంది.

'నేను మధును ప్రేమిస్తున్నాను, మధు నన్ను ప్రేమిస్తున్నాడు. నువ్వు బావను ప్రేమిస్తున్నావు. తమాషాగా వుంది కదూ ఈ మూడు స్తంభాల ఆట?'

మాధవి వెర్రిదానిలా చూడటం కంటే ఏమీ మాట్లాడే పరిస్థితిలో లేదు.

'మీ అందరి ప్రేమలో స్వార్థం వుంది. మధుకు నువ్వు కావాలి, నీకు బావ కావాలి. కాని నాకు మధు కావాలని నేను కోరటం లేదు. మధుకు నేను ఏమి ఇవ్వగలనా, మధు ఎలా దుఃఖాన్ని మర్చిపోయి సుఖించగలడా అని నేను ఆలోచిస్తున్నాను.' రాధ స్వరంలో గర్వం గంట కొట్టినట్లు మోగింది.

'నేను చాలా అలసిపోయి వున్నాను. బట్టలు మార్చుకొని పడుకోవాలి. ఇంక నువ్వు నన్ను వదిలిపెడతావా?' అంది రాధ. మాధవి ఓ క్షణం రాధ ముఖంలోకి చూసింది. రాధ మాధవికి కొత్తగా కనిపించింది. రాధ ఇంతకుముందు తెలిసిన రాధ కాదనిపించింది, రాధ మానసికంగా ఎంతో ఎదిగిపోయినట్లు కనిపించింది. మాధవి గిరుక్కున వెనక్కు తిరిగి గది బయటకు నడిచింది.

అలా వెళ్ళిపోతున్న మాధవికేసి జాలిగా చూస్తూ, బట్టలు మార్చుకోవటం కూడా మర్చిపోయి, మంచానికి అడ్డంపడి కళ్ళు మూసుకొంది రాధ.

(ఇంకా ఉంది)

డాక్టర్ కబుర్లు

తండ్రి ఎవరు?

రక్తపరీక్షవల్ల తండ్రి ఎవరు అన్న ప్రశ్నకి సమాధానం కొంతవరకు లభించవచ్చు. అమెరికాలో న్యాయస్థానాలలో తండ్రి ఎవరు అనే ప్రశ్న వచ్చినప్పుడు రక్తపరీక్ష చేస్తారు.

ఒక వనిత రక్తం 'ఎ' దినుసు అయితే, బిడ్డ తండ్రిరక్తం కూడా అదే దినుసుకి చెందినది అయితే, పుట్టిన సంతానం రక్తం దినుసు 'ఎ' అయి ఉండాలి. తలిదండ్రులు ఇద్దరిలో ఒకరి రక్తం 'బి' దినుసుది అయితే బిడ్డరక్తం 'ఎ బి' కావచ్చు.

దీనినిబట్టి మనం గ్రహించ గలిగింది—తండ్రి అయిన పురుషుని రక్తం ఏ రకం అయి ఉండాలో చెప్పవచ్చు కాని తండ్రి ఎవరో చెప్పటం కష్టం.



ఈ పరీక్షవల్ల చివరి మాట మాత్రం తేలదని అందరికీ తెలుసు — పోనీ తెలియాలి?

(కాపీరయిటు)

శాసనాలని చేసేవారు ఆడవారే అయి ఉండాలి



డయాన్ హార్ట్

రూత్ వెయిన్

[బ్రిటిష్ నటి డయాన్‌హార్ట్ ఆడవారి ఉద్యమం నాయకురాలు. రాజకీయాలలో స్త్రీలు ప్రముఖ పాత్ర వహించటమే కాక శాసనసభలలో వనితా వర్గం ఒకటి ఏర్పాటుచేసి ప్రభుత్వాన్ని మెరుగు పరచటానికి ప్రయత్నించాలని ఆమె వాదం. ఆమె ఉద్యమంలో ఎందరో చేరుతున్నారు — వీరిలో చాలామంది మాత్రం మగవారు!]

'పార్టీ రాజకీయాలతో విసిగిపోయాను!' అంది డయాన్‌హార్ట్, బ్రిటిష్ నటి. "ప్రభుత్వం నడిపే విధానాలు ఏమాత్రం బాగాలేవు. ప్రభుత్వం నిజంగా పరిపాలించాలి. పరిస్థితులు చక్కబడాలి. దీనికి ఆడవారే సరి! వారికి వదిలెయ్యండి?"

ప్రభుత్వంలో ఇంకా ఎక్కువమంది ఆడవారు ఉండాలని డయాన్ నమ్ముతుంది. 'ఏపార్టీ'లోనయినా సరే, ఎన్నికలకి నుంచోండి!—అని ఆమె అంటుంది. ఇటువంటి ప్రకటన ఒకటి కూడా పత్రికలో వేయించింది. ఈ ఉద్యమం కోసం ఆమె నటన వృత్తికి తాత్కాలికంగా స్వస్తి చెప్పింది. ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఎవరెవరికో ఉత్తరాలు, ఇతర ప్రచార సామగ్రి పంపుతూ ఉంటుంది.

ఆడవారు కేవలం సమాన హక్కులని గురించి మాట్లాడటం ఆపాలి. బ్రిటన్ ప్రత్యేకమైన వర్గాలు ఏర్పరచి తమ అభ్యర్థిని ఎన్నుకోవాలి. మామూలు పద్ధతిలో పార్టీలతో చేరి పైకి రావటానికి ప్రయత్నించి ప్రయోజనం లేదు. అది మరి ఆలస్యం అవుతుంది. వెంటనే వనితలంతా కలిసి ప్రగతికి కృషిచెయ్యాలి — ఇది ఆమె సందేశం యొక్క సారాంశం...

ఇంతవరకూ ప్రచారం ఆడవారికి సరిగ్గా అందుతున్నట్లు లేదు. మగవారే అధికంగా ఆమె ఉద్యమాన్ని బలపరుస్తున్నారు — కేవలం వారి మనస్తత్వం కంటికి కనిపిస్తోంది...

డయాన్‌హార్ట్ అందగత్తె. ఆమెకి ఇద్దరు పిల్లలు. ఒకసారి పెళ్ళి అయింది. 42 సంవత్సరాల వయస్సు ఉంటుంది. మగవారు కొంచెం గుమిగూడినా అర్థం ఉంది.'

ఆమె కొకసారి సిజేరియన్ ఆపరేషన్ అయింది. అప్పుడు కొంచెం పొట్ట ఎక్కువగా కనిపించటం మొదలుపెట్టింది. లోపలికి బిగించి కట్టటానికి 'కార్సెట్' ఒకదానిని ఆమె స్వయంగా తయారు చేసింది. (ఇంకా ఆమె వేసుకుంటుందట దానిని తయారు చేస్తున్నారు) ఈ కార్సెట్‌ని రష్యాలో ఎగుమతి చెయ్యటానికి ప్రయత్నించింది డయాన్‌హార్ట్. రష్యాలో ఆమె కొసిగిన్‌ని కూడా కలిసిందట. ఆమె అక్కడకూడా అన్ని విషయాలూ మొహమాటం లేకుండా మాట్లాడేసిందట!

బ్రిటన్‌లో ఆమె కృషి ముఖ్యంగా ఆడవారికి న్యాయం చేకూర్చే శాసనాలని తేసుకురావటం. అన్యాయంచేసే శాసనాలని రద్దుచెయ్యటం.

డయాన్‌హార్ట్ 'సంఘం'లో మొగవారు చేరవచ్చు — కాని, వారికి వోటింగు హక్కులు ఉండవు, అధికారం ఉండదు. కేవలం ఆమె ఉద్యమానికి కృషిచేస్తే సంతృప్తి ఉంటుంది. అంతే...

[లో. జ. కి.]

ఈనాటి స్త్రీలలో చాలామంది భర్తను గౌరవించటం మరిచి పోతున్నారు.

మీ సంగతితో సదలాలి యిలాంటి విషయాలు, రమాదేవిగారూ, అందరితరఫునా వకాల్తా పుచ్చుకుని వో స్టేట్‌మెంటు పారేస్తే ఎలా?!

ఆర్, సిహెచ్. ఆర్, బారువ

నా పెళ్లికి ఆహ్వానిస్తాను. ఆనాటి పెళ్లిరోజు పైవో చిన్నవ్యాసమో గేయమో వ్రాస్తారా?

తప్పకుండా తమ్ముడూ, ఇదిగో ఇప్పటినుంచీ పంచరత్నాలు పదును పెట్టుతాను....సరేనా?

పి. ఆర్. కె, శీలవల్లి

రామలక్ష్మిగారూ మనిషిలోని మంచితనం ఎప్పుడు బయటపడుతుంది? చెడ్డతనం ఎప్పుడు బయట పడుతుంది?

రెండూ ఎప్పటికప్పుడు బయట పడుతూనే ఉంటాయి.కాని పబ్లిక్ అయ్యేది చచ్చిన తరువాతనే.

బి. ఎస్, విశాఖపట్నం

మనవాళ్ళు పాశ్చాత్యులలోగల మంచిని తీసుకోడానికి ప్రయత్నించకుండా చెడు తేలికగా గ్రహిస్తారు. వాళ్ల సంఘ వ్యవస్థమీద మీ అభిప్రాయం?

ఏదో గ్రహించ ప్రయత్నించడం మంచిదేకదా— చెడు గ్రహించినవాడు నెమ్మదిమీద మంచినీ గ్రహిస్తాడు. ఇక వాళ్ల సంఘ వ్యవస్థ ల్లలపై బాధ్యత తగ్గించేదిగా తోస్తుంది. ఎవరి బ్రతుకు వారిది అన్న నమ్మకంతో సాగిపోతాయి. వయోజనులైనా మన పిల్లల్లాగా ఇల్లు వదిలితే కష్టపడాలేమో నన్న బెంగతో చూరుపట్టుకు వేళ్లాడరు.

ఎమ్. ఎల్, కామారెడ్డి

ఒక ప్రశ్నకు జవాబిస్తూ రచయిత్రులు తెలివికల వారన్నారు కదా? అయితే మీ ఉద్దేశ్యంలో రచయితలు తెలివితక్కువ వారనా?

రాజుగారి పెద్దభార్య మంచిది అన్నంతమాత్రాన చిన్నభార్య చెడ్డదని ఎందుకు నిర్ణయించాలి చిట్టితల్లీ, అయినా అది అచ్చుతప్పు.

పి. ఆర్. ఆర్, మానవరం

మంచికి మానవత్వానికి తేడా ఏమిటి?

తేడాలేదు. మంచితనమే మానవత్వం.

కె ఎస్. బి. కాజూరు

ప్రపంచంలో కల్లా పెద్దవస్తువూ, చిన్నవస్తువూ ఏది?

మనిషిమనస్సు.

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

టి, ఎస్. ఆర్, కొత్తపేట

మనిషిలో అహంకారం గర్వంలేకుండా రూపుమాపాలంటే దానికి సాధనలు?

తపస్సు. తపస్సుచేసి మానవజన్మ ఎత్తకుండా ఉండడమే మందు.

ఆర్. పి, జగిత్యాల

కొందరు వ్యక్తులు స్నేహితము కొరకు డబ్బు వ్యయంచేస్తూ ఉంటారు. ఆ స్నేహితము ఎంతవరకు నిజము?

డబ్బిచ్చి కొనుక్కున్నంతవరకు—!

జి. ఎస్. ఎస్, విశాఖ

మీరు జవాబు లిచ్చుటవల్ల తగిన పారితోషిక మేమైన ముట్టునా?

ముట్టు మనే యున్నది.

ఎల్. జె, విశాఖపట్నం

పిరికివానికి నిర్వచనం ఏమిటి రామలక్ష్మిగారూ?

పరిస్థితులు వక్రించినప్పుడు కాళ్లతో ఆలోచించేవాడు!

ఎస్. కె. ఆర్, కందుకూరు

అక్కయ్యా! భార్యా భర్తలను గురించి వ్రాసే వ్యాసాలు చాలా బాగా ఉంటున్నాయి—అవన్నీ అనుభవ పూర్వకంగా వ్రాసినవా? కల్పితాలా?

అనుభవానికి పరిశీలనా దృష్టి జతచేసి రాస్తాను.

వి. కె. శ్రీశైల ఆత్మకూరు

వారు వివాహితులైనప్పటికి నా మనస్సు వారికి అర్పించాను. ఈవిషయం మావారు కనిపెట్టి నన్ను కట్టడి చేశారు. ఎన్నియో లేఖలు వారికి రాశాను...

అమ్మా, కొంపలు తీసే నీలాంటి మహిళామతల్లులు యీరోజుల్లో ఎక్కువగా కన్పిస్తున్నారు. నీ కేసు ఇంకో ఆకు ఎక్కువే. నీకూ పెళ్ళయ్యిందం [illegible] చేపట్టాలి. ఇలా దొంగ బతుకెన్నాళ్లు సాగించిన దండుగే. నీ మనశ్శాంతి కోసం కాకున్నా నిన్ను కట్టుకున్న పాపానికి ఆయనగారి పరువు తీయడం ధర్మం కాదు. ... .నువ్వు ప్రేమిస్తానంటున్నావే— అతగాడి పెళ్లాం పిల్లలని రోడ్డెక్కించడం అంకంటే ధర్మం కాదు. . . . .

కె. ఎస్. బి. ఆర్, రాజమండ్రి

పి.యు.సి. చదువుతున్నాను. లోకంలో ఎందుకు బ్రతుకుతున్నానో అర్థం కావడం లేదు. ఒంటరిగా ఏ అరణ్యాలకైనా పోవాలనిపిస్తుంది. అక్కగా ఈ తమ్మునికిచ్చే సలహా?

ఇంకా సలహా అంటావేమిటి చిట్టి తండ్రీ పి. యు. సి. చదివే నీకింత వైరాగ్యం ఉందంటే ఖచ్చితంగా నువ్వు ఏ బాలయోగివో అయ్యుంటావు. మా బావగారితో చెప్పి, మూట ముల్లె సద్దుకుని వచ్చేస్తాను. ఏ చిన్న ఆశ్రమమో పెట్టుకుని కాలక్షేపం చేయవచ్చు. నీ వైరాగ్యం రాణిస్తుంది. నా చేతిలో ఉన్న ధనరేఖా నిజమవుతుంది. ఏమంటావు?

సి. ఆర్. డి, హనుమకొండ

చిలిపిగా ఉండే మీ జవాబులు చదువుతుంటే నా మనసు హుషారుగా ఉంటుందండి......

మీరిలా అంటున్నారా? కొందరేమంటారో తెలుసా? ఫలానావారిలా మీ రెందు కివ్వరు? అంటారు–అక్కడికి జవాబులన్నీ ఒకేమూసలో పోసినట్టుండాలని. పోనీ అలా ఇస్తే ఏమంటారు? వారిలా మీ రెందుకిస్తారు? అంటారు. అంచేతనే నేను పొగడ్తనీ, తెగడ్తనీ ఒకేరకంగా స్వీకరిస్తాను—

బి. జి కె, ఆర్మూరు

స్వాతంత్ర్యాన్ని విస్మరించి స్వార్థపరులైన నాయకులు పేదరికాన్ని మరీ పెంచుతున్నారు. దీని నిర్మూలనకై కమ్యూనిజం రావాలంటాను. మనమే దానిని స్థాపించాలి.

అలాగే. కనీసం పేదరికమైనా అందరికీ పంచుదాం! తమరు శంఖుస్థాపన చేసేటప్పుడు పిలవడం మరిచిపోకండి.

కె. ఎం. ఆర్, ఆళ్లగడ్డ

ఒక శిలా ప్రతిమను మలచినప్పుడు అందులో నైతికత లోపించినా లోపించకపోయినా కళ ప్రతిబింబించదని అనవచ్చునా?

మీ ప్రశ్నకి అర్థం? న్యూడ్‌ని కళ అనవచ్చు ననేకదూ?! సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లో శిల్పాలు చూడండి. అది కళ అవునా? కాదా? అన్న ప్రశ్న తలెత్తదు.



“ధర్మదాత”లో అనిత, కాంచన, అక్కినేని నాగేశ్వరరావు

చిత్రసమీక్ష:

ధర్మదాత

కథను మించిన నటీనటులు, నటీనటుల్ని మించిన కథ, అంతకుమించిన చిత్రీకరణ వున్నప్పుడు ఆ చిత్రం ఎంత శోభాయమానంగా వుంటుందో చెప్పడానికి ఒక చక్కని ఉదాహరణ రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్‌వారి 'ధర్మదాత'. చిత్రానికి మాతృక ఏదైనా కానివ్వండి, బ్యానర్‌ని సార్థక పరచుకుంటూ కథతోపాటు మంచి రసాత్మకమైన చిత్రాన్ని అందించిన నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి బహుధా ప్రశంసనీయులు.

చిత్రం చూస్తున్నప్పుడు కొట్టొచ్చినట్టు అగుపించేవి రెండు అంశాలు: ఒకటి అక్కినేని నాగేశ్వరరావు అద్వితీయమైన ద్విపాత్రాభినయం; రెండవది తాతినేని చలపతిరావు ఉత్సాహ జనితమైన సంగీత సారథ్యం.


ధర్మదాత ఐశ్వర్యంమీద భుజంగరావు కన్ను పడుతుంది. కొడుకు కట్నం రూపేణా ఆ ఆస్తినంతా చేజిక్కించుకుంటాడు. క్రూరాతి క్రూరంగా ధర్మదాతని బాధపెడతాడు. ధర్మదాత పూర్వీకుల—వంశ సాంప్రదాయంగా వస్తున్న శ్రీ నిలయాన్ని సంరక్షించుకునే లక్ష్యంతో కొడుకుల నిద్దరినీ తయారు చేస్తాడు. ధర్మదాత పేరు నిలబెట్టుకుంటూ శ్రీ నిలయాన్ని దక్కించుకోవడంతో కథ క్లైమాక్సు కెక్కుతుంది.

పెడత్రోవలు లేకపోతే సినిమాకథ అవదు. భుజంగరావుని మరీ 'పరమ' రాక్షసుడుగా చిత్రించకపోతే కథలేదు. అలాగే అప్పిచ్చిన షావుకారు మంచివాడై ఇల్లు ఖాళీ చెయ్యమనక పోయినా ధర్మదాత గనక ఖాళీచెయ్యక తప్పలేదు (?) కథకి ఇదీ ఆధారమే! చిత్రీకరణలో గొప్పతనం వీటిని లోపాలుగా చూపించదు. పైగా, చిత్రానికి బిగువునుకూర్చే సోపానాలుగా అనిపిస్తాయి. అందుకు ముఖ్యంగా అభినందించ దగ్గవాడు దర్శకుడు ఎ. సంజీవి. ప్రతి సన్నివేశమూ కాచి వడబోసినట్టు ఆద్యంతమూ అనిపించే ఈ చిత్రంలో యస్. వెంకటరత్నం కెమెరా చూపి తీరవలసిన మాజిక్కులు చేసింది. పినిసెట్టి సంభాషణలు చిత్రాన్ని ఉత్సాహంగా నడిపించడానికి తోడ్పడ్డాయి.

ఇక నటనని పట్టిచూస్తే —వృద్ధాప్యంలో [illegible] వాళ్ళు గగుర్పొడిపించే నటనని ప్రదర్శించారు. తండ్రీ కొడుకులుగా అతని నటన చూడ ముచ్చటగావుంది. తర్వాత చెప్పదగిన నటుడు పద్మనాభం. ఈతని హాస్యంలో ప్రత్యేకత జనాన్ని అశేషంగా అలరిస్తుంది. నాగభూషణం పాత్రోచితమైన నటన కథకి బాగా సాయపడింది. ఫలాకీగా నటించడంలో ఆమెకి ఆమేసాటి అనిపించుకున్నది కాంచన. కథానాయికగా ఆమె నటన తారస్థాయి నందుకున్నది. పాత్ర పరిధిలో జానకి ప్రశంసనీయంగా నటించింది. రేలంగి, అల్లు రామలింగయ్య, గీతాంజలి, అనిత మొదలైనవారు పాత్రల్ని రక్తికట్టించిన వారిలోవున్నారు.

పాటలన్నీ హిట్ కాగల ఈ చిత్రానికి సంగీతం విశేషాకర్షణ. కొన్ని పాటల్ని రంగుల్లో చిత్రీకరించడం మరొక ఆకర్షణ. ఉత్తమాభిరుచితో వినోదాత్మకంగా నిర్మించిన ఈ చిత్రం లక్ష్మీ ఫిలింస్ విడుదల.

— సికరాజు



“ఎవ్వని సంసారం”లో విజయలలిత

కొడై కెనాల్‌లో లక్ష్మీ, నాగేశ్వరరావుల ప్రేమగీతాలు...

అవుట్‌డోర్ యూనిట్‌తో మాధవి కంబైన్స్ మే 1న కొడై కెనాల్‌కు తరలి వెళ్లింది. అప్పటికే హీరో నాగేశ్వరరావుగారు అక్కడికి (జగపతి అవుట్‌డోర్ వర్కు చేసి) చేరుకున్నారు దర్శకుడు శ్రీ తాతినేని రామారావు హీరో హీరోయిన్లకు సంబంధించిన రెండు ప్రేమ గీతాలని సెల్వరాజ్ గారి సహాయంతో చిత్రీకరించారు. ఈ చిత్రంలో లక్ష్మి ప్రప్రథమంగా శ్రీ అక్కినేని ప్రేయసిగా నటించింది. శ్రీ సుబ్బారావు అండ్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి గుహనాథన్ కథను, బొల్లిముంత శివరామ కృష్ణయ్య మాటలను సమకూర్చారు. కె. వి. మహదేవన్ సంగీతాన్ని, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని నిర్వహిస్తున్న ఈ చిత్రంలో ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, పద్మనాభం, అంజలీదేవి, లక్ష్మి పోషిస్తున్నారు. జూన్ నుండి సారధి స్టుడియోలో ఇన్‌డోర్ షూటింగు జరుగగలదని తెలుస్తోంది.



"ఎనిడిమనసులు"లో శారద

కేరళలో అవుట్‌డోర్

నవశక్తి పిక్చర్స్ నిర్మిస్తున్న సాంఘిక చిత్రం యిప్పటికి అయిదురీళ్లు తయారైంది. మే 14 నుండి 29 వరకు హీరో శ్రీ ఎన్. టి. రామారావు యింటి సెట్టులో వర్కు జరుగుతుంది. శారద, రామారావుగార్లు పాల్గొనే దృశ్యాలను చిత్రీకరిస్తారు. శంకర్ జైకిషన్లు సమకూర్చిన సంగీతాన్ని వినే అవకాశాన్ని నిర్మాత గంగాధరరావు కల్గించారు. శ్రీ ఘంటసాల, శారదగార్లు పాడిన యుగళగీతం (చిత్రంలో రామారావు వాణిశ్రీలు పాడేపాట) మధురంగావుంది, శ్రీ సి. ఎస్ రావ్ దర్శకత్వంలో తయారయ్యే యీ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చెయ్యాలను కుంటున్నట్టు, అవుట్‌డోర్ చిత్రీకరణకోసం కేరళ వెళ్ళదలచినట్టు చెప్పారు. నవశక్తియూనిట్ తయారు చేసిన యీ కథలో కనిపించే పాత్రలను శ్రీ ఎన్. టి. రామారావు, శారద, వాణిశ్రీ, రేలంగి, పద్మనాభం, రమణారెడ్డి, హేమలత, శ్రీరంజని, శ్యామల, రాజకుమారి మరియు కమాలాకోట్నీస్ ధరిస్తున్నారు.

సినిమా



"ఎగ వాత్తీస్తా"లో విజయలలిత

హిందీలో 'బ్రహ్మచారి' కలర్‌లో నిర్మాణం

జ్యోతిపిక్చర్స్ శ్రీ నారాయణరావు, నవశక్తి పిక్చర్స్ శ్రీ గంగాధరరావు జ్యోతినవశక్తి కంబైన్స్‌పేరిట 'బ్రహ్మచారి' (పి. వి. పి: తెలుగులో నిర్మించింది) చిత్రాన్ని హిందీలో ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్నారు. శ్రీ అక్కినేని పాత్రను జితేంద్ర, జయలలిత భూమికను ముంతాజ్ ధరించే ఈ చిత్రానికి శ్రీ ప్రత్యగాత్మ దర్శకుడు, షూటింగు ఆగస్టు 15 నుండి మద్రాసులోని ప్రసాద్‌స్టుడియోలో జరుగగలదని తెలుస్తోంది. ఈ చిత్రానికి పండిట్ ముఖ్‌రాంశర్మ మాటలను, శంకర్ జైకిషన్లు సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

దసరా వేడుకలు!

జగపతి ఆర్ట్ పిక్చర్స్ నిర్మిస్తున్న 'దసరా బుల్లోడు' యొక్క రెండవ షెడ్యూలు బట్లపెనమర్రులో నాలుగు రోజులు జరిగింది. ఒక కలర్‌పాట, దసరా



"ఆడజన్మ"లో సత్యనారాయణ, జమున, హరనాథ్

రిడుకీలు, కొంత క్లయిమాక్స్ చిత్రీకరించబడింది. చిత్రంలో నటించే నటీనటులు అందరూ పాల్గొన్నారు. ఇప్పటికి అయిదు పాటలు నాయకీ నాయకులపై చిత్రీకరించబడినవి. జూన్‌లో మరి రెండు పాటలు ఇన్‌డోర్‌లో చిత్రీకరింపబడగలవని నిర్మాత, దర్శకుడు శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. సెప్టెంబరుకు షూటింగు పూర్తి కాగలదని తెలుస్తోంది. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, వాణిశ్రీ రేలంగి, రంగారావు, గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, చంద్రకళ, సూర్యకాంతం అండ్ అంజలీదేవి పోషిస్తున్నారు. కెమేరాను వెంకటరత్నం; మ్యూజిక్‌ను మహదేవన్, డ్యాన్సును, హీరాలాల్; ఆర్టును జి. వి. సుబ్బారావు; ఎడిటింగును సంజీవి నిర్వహిస్తున్నారు.

సినిమా

* * *

బి. ఎస్. మూవీస్ నిర్మిస్తున్న 'పచ్చని సంసారం' స్త్రీ త్యాగనిరతిని, ఆమె ఓర్పునేర్పులను, ఆమెలోని సుగుణ సంపత్తిని చాటి చెప్పే చక్కటి చిత్రం. నటుడు ప్రభాకరరెడ్డి వ్రాసిన కథకు, మాటలు, సంభాషణలను సమకూర్చారు. జూన్ 5న విడుదల కానున్న ఈ చిత్రానికి వెంకటరత్నం ఛాయాగ్రహణాన్ని, కోదండపాణి సంగీతాన్ని, అనంతరావు శిల్పాన్ని నిర్వహించారు. ఈ చిత్రంలో వాణిశ్రీ, కె. ఆర్. విజయలు ధరిస్తున్న పాత్రలు క్లిష్టమయినవి మాత్రమేగాక ప్రతి హృదయాన్ని కరగించి కదలించేవిగా వున్నాయి. ఈ చిత్రం ద్వారా లక్ష్మీదీపక్ అనేది కొత్త దర్శకుడు పరిచయమవుతున్నాడు.

* *

శ్రీ లక్ష్మీదీపక్ యిదివరకు ముందు నాయికి, హేమాంబరధరరావుగార్లకు సహాయదర్శకుడిగా పని చేసి వున్నారు. టేకింగ్‌లో ప్లానింగు + స్పీడు కనిపిస్తుంది. ఎంతవరకు 'షాట్' అవసరమో, అంతవరకే తీసుకుని, ఆర్టిస్టులకు అనవసర శ్రమ యివ్వకుండా తక్కువ వ్యవధిలో ఎక్కువ ఎఫెక్టు రాబట్టుకునే సామర్థ్యం లక్ష్మీదీపక్‌లో కనిపిస్తుంది.

తెరకెక్కుతూ ఉన్న నాటకం!

'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకంలో వాణిశ్రీ కథానాయికగా నటించి, అద్భుతంగా ప్రదర్శింపించుకున్న తర్వాత సినిమాల్లో ఛాన్సు దొరికింది. 1960లో బెస్టు స్క్రిప్టు అవార్డును ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఈ నాటక రచయిత శ్రీ దాసం గోపాలకృష్ణకు యిచ్చింది. ఆంధ్రదేశమంతటా ఈ నాటకం బహుళ ప్రచారణ పొందింది. ఇప్పుడు శ్రీ దాసం గోపాలకృష్ణ వాసుదేవా పిక్చర్స్ పేరిట 'చిల్లరకొట్టు చిట్టెమ్మ'ను వర్ణ చిత్రంగా నిర్మించడానికి తలపెట్టయించారు. ప్రధాన పాత్రను వాణిశ్రీ ధరించగలరని, ఈ సంవత్సరాంతంలో షూటింగు ప్రారంభం కాగలదని తెలుస్తోంది.

తిరుపతి కొండపై ప్రారంభం అయిన చిత్రం

శ్రీ తోట సుబ్బారావు నిర్మిస్తున్న 'పట్టిందల్లా బంగారం' షూటింగు మే 16 న తిరుపతి కొండపైగల కుటీరాల్లోనూ, పరిసర ప్రదేశాల్లోనూ ప్రారంభమై, మే 24 వరకు జరుగుతుంది. ఈ షెడ్యూలులో క్లైమాక్స్ దృశ్యం చిత్రీకరించబడుతుంది. బి. వి. ఆర్. శేష గిరిరావు దర్శకత్వాన్ని, లాల్ ఛాయా

సినిమా డైరీ

- మహాలక్ష్మి మూవీస్ మైసూరులో నిర్మిస్తున్న తెలుగు చిత్రాన్ని శ్రీ వేదాంతం రాఘవయ్య డైరెక్టు చేస్తున్నారు. మే 8 న షూటింగు ప్రీమియర్ స్టుడియోలో స్టార్టు అయింది.
- పద్మావతి పిక్చర్స్ నిర్మిస్తున్న క్రయిం థ్రిల్లర్‌లో కృష్ణ ప్రక్కన భారతి నాయికగా నటిస్తున్నట్టు దర్శక, నిర్మాత శ్రీ ఎం. మల్లికార్జునరావు వెల్లడించారు.
- కల్పనా చిత్రవారి 'సోమరిపోతు' చిత్రంలో చలం హీరో. వెన్నిరఆడై నిర్మల నాయిక. దర్శకుడు: శ్రీ వి. రామచంద్రరావు.
- ఉమశ్రీ పిక్చర్స్‌వారి 'పసిడి మనసులు' మే 14న నవయుగాద్వారా విడుదలవుతుంది. ఎ.ఎం. ప్రొడక్షన్స్‌వారి 'మా మంచి అక్కయ్య' మే 15న జయలక్ష్మి పిక్చర్స్ ద్వారా విడుదలవుతుంది.
- ఉత్తమచిత్రవారి షూటింగు హైదరాబాదు సారథిలో మే 8నుండి 15వరకు జరుగుతుంది. ఈచిత్రానికి శ్రీ ప్రత్యగాత్మ దర్శకుడు. జమున, జగ్గయ్య, రామకృష్ణ మొదలగువారు పాల్గొన్నారు.

ప్రాణాలొడ్డి నిర్వహిస్తున్న యీ చిత్రం లోని ప్రధాన పాత్రలను చలం, (రెండు పాత్రలు) జగ్గయ్య, రేలంగి, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, కె.వి.చలం, సాక్షి రంగారావు, బాలకృష్ణ, రమణారెడ్డి, సురేష్‌బాబు, రాజశ్రీ, ఛాయాదేవి, సవిత మొదలగువారు పోషిస్తున్నారు. మహేంద్రన్ వ్రాసిన కథకు, వి. ఎల్. ఎన్. ఆచార్య మాటలను సమకూర్చిన యీ చిత్రం సంపూర్ణ హాస్యం + క్రైమ్ సన్నివేశాలతో నిండివుండి, అడుగడుగునా ఉత్కంఠతను, ఉత్తేజాన్ని కలిగిస్తుందని నిర్మాత తెల్పుతున్నారు.



'మూగప్రేమ'లో శోభన్‌బాబు, వాణిశ్రీ

తెలుగులో లేడీ జేమ్స్‌బాండ్

నవభారత్ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన శ్రీ పి. పూర్ణచంద్రరావు శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ నిర్మించనున్న అపరాధపరిశోధక చిత్రానికి అధ్వర్యం వహిస్తున్నారు. హీరో లేని యీ క్రైమ్ కథకు, సెంటిమెంటు జతపర్చబడడం యిందులోని విశేషం. శ్రీ కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వంలో తయారయ్యే యీ చిత్రంలో నాయిక పాత్రను నాయిక విజయలలిత పోషిస్తున్నది. 'పగ' మనుష్యుల్ని ఎంత దూరానికి తీసికెళ్తుందో, ఆ పగ ఎంతటి పరిణామాలను యేర్పరుస్తుందో యీ చిత్రం చూస్తే తెలుస్తుంది. ఈ చిత్రానికి విశ్వప్రసాద్ మాటలను, సత్యం సంగీతాన్ని, కన్నప్ప కెమెరాను, చలం శిల్పాన్ని, కె. ఎస్. రెడ్డి నృత్యాలను, పిటూరి పాటలను నిర్వహించగల ఈ లేడీ జేమ్స్‌బాండ్ చిత్రంలోని 'ముఖ్య భూమికలను విజయలలిత, జ్యోతిలక్ష్మి, రాజబాబు, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, ధూళిపాళ, త్యాగరాజు, రావుగోపాలరావు, జేబిరాణి (గెస్టు) ధరిస్తారు. ప్రఖ్యాత నాట్యతార హెలెన్ ఒక డ్యాన్సును చెయ్యగలదని తెలుస్తోంది. జూన్ 9న షూటింగు ప్రారంభం అవుతుంది.

కాకినాడ పరిసరాల్లో ఔట్ డోర్!

కామధేను పిక్చర్స్ నిర్మిస్తున్న 'తల్లితండ్రులు' చిత్రం పాటలు రికార్డు తయారైంది. మే 4న శ్రీ ఘంటసాల సారథ్యంలో మూడు పాటలు విజయా గార్డెన్స్‌లో చిత్రీకరించబడ్డాయి. ఈ పాటలను ఘంటసాల, జానకి, ఈశ్వరి + కోరస్ పాడారు. పాటలను మే 23 నుండి కాకినాడ పరిసరాల్లో (అవుట్‌డోర్) చిత్రీకరించే సన్నాహాలను నిర్మాత ప్రభాకర్, దర్శకుడు బాబూరావు పూర్తి చేసారు. ఈ షెడ్యూల్‌లో చిత్రంలో నటించే నటీనటులందరూ పాల్గొంటారు. ఒక 'కుటుంబరక్షణకు, పిల్లల మంచి చెడ్డలకు' తల్లితండ్రులు ఎంతవరకు అవసరం అనేది సందేశాన్ని యిచ్చే చక్కటి కుటుంబ చిత్రమే ఈ 'తల్లితండ్రులు' చిత్రం. ఈ చిత్రానికి పినిశెట్టి మాటలను, ఘంటసాల సంగీతాన్ని, బుల్‌బుల్ ఛాయాగ్రహణాన్ని, నాగేశ్వరరావు సహాయ దర్శకత్వాన్ని నిర్వ



'పచ్చని సంసారం'లో వాణిశ్రీ, సంధ్యారాణి

సినిమా

హిస్తున్న ఈ చిత్రం జులైలో విడుదల కాగలదని తెలుస్తూంది.

కన్నడంలో జరిగినకథ!

శ్రీ ప్రభాకర్ నిర్మించి, విజయవంతంగా ప్రదర్శింపబడ్డ 'జరిగిన కథ' చిత్రాన్ని కన్నడంలో విజయా ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించడానికి నిశ్చయించారు. శ్రీ బాబూరావు దర్శకత్వం నెరపనున్న ఈ చిత్రంలో రాజకుమార్, జయంతి ప్రధాన పాత్రలను పోషిస్తారు. షూటింగు ఆగస్టులో వుండగలదని తెలుస్తూంది.

* * *

కన్నడ చిత్రనిర్మాణం పూర్తికాగానే తెలుగులో ఒక 'జేమ్స్‌బాండ్' సబ్జెక్టును తీసుకోదలచినట్లు దర్శకుడు బాబూరావు వ్యక్తపరిచారు.

తిరిగి ప్రారంభం అయిన వైకుంఠపాళి

'మనం ఒకటి తలిస్తే, దేవుడు మరొకటి చేస్తాడు' అంటారు. ఈ సామెత 'వైకుంఠపాళి' చిత్రానికి వర్తించిందనే చెప్పాలి. ఎప్పుడో విడుదల కావలసిన 'వైకుంఠపాళి' అనివార్యకారణాల వల్ల చివరి దశలో ఆగిపోయింది. 'ఇప్పుడు నిర్మాణం పునఃప్రారంభమైంది. శ్రీ కె. త్యాగరాజు నిర్మాణ పర్యవేక్షణలో ప్రారంభమయిన 'వైకుంఠపాళి' మే నెలాఖరుకు యానాం, కాకినాడ, పట్టిసీమ ప్రాంతాలకు వెళ్తున్నారు. అక్కడ మూడుపాటలు, క్లయిమాక్సు చిత్రీకరింపబడగలవని దర్శకుడు తోటరామోహనరావు వెల్లడించారు. దసరా పర్వదినాల్లో విడుదలకానున్న యీ చిత్రంలో కృష్ణకుమారి ద్విపాత్రాభినయం హైలైటుగా వుండగలదట. చిత్రంలో కనిపించే ప్రధాన పాత్రలను హరనాథ్, రేలంగి, నాగభూషణం, నాగయ్య, త్యాగరాజు, రమాప్రభ, అల్లురామలింగయ్య, ఛాయాదేవి, రమాదేవి, జ్యోతిలక్ష్మి గార్లు పోషిస్తున్నారు.

* * *

మీకు తెలుసా?

ఇప్పుడున్న హీరోలు, హీరోయిన్లలో చాలామందికి 'విగ్' పెట్టుకోడం అలవాటయింది.

తమిళనటుల్లో చాలామందికి డ్రామా ట్రూపులున్నాయి. వీరికి దొరికినప్పుడల్లా నాటక ప్రదర్శన లివ్వడం వాళ్లకు సరిపాటి.

నటి భారతి 'స్నేహితి' తమిళ చిత్రంలో టి. ఎం. సౌందరరాజన్‌తో ఒక డ్యూయెట్ పాడింది.

తెలుగు నిర్మాతలు కొందరు మైసూరు స్టుడియోల్లో తమ చిత్ర నిర్మాణ కార్యక్రమాలను జరపాలనుకుంటున్నారు.

'నిండుముత్తయిదు' చిత్రాన్ని శారదా చిత్ర నిర్మించనున్నారు. ఇది పౌరాణికం కాదు, జానపదం. ఇది ఒక సంచలన చిత్రంగా వుండగల కథాంశం గొప్పదట. శ్రీ ఎం. సాహెబ్‌ప్రస్సేన్ నిర్మించనున్న యీ చిత్రాన్ని యిద్దరు యువకులు డైరెక్టు చేస్తారు. ఈ యిద్దరూ సహాయ దర్శకులుగా అనుభవం గడించినవాళ్లే. శ్రీ ఎ. బి. జగన్మోహనరావు, బి. వి. ప్రభాకరరావుగార్లు డైరెక్టు చేసే యీ చిత్రంలోని ప్రధాన పాత్రలను కాంతారావు, శోభన్‌బాబు, రేలంగి, సత్యనారాయణ, రాజబాబు, త్యాగరాజు, అంజలీదేవి, భారతి, జ్యోతిలక్ష్మి మొదలగువారు పోషించగలరట. శ్రీ లక్కినేని శ్రీనివాసరావు సారథ్యం వహించనున్న యీ చిత్రానికి సత్యనారాయణ ఛాయను, పినిసెట్టి, గోను విజయరత్నం మాటలను, వాలి శిల్పాన్ని, బి. ఎస్. లవ్. సహకార దర్శకత్వాన్ని నిర్వహిస్తారట. శ్రీ సుసర్ల దక్షిణామూర్తి యీ జానపదానికి సంగీతసారథి.

'ఎవరుచేసిన పాపం?'

భగవంతుడి లీలలు అయోమయంగాను, అగమ్యగోచరంగాను వుంటాయి. ఏ పాపం మెరుగని పసికందు ఒకతె పుట్టిన

తొమ్మిదినెళ్ళకే దూరమై, పెంచుకున్న వాళ్ళ పంచన పడేళ్ళు కూడా వుండకుండా, చిట్టచివరకు కన్నతల్లి లాలనపాలనలో వుంటూ కూడా 'అమ్మా' అని పిలువ జాలక పోయిన అమాయకపు 'అమ్మాయి' జీవితకథయే మహావిష్ణు పిక్చర్స్‌వారి 'శ్రీదేవి' చిత్రం. శ్రీదేవిగా రోజా రమణి నటిస్తున్న యీ ఉదాత్త సాంఘిక చిత్రంలో హరనాథ్, కె. ఆర్. విజయ, గుమ్మడి, సూర్యకాంతం, రాజబాబు, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, ఆనందమోహన్. సంధ్యారాణి, రాధా కుమారి, రుక్మిణి, బేబి బ్రహ్మాజీ ప్రధాన



"జడజన్మ"లో జమున

పాత్రలను పోషిస్తున్నారు. శ్రీ ఆర్. ఎస్. నారాయణ నిర్మిస్తున్న యీ చిత్రానికి బి. ఎస్. నారాయణ నిర్దేశకత్వాన్ని, వెంకటేష్ సంగీతాన్ని, శివరామ కృష్ణయ్య సంభాషణ విభాగాన్ని, సంజీవి మోహన్లు ఛాయాగ్రహణాన్ని నిర్వహించారు. ఈ చిత్రం ముప్పాతిక పైభాగం పూర్తయింది.

* * *

మానవతా వైజ్ఞానికంగా ముందంజ



"పగ సాధిస్తా"లో విజయలలిత, త్యాగరాజు.

వేస్తున్నందుకు సంతోషం; నైతికంగా వెనక వస్తున్నందుకు విచారం కల్గుతూ వుంది. మనిషిలో న్యాయం, ధర్మం నశించింది. పాపభీతి, దైవభక్తి సన్నగిల్లి పోతూంది. మనందరికీ 'సతీ అనసూయ' కథ బాగా తెలుసు. బ్రహ్మను, విష్ణువును, శివుణ్ని తన పాతివ్రత్య ప్రభావంతో పసిపిల్లల్ని చేసిన [illegible]



"అగ్నిపరీక్ష"లో యల్. విజయలక్ష్మి

ఆశీర్వాదాలను (ప్రముఖ కర్నాటక) శ్రీ సుందరలాల్ నహతా కలర్‌లో నిర్మించ తానికి నిశ్చయించినట్లు, అనసూయ పాత్రను తాను ధరిస్తున్నట్లు యిటీవల తామును చెప్పారు.

* * *

'అంతులేనికథ', 'నిండుహృదయాలు' చిత్రాలను నిర్మించిన శ్రీ జగన్నాథరావు తాము నిర్మించే చిత్రానికి 'నిండు జీవితము' అని పేరు పెట్టారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వాన్ని శ్రీ కె. విశ్వనాథ్ నిర్వహించే ఈ చిత్రానికి టి. వి. రాజు సంగీతదర్శకత్వం, సముద్రాల రామానుజాచార్య సంభాషణకర్త. మే 8 న ఈ చిత్రానికిగాను ఒకపాట రికార్డు చెయ్య

సినిమా

బడింది. ఈ చిత్రంలో శ్రీ ఎన్. టి. రామారావు కథానాయకుడు. షూటింగు త్వరలో ప్రారంభమవుతుంది.

* * *

– 'నిండుహృదయాలు' ముగ్గురు కలిసి ప్రతిని కొత్త మూవీస్ కలర్‌లో నిర్మిస్తున్నారు. వాణిశ్రీ, శివాజీ నాయకీ నాయకులుగా నటిస్తున్న ఈ చిత్రం యొక్క షూటింగు మే 7 న జెమినీ స్టూడియోలో ప్రారంభమైంది. ఇదిగాక శ్రీ రాజా ఆర్ట్సు పిలింస్ నిర్మించనున్న తెలుగు చిత్రాన్ని కూడా శ్రీ విశ్వనాథ్ డైరెక్టు చేస్తారు. —శ్రీనివాస్



'అభిమానవంతులు'లో కృష్ణ, భారతి

వివాహాలు

పూర్ణాపిక్చర్స్ డైరెక్టర్ శ్రీ జి. ఎన్. ఎస్. వారి సోదరీమణులు చి. సౌ. లలిత, చి. సౌ. ప్రభావతి... వివాహాలు శ్రీ ఇమ్మడిశెట్టి రామమూర్తిగారి తృతీయ పుత్రుడు చి. నరసింగరావుకు, చి. కె. ... శ్రీ కొల్లూరి ... గారి రెండవ కుమారుడు చి. ... విశాఖపట్నంలోని 'పూర్ణామార్కెట్' లో మే 8 వ తేదీ ఉదయం గం 9-45 ని. లకు వైభవంగా వివాహాలు జరిగాయి. వివాహమహోత్సవానికి పలువురు ప్రముఖులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.

అవీ-ఇవీ...

శ్రీ రఘురామయ్యగారికి సన్మానం

శ్రీ కె. రఘురామయ్యగారిని ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర పీఠం కళాశాల సాంస్కృతిక సంఘం వారు ఇటీవల సన్మానించారు. సభకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఆల్లాడి కుప్పుస్వామిగారు అధ్యక్షత వహించారు.

సాంస్కృతిక సంఘం వారు అదే సభలో శ్రీ బో... భీమన్నగారిని, వర్ధమాన సినీ, రంగస్థల నటులు శ్రీ బాన్ను ప్రకాష్‌గారిని కూడా సన్మానించారు. (ఒ.వి.)

కథలపోటీ

కీర్తిశేషులు భాస్కరభట్ల కృష్ణారావు స్మారకార్థం ప్రతి సంవత్సరం ప్రచురించబడిన కథలలో ఉత్తమమైనదానికి రు. 116 లు బహుమతి ఏర్పాటు చేయబడ్డది. ఈ పోటీ నవ్యసాహితీసమితి ఆధ్వర్యంలో నడుపబడుతోంది.

1968 ఉగాది వరకు ఒక సంవత్సర వ్యవధిలో ప్రచురింపబడిన కథలలో శ్రీమతి వేదుల శకుంతల గారి "మంచు కరిగే వేళ మనసు నవ్వింది" అనేకథ ఉత్తమమైనదిగా ఎన్నుకోబడింది. ఈ కథ 19—1—68 న ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురింపబడింది.

కవారి వెంకటేశ్వర్లు,
ప్రధాన కార్యదర్శి.

* * *

మద్రాసులో ... చిత్రకళా సమితి ... (క్రిటిక్స్ అకాడెమీ (మద్రాసు) వారు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో శ్రీ సత్యవేటి శ్రీకాంత్, కుమారి సరోజిని, తెరాలి ... వరుసగా మూడు బహుమతుల్ని గెల్చుకున్నారు. సెప్టెంబర్ నెలాఖర్ పరిషత్ సందర్భంలో ఈ బహుమతులు అందజేయబడతాయి. (ఒ. వి.)

* * *

1967 లో అమెరికాలో ధనం విషయమయి మూడు కంపెనీలు లాభాని పెద్దయినే అంతగాని అమెరికన్ ఫెడరల్ వర్కర్ప్ కోర్ ఆఫ్ ఎక్స్‌ప్రెస్ వారు కొట్టివేసారనే వార్తని భారతదేశంలోని "యూనియన్ కంపెనీ ఆఫ్ ఇండియా" వారు పోషిస్తుంది.

[కం ఆల. కె. వా. ఎ.

పుస్తకాలు

రెండు నవలలు

ఆరాధన

శ్రీమతి కోమలాదేవి రచన. 246 పేజీలు. రు. 4 లు. ప్రతులకు: విజయాబుక్స్, మొగల్రాజపురం, విజయవాడ—2.

హృదయం చిగిర్చింది

రచన: శ్రీమతి కె. రామలక్ష్మి. 147 పేజీలు. రూ. 3 లు. ప్రచురణ: నవోదయ పబ్లిషర్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ—2

'ఆరాధన' ఇద్దరు డాక్టర్ల కథ. వైద్యవృత్తి ఆధారంగా కొమ్మూరి వేణు గోపాలరావుగారి 'హౌస్ సర్జన్' ఇంతకుముందు చదివాం. అటువంటిదే ఈ ప్రొఫెషనల్ నవల కూడా. అది ఒక హౌస్ సర్జన్ ఆత్మకథ. ఇది—భార్యాభర్తలయిన ఇద్దరు డాక్టర్ల ప్రేమగాథ. రెండింటి విషయం వాతావరణం ఒక్కటే— రోగులూ, రోగాలూ, హాస్పిటల్సు, ఆపరేషన్లు. నాయకులిద్దరూ ఫారిన్ రిటర్న్స్ కావటం మరో చెప్పతగ్గ పోలిక.

శ్రీమతి కోమలాదేవి సృష్టించిన పాత్రలలో ప్రతివారినీ ఆకర్షించే ప్రత్యేకత కనిపిస్తుంది. డాక్టర్ కుమార్ శీలీ, అతని శ్రీమతి డాక్టర్ మంజు మాటకారితనం చక్కగా చిత్రింపబడ్డాయి. ఒక యింటి ఆడపడుచుగా మంజు పుట్టింటివారి నన్న మాటలు ఎంతయినా సమంజసమని పిస్తాయి. అవి మరపు రావు. ముఖచిత్రం పాత్రలకు ఒప్పేటంత హుందాగా ఉన్నదా అని?

'ఆరాధన' లాగానే 'హృదయం చిగిర్చింది' కూడా ఒక ప్రేమ గాథ. రమ వివాహిత... కడుపు పండిందిగాని ఆమెకు సౌభాగ్యమే కరవయింది. వేరే దారిలేక, తన కాళ్లమీద తను నిలబడటానికని మళ్లీ చదువు సాగిస్తుంది. ఆమె చదువు సాగలేదు. అయినా మోడు వారిన ఆజీవితం వో చిన్న వలప వేస్తుంది. కొద్ది పాటి ఒడుదుడుకులతో ఆహృదయం మళ్లీ చిగిర్చింది.

ఒక చిన్న సమస్యతో రసవంతంగా నడిచిన చక్కటి నవల ఇది. రామలక్ష్మిగారి నవలపాటకుల్ని ఇదివరకే ఆనందింప జేసింది. అయితే పుస్తకరూపంలో రావడం మళ్లీ మళ్లీ చదువుకోవటానికి అవకాశమిస్తుంది.

—శివకుమారి

వేమన చరిత్ర

కర్త: విమర్శకాగ్రేసర శ్రీ బండారు తమ్మయ్య. క్రౌను 22+196 పుటలు. వెల 3 రూ. ప్రకాశకులు: శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాలిక, గాంధినగరం, కాకినాడ—4.

తెలుగుదేశంలో నిరక్షరాస్యులకు కూడా వేమన పద్యాలు తెలుసును. ఇవి ప్రచారం పొందినంత విస్తృతంగా మరే పద్యాలూ, తత్వాలూ, గేయాలూ ప్రచారం పొందలేదు. గత శతాబ్దిలోనే శ్రీ బ్రౌను దొరగారు దీన్ని ఆంగ్లాన వాదంతో కూడా ప్రచారానికి తెచ్చారు. తర్వాత ఎందరో ప్రకాశకులు ఏరిన పద్యాలనూ, లభించినన్ని పద్యాలనూ కూడా వేర్వేరు పుస్తకాలుగా ప్రకటించారు, ప్రకటిస్తున్నారు. గొప్ప యోగీ, ప్రజాకవీ అయిన వేమనను గురించిన చరిత్రలు ఈ శతాబ్దిలో చాలా వచ్చాయి. కొన్ని ఇతర కవుల చరిత్రల నడుమనూ, కొన్ని ప్రత్యేక గ్రంథాలుగానూ కూడా ఉన్నాయి. వీటిలో శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి 'వేమన' అనే ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ విశిష్టమైనది. ప్రాచ్య పద్ధతి విమర్శకులలో అగ్రశ్రేణికి చెందిన శ్రీ తమ్మయ్యగారు చాలాకాలం క్రిందటే వేమనను గురించి 'రెడ్డిరాణి' పత్రికలో కొన్ని వ్యాసాలు ప్రకటించి, ఈ నడుమ వాటిని పూర్తిచేసి యీ గ్రంథ రూపంగా ప్రకటించారు.

వేమన కాలాన్ని గురించి విభిన్నాభిప్రాయాలున్నవి. వేమన 17—18 శతాబ్దాల మధ్య ఉన్నట్లు శ్రీ తమ్మయ్య గారి అభిప్రాయం. దానికి తగిన కారణాలు చూపబడినవి. వేమన వ్రాసిన పద్యాలేవో, ఇతరాలేవో నివాసమేదో మొదలైన విషయాలూ విపులంగా ఉన్నవి. ఏ మతాన్నీ వేమన సమ్మతించకపోయినా, అతడు వీరశైవుడని శ్రీ తమ్మయ్యగారంటున్నారు. ఆ మతంపై ఉండే అభిమానం వల్ల ఇలా చెప్పేరేమో అని అనిపిస్తుంది.

శ్రీ తమ్మయ్యగారు ఈ గ్రంథంలో వేమనను గురించి ఇతరులు వ్రాసిన వాటిని విమర్శించారు. దీన్ని చదివితే అందరి అభిప్రాయాలనూ సులభంగా తెలుసుకోవచ్చును. వేమనను గురించి తెలుసుకోదలచిన వారు తప్పక చదవవలసిన గ్రంథమిది. ఎప్పుడో ప్రకటించిన తమ వ్యాసాలను పూర్తిచేసి, గ్రంథ రూపం యిచ్చిన విమర్శకాగ్రేసరులూ, దీన్ని ప్రకటించిన శ్రీ నిర్మల శైవ సాహితీ గ్రంథమాలికవారూ కూడా అభినందనీయులు.

—అంగీరస

సంఘర్షణ

(47వ పేజీ తరువాయి)

'సల్ఫాడైజిన్ ఇంజక్షన్లి'స్తూ పాత కాలపు వైద్యం చేసినట్టు తెలిస్తే ఏ చిన్న డాక్టరయినా నవ్వుతాడు.

'సల్ఫాడైజిన్'మీదకి తన కలం ఎందుకు పోయిందో డా. రాజారావుకి తెలుసు. మవునంగా ఇంటికొచ్చి ముడుచుకుని పడుకున్నాడు. కుర్రవాడి పరిస్థితి ఏం బాగాలేదు. పరియైన డ్రగ్స్ సకాలంలో పడలేదు.

* * *

మధ్యాహ్నం ఎండ మిటమిటలాడుతోంది.

అప్పుడే ఒక ఆపరేషన్ ముగించి 'వాష్‌బేసిన్లో'చేతులు కడుక్కుంటుండగా మేస్టారబ్బాయికి ప్రాణంమీద కొచ్చిందని కబురొస్తే పరిగెత్తాడు.

వెళ్లేసరికే అంతా అయి పోయింది.

తిరిగొచ్చేసి కొంత విశ్రాంతి తీసుకుందామని మెట్లెక్కి పైకొచ్చాడు.

రామనాథం మేడమీద 'వోపెన్‌వరండా'లో కాచుకుని వున్నాడు.

గడిచిన క్వార్టర్లీ అంటే మూడునెలల జమాఖర్చులూ చూపిద్దామని వచ్చాడు.

'రిజస్టర్లూ' 'వోచర్లూ' అన్నీ టేబిలుమీద పరిచి వివరిస్తున్నాడు.

డాక్టరు మూతి బిడాయించుకుని కూచున్నాడు.

ఈ మెడికల్‌స్టోర్సు డాక్టరిదే అనీ... ఆయన పెట్టుబడిమీదనే అది నడుస్తున్నదనీ...తానేదో జీతం వాటా తీసుకొంటున్నా నెలజీతగాణ్ణి మాత్రమేననీ ...దానిమీద తన యాజమాన్యం నిమిత్త మాత్రమయిందనీ...అక్షరాలా కాదుగానీ...ఆ అర్థం వొచ్చేలా సంజాయిషీ ఇచ్చుకొంటూ పోయే ధోరణి రామనాథానిది.

'ముందూ వెనకా చూసుకోకుండా బావగారు 'ప్రిస్క్రిప్షన్లు' రాసేస్తున్నారు. ఈ నెలాఖరికి 'టయిమెక్స్‌పైర'య్యే మందులు బోలెడున్నాయి. తరవాత మీ యిష్టం' అని 'రిజస్టర్లు' మూసి పెట్టాడు రామనాథం.

డాక్టరు తాచుపాములా బుస్సుమని లేచాడు కుర్చీలోనించి.

అమట్ను 'ఆ రిజిస్టర్లూ' రశీదులూ, బిల్లులూ ... అన్నీ కలగలిపి రామనాథం మొహాన్ని కొట్టాడు.

'యు... యు...గెటవుట్ రాస్కెల్. నువ్వూ. 'నీ స్టోర్సూ', 'నీ స్టాక్సూ' గంగలో కలవండి. ఘడీఘడీకీ లాభనష్టాలు బేరీజు వేసుకొంటో 'ట్రీట్మెంట్లు' సాగించమంటావా నన్ను? ఆ మందు 'ప్రిస్క్రయిబ్' చెయ్యమనీ ఈ మందు 'ప్రిస్క్రయిబ్' చెయ్యమనీ నాకు సలహా ఇవ్వు ఈసారి — తంతాను. ఇకనించీ ఆ 'స్టోర్సూ' 'ఆ క్లినిక్కూ... వాటి లాభనష్టాలతో నాకు నిమిత్తం లేదు — ఆ వ్యవహారాలన్నీ నీ నెత్తినే వేసుకుని వూరేగు—నాకొద్దు.

నువ్వు నా జీవితంలో అడుగు పెట్టక ముందు నేనొక డాక్టర్ని ... రూపాయికి పదహారణాల డాక్టర్ని, అతిశయోక్తి కాదు...ఆత్మస్తుతికాదు, అక్షరాల దేముడి డాక్టర్ని, ఈ రొంపిలోకి దిగిన తరవాత ...నేనొక శిక్ష పడని దొంగని ... దగా కోరుని... ఆశ్చర్యం లేదు ... ఒక హంతకుణ్ణి! మళ్లీ నీ మొహం నాకు చూపావా? ...ఆ...' అని వూగిపోయాడు.

రామనాథం బిత్తరపోయి ... కండువా చంకనానెట్టుకుని... మాట పెగిలి రాక వాణికిపోతో ... ఆ పాటున నిల్చుండి పోయాడు.

రాజేశ్వరమ్మ ఆ గలభాకి లోపల్నించీ వొచ్చేసి... పెనిమిటి నరసింహావతారమ్మీద వున్నది గమనించి అప్రతిభురాలై పోయింది.

'ఇదిగో నువ్వింటులో తల దూర్చావా ...మాట దక్కదు' అని ఆమె వంక ఒక్క ఉరుమురుమి, లోపలికి దూరి, గడియవేసుకున్నాడు డాక్టరు.

* * *

మర్నాడు ఉదయం 'కన్సల్టింగ్ రూం'లో కూచున్నాడు డాక్టరు. ఆయన ముఖం ప్రసన్నంగా వుంది. కిటికీలోనించీరాత్రంతా మంచులో తడిసినమాలతి తెల్లగా పరిశుభ్రంగా మెరుస్తోంది.

కనపడని సంకెళ్లేవో విడుల్చుకున్నట్టయి...ఒక్కసారి, వొళ్లు విరుచుకున్నాడు, మిస్టర్ రాజారావు మళ్లీ డాక్టర్ రాజారావయ్యాడు ఆ క్షణం.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7 Thambu


TOILET POWDER Remy
రెమి R
సౌందర్యసాధనములు